
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 15-6-2025 | పేజీలు: 20 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 60 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: చవితి మ.3.52 తదుపరి పంచమి; నక్షత్రం: శ్రవణం రా.1.00 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.5.02-6.39; దుర్ముహూర్తం: సా.5.02-5.54; అమృతఘడియలు: మ.2.19-3.58; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



NEET 2025 Results

పిల్లలు డాక్టర్ కావాలని ఎన్నో త్యాగాలు చేసి... అలుపెరుగని శ్రమ చేసిన తల్లిదండ్రులకు తమ పిల్లలకు దేశం గర్వించే ర్యాంకులను అందించిన హైదరాబాద్ శ్రీచైతన్య



Smt. Sushma
Academic Director

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1000 లోపు 98 ర్యాంకులు

Rank	Name	Appl. No.
108	R BRAHMANI	250410053079
116	KANDREGULA NITHI	250411110941
129	B V ABHINAY CHOWDARY	250410061099
132	UTKARSH JHA	250410441511*
133	S KAMMUGARI MD SOHAEL	250410233201
158	DIVYA	250410401431
170	TANMAY TEJUS	250411343969*
192	NAGA MANASVINI SIVA	250410556842
206	PRATEEK SINGH	250410166703*
208	ADIVISWAMY MATAM A	250410017501
222	PONTHALA TRIVIKRAM	250410169349
225	PANSHUL SINGH	250410078657*
228	CHADA AKSHITH	250410097993
233	NIVEDITA GUPTA	250410106793*
238	TATINENI SREENIDHI	250411598023
249	V VALLI DEVASENA	250410014655
258	R JAGANNIVASAM	250410083597*
265	SABBANI LALITH VARENYA	250410057971
286	HEM HASITH NATTAVA	250410009889
294	NITESH R DIPALI	250410268406
298	SAUMYE GOYAL	250410002220*
308	SHRUTI BOYANI	250410269921
311	YASHITA	250410303113*
336	P RACHALA SHAINAND	250410061602
341	MOHAMMED YUSUF	250410017595*
345	M VAISHNAVI	250411403613
358	DASARI JAHNAVI	250410750810
363	ANUJ GUPTA	250410719335*
388	LALIT SAI KOSARAJU	250410041557
401	ANAS MUZAFFAR	250410040852
403	ASHUTOSH VERMA	250411080554*
430	OM ANAND	250410002649*
432	AYAN AADEEP	250410016650*
433	PAGADPWAR HARSHIT	250410177804
443	RUCHI GOYAL	250410071325
443	GORANTLA SAI RITHVIK	250410042963
444	KRUTHIKA J	250411497663
464	UNNATI GARG	250411402080 *
469	K AKHIRANAND REDDY	250410050112
473	JASWATH C S	250410134137
510	PRATYUSH PANDEY	250410702013*
516	O AARUSH LAKSHMAN	250410097734
519	SURYANSH SINGH PATEL	250410056570*
551	M CHANDAN ABHINAV SAI	250410600042
553	SIDDHARTH SASIKUMAR	250410002036
565	GURU SAI L V	250410428332
583	AGARWAL ANANYA	250410044730*
601	NAVEEN JAYAVEL V	250410202861
609	DAVAN BABU	250410128098
612	HEMILA PATEL	250410062230*
617	PRITHVI S	250410169533
629	SARTHAK S VALEKAR	250410228418
643	AVANTHIKA SUBASH	250410442476
654	SHAIK NIHAL PARVEZ	250411053698
660	HARISH GOUTHAM	250410235606
672	MARRAPU JAYADEEP	250410050652
681	SYEDA FARIYA ADEEN	250410017889
682	HARDIK KAPOOR	250410007041
706	NALLAM VAMSI KRISHNA	250410077741
710	KOSURI EEKSHITH VARMA	250410620416
714	CHENNAMARAJU PRAKHYA	250410051947
718	BEHARA SAI SAATVIKA	250410081021
723	MADHUMITA JOSHI	250410112256
738	TIRUMANI DEZINY	250410243206
764	NIDHEESH VINAY RAO	250410058172
765	ASHUTHOSH M	250410079723
767	BANDLAMUDI CHANAKYA	250410579953
803	NIHAL SAGAR VISHNU	250410180924
817	ZAHEDA AREEBA	250410026151
830	P RUDRA SRI GANESH	250410282124
840	M AKUL YADAV	250410530843
857	VEDANT PATIL	250410014255*
861	KORADALA PRAGNA	250410383865
871	A TANUSHREE	250410191374
875	GIRADA LAKSHMI CHARAN	250410455787
879	CHETAN SAI V	250410094970
903	ATHARVA	250410588881*
933	ADVIKA MULLAPUDI	250410652496
935	JAVVAJI RUPESH	250410422563

VAIDYAH-26
NEET LONGTERM PROGRAM
Admissions Open

WHILE OTHERS TEACH, WE TRANSFORM ASPIRANTS INTO TOPPERS

Sri Chaitanya's revolutionary **VAIDYAH Program** for NEET Long-Term aspirants has delivered unmatched success in NEET . With a focused curriculum, expert mentorship and rigorous training, 2 out of every 3 students have achieved their dream of entering top medical colleges!

- Personalized guidance by senior faculty
- Daily practice & intensive revision
- Stress-free, student-friendly learning environment
- Proven track record of top ranks and high selection ratio

Merit concessions based on NEET-2025 Marks in Telangana

Marks range	Concession
>370	90%
360 to 369	75%
350 to 359	60%
340 to 349	50%
330 to 339	40%
320 to 329	30%
300 to 319	20%

Note: above concessions are applicable upto 20th June 2025

HYDERABAD: DILSUKHNAGAR ZONE: BOYS RESIDENTIAL: HERITAGE BUILDING A/C: **9177529351** | PANANIYA SEMI A/C: **8247845513** | **GIRLS RESIDENTIAL:** BANDLAGUDA A/C: **8247008202** | LB NAGAR SEMI A/C: **9177034563** | DSNR DAYS ZONAL: **9100114830** | **NARAYANAGUDA** NEW LTC CAMPUS: **9154137370** | **KUKATPALLY ZONE:** BOYS RESIDENTIAL: AGASTYA SRI BHAVAN-3 A/C: **9100984961** | AGASTYA SRI BHAVAN-2 SEMI A/C: **9949436457** | VYAS BHAVAN MALLAMPET: **9963964188** | GIRLS RESIDENTIAL: SAI SOUDHAM-2 A/C: **9177507382** | LAND MARK NON-A/C: **9701640765** | VIDHATHRI BHAVAN SEMI A/C: **8977002958**, **KPHB RAMAN BHAVAN: 9676990309** | **KUKATPALLY DAY SCHOLAR: 9177111845** | **MADINAGUDA**: **9177016306** | **SR NAGAR:** AKSARA BHAVAN: **8099287694**

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Scan the QR code for Registration

Sri Chaitanya ACADEMY

India's Most Trusted
Result-Oriented Coaching Center!

ADMISSIONS OPEN
NEET & IIT-JEE
1 & 2 Years Courses



GUKESH DOMMARAJU
World Chess Champion

HYDERABAD: KUKATPALLY - 91778 67087 | KONDAPUR - 95151 11428 | SUCHITRA - 70931 27444 | TRIMULGHERRY - 91774 44837 | DILSUKHNAGAR - 91774 44326 | HIMAYATHNAGAR - 91774 44341 | AMEERPET - 95151 11054 | SHAIKPET - 91774 44350

Know Your Place Among Crores of Students

Want to Know Your level for National Success? Discover the Only Way to Find Out...

India's largest scholarship amount
Get UPTO **100% SCHOLARSHIP***
- NASA Trips
- Gadgets
- Cash Prizes

SCORE 2025 FOR GRADES 7-12
INDIA S LARGEST SCHOLARSHIP EXAM

For students of classes 3 to 11 (CBSE & STATE)
శ్రీచైతన్య స్కూల్ టెక్నో కరిక్యులమ్
Sri Chaitanya Educational Institutions | Infinity Learn

రిజిస్ట్రేషన్లు జరుగుతున్నవి
Scan the QR code for Registration

Exam Dates » 28 సెప్టెంబర్ & 12 అక్టోబర్ 2025

SCHOOL: 040 7104 5045 | COLLEGE: 040-6606 0606 | SCORE: 1800 121 600 600 | INFINITY LEARN: www.infinitylearn.com/score

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 15-6-2025 | పేజీలు: 20 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 60 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: చవితి మ.3.52 తదుపరి పంచమి; నక్షత్రం: శ్రవణం రా.1.00 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.5.02-6.39; దుర్ముహూర్తం: సా.5.02-5.54; అమృతఘడియలు: మ.2.19-3.58; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

TOP RANKS IN ALL CAT.

Rank	Name
112	MUSKAN ANAND
114	KVISHWAK AGARWAL
116	DEEPIKA T M
124	CHITTANOOR Y
126	DASARI SRI SAI P
147	R SREESHANTH
151	SANSKAR SHARMA
160	KATARIYA SAGAR
161	KAVIN S E
163	ADITYA CHAUDHARY
166	BORELLI SUJITH
171	HARSHIT GINOTRA
172	YV VARAPRASAD
184	KRISSHANK B A
190	V R MATHURITHA
193	ADITYA KUMAR
196	ADITYA V PARMAR
196	V SINDHUSRI
212	HEET KUNDARIYA
212	M MANVITHA REDDY
220	Daksh Kumar
224	RAAGHAVI BYALAL
231	J P ABHIINAVA
237	SIDHARTH JARUPLA
253	POGULA SRIRAM
256	HARISHRAJ D V
263	K PRAJWAL SINGH
282	ANVESHA
299	PRISHA ARORA
301	SABAVAT RAMU NAIK
320	KEDARI GANESH
320	NIRANJAN G H
320	SHASHWAT MOHAN B
321	SUPREETH S
323	N YOGESH KARTHIK
327	JATIN KUMAR
331	Dishita
332	RISHIK MADAN JAI
335	PAGIDALA DEEPIKA
337	MANDAVA JAI SIMHA
343	M HANSIKA REDDY
344	BHUMI SINHA
344	DESHGAURAV YADAV
346	RUCHITHA B S
350	KAJAL DHAKARIYA
352	VEMPATI LAKSHITA
353	B PRASANDEEP
365	NAVNEET V
367	P ROHITHA REDDY
374	TARPIT SHAH
377	PUJARI HASINI
379	ANKITA KABIRAJ
379	D AKSHAY KEERTHAN
395	MOODU PAVANI
401	CHILAMKURI NITYA SRI
405	ADYASHA ANURADHA J
412	KOLLURU SRI LAKSHMI
413	KARNIK KAKADIA
419	V GURU PARDHIV
425	HIMNISH BABARIYA
430	TVSS AKSHAY KUMAR
431	R GOVARDHAN
435	YUVRAJ GHAI
447	ANISH KHANDELWAL
458	SANJHANA J KUMAR
459	JAYASRI A S
480	JEEVAN RAJ G
484	MEKALA RENUKA
486	J M RUTHVIK
502	K TRIDAL VARDHAN
515	BULA NAIMESHA
515	M VENKATA SRINIVAS
517	S SHANMUGHA
520	M GERARD JOSEPH
532	TERLI VISHWAK
534	D NITHIN KUMAR
536	K SRIRAM YADAV
546	S VAISHNAV KUMAR
562	M SESHA SAI CHARAN
563	P LALIT SHRIHAS
585	G SRUTHI HASINI
605	KAKARALA NIKITA
607	DHRUTI BHADUKIYA
609	BOYAPATI DURGA Y
628	MAYANK SAHU
632	BATHULA MOUNIKA
638	BK AKSHITHA
645	VARSHITH H
646	N YASHASWINI
646	T NIKHILA
649	DEON JINS
657	BHAVANASI ESHANTH
666	A NIKHIL KUMAR REDDY
670	JATIN
684	SHAIK MOHAMMAD A
687	SHIVAM
692	D HANUMANTHU NAIK
698	ADITI VIPULKUMAR P

Due to space constraints, only a few achievers are shown.



Scan QR For Admissions

NARAYANA

N-VAIDYA-2026
NEET LONG TERM BATCH

ADMISSIONS OPEN

ATTRACTIVE FEE CONCESSIONS FOR MERITORIOUS STUDENTS

Programme's Features

- Special focus on the critical concepts of Physics & Chemistry.
- Multiple Conceptual Tests for improvement in numerical solving abilities in Physics & Chemistry.
- A thorough and effective academic follow up on the specific grey areas of every student.
- Special motivational classes as per students' requirement.
- Regular analysis and error rectification.

Merit concessions based on NEET-2025 Marks

MARKS in NEET-2025	% OF CONCESSIONS IN TUITION FEE	MARKS in NEET-2025	% OF CONCESSIONS IN TUITION FEE
> 370	90%	330-339	40%
360-369	75%	320-329	30%
350-359	60%	300-319	20%
340-349	50%		

NEET LONG TERM BATCH STARTS FROM 18th JUNE 2025

Trust Narayana to fulfil your NEET dreams, as #YourDreamsAreOurDreams

2024 లాంగ్ టర్మ్ కోచింగ్ లో నారాయణ ని నమ్మారు. 2025 NEET లో నారాయణ తో గెలిచారు

STUDENT NAME	NEET-2024 MARKS	NEET-2025 MARKS	INCREASED MARKS	STUDENT NAME	NEET-2024 MARKS	NEET-2025 MARKS	INCREASED MARKS
SAFA SAIF QURAISHI	277	585	+ 308	PAVAN KATTAMANCHI	168	422	+ 254
KOTHA KAMALA RAO	242	562	+ 320	AKANKSHYA SWAIN	155	415	+ 260
P V SAI JITHENDRA NAATH	258	543	+ 285	SREEJA EDURU	206	414	+ 208
MOKATI SRINADH	143	474	+ 331	GANTA BHOOMIKA	158	407	+ 249
ABHILASH CHILUVERU	267	469	+ 202	RAM KARAN SINGH	199	403	+ 204
K V M SRI HARSHA	183	461	+ 278	KONDRATHI ARUNTEJ	170	400	+ 230
S NANDINI	146	433	+ 287	SIRISHA SANAPATHI	133	399	+ 266
GADDAM CHARAN TEJA	122	431	+ 309	WALTHATI PAWANKUMAR	172	379	+ 207
RENUKA MADIKI	221	430	+ 209	MARRI HIMABINDU	171	373	+ 202

NARAYANA® EDUCATIONAL INSTITUTIONS

NEET LONG TERM BRANCHES: DAY CO-ED BRANCHES • WARANGAL - Ph: 9912349697. • NIZAMABAD - Ph: 8179921758. • KARIMNAGAR - Ph: 8179881182. HYDERABAD • SR NAGAR - Ph: 8179880514, 9989689092. • TARNAKA - Ph: 9908017009. KPHB - Ph: 9912345077, 8523042369. • DILSUKHNAGAR - Ph: 9912396620, 9912344602. • NARAYANAGUDA - Ph: 9618260708.

HYDERABAD RESIDENTIAL BRANCHES BOYS: KOTHAPET - Ph: 8179880537, 9912261878 • BOYS: MADHAPUR - Ph: 9912341118, 9912342215 • BOYS: BACHUPALLY - Ph: 9912343354 • GIRLS: PATI - Ph: 9848359069, 9963193866. • GIRLS: BANDLAGUDA - Ph: 9912343880, 9912347315. • GIRLS: BACHUPALLY - Ph: 8179946382, 7794810008. • GIRLS: MADHAPUR - Ph: 8801945584.

Disclaimer. Any inadvertent error published in this advertisement could be brought to our notice

Toll Free: 1800 102 3344 | www.narayanagroup.com

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ASBL
BROADWAY
THE PULSE OF LIFE

ఆదివారం | 15-6-2025 | పేజీలు: 20 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 60 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: చవితి మ.3.52 తదుపరి పంచమి; నక్షత్రం: శ్రవణం రా.1.00 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.5.02-6.39; దుర్ముహూర్తం: సా.5.02-5.54; అమృతఘడియలు: మ.2.19-3.58, రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

The PRIDE of TELANGANA | MAHARASHTRA

The PREMIER for IIT | NEET Coaching

Dr.V. NARENDER REDDY
Chairman

ALPHORES IIT & NEET ACADEMY

Sets the HISTORY with the SENSATIONAL MARKS in NEET-2025



The Premier Academician Dr.V.NARENDER REDDY garu, Chairman, with the ALPHORESIANS who achieved the BEST NATIONAL MARKS

599 V. SHASHANK REDDY

556 B. VARSHITH

553 ADIBA FIRDOS

535 J. MYTHILI PATEL

513 MD. AFNAN	508 B. BHUVANA KRUTHI	507 A. SATHWIKA	500 J. ANUSHA	496 K. SAI SHRIYANS REDDY
481 P. AKSHAYA	480 K. ARCHANA	477 NIMRA MALIHA	476 ISSA MAHVEEN	471 AISHA SAMREEN
468 SYEDA KHADIJAH FAREEHA	462 UMME AYMAN	462 V. VISHAL REDDY	460 SYEDA AYESHA FATHIMA	459 SAMIYA ZAINAB
458 K. MANOJ KUMAR	457 M. PRANEETH	456 ZEENATH FATHIMA	454 NIDA	453 BISHWAS ABHINAV
452 Y. NIRMAL KIRAN	450 P. HARINI	& MANY MORE		

Gets the GREAT ALLOTMENTS in IITs | NITs | IIITs in ROUND1

EXPECTING many more in the FURTHER ROUNDS

A.PURUSHOTHAM NAIK IIT - MADRAS MECHANICAL ENGG.	V. SANJEETHA REDDY IIT -KHARAGPUR CIVIL ENGG.	M. AKARSH IIT -KHARAGPUR METALLURGY ENGG.	VISHNU MOGILI IIT -KHARAGPUR CHEMICAL ENGG.	D. ABHIRAM IIT-KHARAGPUR FOOD & AGRICULTURE ENGG.
P. PARINITHA IIT -KHARAGPUR OCEAN & NAVAL ARCHITECTURE	K.VEERENDRA PRASAD IIT - KHARAGPUR AEROSPACE ENGG.	B. AARYAN IIT - KHARAGPUR ARCHITECTURAL ENGG.	P.N. SAI DHRUVA IIT- GUWAHATI EEE	J. VAMIKA IIT-GUWAHATI DS & AI IIIT- HYD CSE
M. AKSHITHA IIT-HYD INDUSTRIAL CHEM. ENGG.	M. SATHWIKA IIT-HYD CHEMICAL ENGG.	Z. AYUSHI KRISHNA IIT-HYD INDUSTRIAL CHEM. ENGG.	N. ANIRUDH SAI IIT -HYD ELECTRICAL ENGINEERING	M. GANESH NIT, TIRUCHIRAPPALLI CIVIL ENGG.
S. VISHNU ABHINAV IIT-VARANASI MINING ENGG.	B. VISHNU IIT -DHANBAD MINING ENGG.	M. BAVYASRI IIT -DHANBAD PETROLEUM ENGG.	V. HRUSHIKESH IIT -INDORE ELECTRICAL ENGG.	B. CHAISHRAV RAJ IIT -GANDHINAGAR MECHANICAL ENGG.
K. ANANYA SRI NIT-WARANGAL CHEMICAL ENGG.	E. ANKITH SAI NIT -WARANGAL CSE	K. SRI RAM NIT -WARANGAL EEE	KARTHIK REDDY NIT-WARANGAL MECHANICAL ENGG.	A.SHASHI PREETHAM NIT-WARANGAL ECE
MD. ABDUL HAQ NIT-WARANGAL ECE	VISHAL DASARI NIT -WARANGAL CSE & DSAI	A. SRINIJA REDDY NIT -WARANGAL CHEMICAL ENGG.	M. ADITYA REDDY NIT -WARANGAL MECHANICAL ENGG.	A. ANIRUDH NIT -WARANGAL ECE
R. SUMITH KUMAR NIT -WARANGAL ECE	E. MRUNALINI NIT -RAIPUR CSE	MD. ABDUL ZEESHAN NIT-WARANGAL ECE	T. HIMA SREE NIT -WARANGAL EEE	K. RAGHAVENDRA NIT- WARANGAL MECHANICAL ENGG.
G. SAI SRIVAS NIT-WARANGAL CHEMICAL ENGG.	C. SAI SUMUKH NIT -WARANGAL ECE	D. SUPRIYA NIT - WARANGAL MECHANICAL ENGG.	L.SHARANYA NIT-WARANGAL ECE	P. SRIHARSHA NIT-WARANGAL EEE
V. AKSHAY IIT-PATNA MECHANICAL ENGG.	T. SAI VIGNESH NIT -DELHI MECHANICAL ENGG.	R. JASHWANTH IIT BHUBANESWAR METROLOGY	MD. SHAKEER RAYYAN NIT-WARANGAL BIO-TECH. ENGG.	R. GOVARDHAN IIT-DHARWAD INTERDISCIPLINARY SCIENCE
V. PREETHI IIT-GOA MATHEMATICS & COMPUTING	B. SATHWIK IIT-MANDI MECHANICAL ENGG.	ZAIN AHMED IIT-PALAKKAD ELECTRICAL ENGG.	B.VISHAL NIT-A.P. MECHANICAL ENGG.	M. SRAVYA NIT-MANIPUR EEE
GOPIKA HARSHITHA NIT-A.P. EEE	M. PRANAY SAI NIT-JAIPUR CSE	P. SRIHITHA NIT-SILCHAR COMPUTER SCIENCE	P. TEJPAL NIT-SRINAGAR MECHANICAL ENGG.	ADITHYA .B NIT-BHUPAL CSE
P. MANIDEEP NIT-RAIPUR MECHANICAL ENGG.	S. HARSHITH NIT-PUDUCHERRY CIVIL ENGG.	K. HITHAHASIN NIT-JALANDHAR CHEMICAL ENGG.	B. RUTHIKA NIT-NAGPUR EEE	J. BHAVYESH NIT-SILCHAR CIVIL ENGG.
G.MANISH NIT-PATNA CIVIL ENGG.	SUDEEKSHA NIT-CALICUT CIVIL ENGG.	S. VIGNESH IIIT-GUWAHATI CSE	N. RAMCHARAN IIIT-KURNOOL CSE	C. AKHIL REDDY IIIT-BILASPUR CSE
P. SRINITHYA REDDY IIIT KANCHEEPURAM CSE	K.SRINIDHI IIIT-DHARWAD ECE	K. ABHIGNA IIIT-KOTTAYAM CSE	SHARAT CHANDRIKA CENTRAL UNIVERSITY- HYD CSE	B. CHANDRADEEP CENTRAL UNIVERSITY, RAJASTHAN ECE
SHRIHAN GFTI HARIDWAR ECE	B. RUTHVIK SAI GFTI- HYD CSE	G. CHARAN TEJA GFTI-BHILAI CSE	D. JESHWANTH IIEST-SHIBPUR MINING ENG.	C. ABHIRAM IET, Dr. H.S. GOUR UNIVERSITY-SAGAR ECE
E. SIDHARTHA REDDY MIZORAM UNIVERSITY, AIZAWL ECE	T. KSHETRA GURU GHASIDAS VISHWAVIDYALAYA, BILASPUR PRODUCTION ENGG.	K. SRIVARDHAN CENTRAL UNIVERSITY, HARYANA ELECTRICAL ENGG.	B. KEERTHAN RAJ NIT-ASSAM EEE	N. SHARANYA NIT ALLAHABAD CSE
				VATHSALYA NIT- CALICUT ECE

LONG TERM IIT - JEE & NEET 2026 ADMISSIONS OPEN

BEST CONCESSIONS to the BEST SCORERS...HURRY UP !

....Always LEADS in all STREAMS

Delightful Greetings to the Glorious ALPHORESIANS | STAFF | PARENTS

HYDERABAD: SUCHITRA ALWAL 91608 61444 | GHATKESAR 91601 28444 | KARMANGHAT 92468 34441
NEW NALLAKUNTA 91608 67444 | HASTINAPURAM 91339 73444
KARIMNAGAR 91335 88857, 91602 94441 | JAGTIAL 92470 66444 | HANAMKONDA 91333 12830
MANCHERIAL 9160264443 | NIRMAL 91602 94446 | ARMOOR 91604 63444 | NIZAMABAD 91604 15444

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 15-6-2025 | పేజీలు: 20 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 60 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: చవితి మ.3.52 తదుపరి పంచమి; నక్షత్రం: శ్రవణం రా.1.00 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.5.02-6.39; దుర్ముహూర్తం: సా.5.02-5.54; అమృతఘడియలు: మ.2.19-3.58; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డును బాలకృష్ణకు, ఉత్తమ నటుడు అవార్డును అల్లు అర్జున్‌కు అందజేస్తున్న సీఎం. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, దిల్‌రాజు

భూదాన్ భూములపై భారీ కుట్ర!

ఫోర్జరీతో రికార్డుల మార్పు.. సమగ్ర దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు బయటకు

హైకోర్టులో ఈడీ కౌంటర్ దాఖలు.. చట్టబద్ధంగా కొన్నామన్న ఐఏఎస్, ఐపీఎస్‌లు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నాగారం భూదాన్ భూముల అన్యాక్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సంచలన విషయాలను వెల్లడించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని 181, 182, 194, 195 తదితర సర్వే నంబర్లలో ప్రభుత్వ భూదాన్ భూములపై జరిపిన ప్రాథమిక దర్యాప్తులో లోతైన కుట్ర ఉందని స్పష్టంగా తెలుస్తోందని చెప్పింది. ఫోర్జరీ, దొంగ డాక్యుమెంట్లు పెట్టి.. రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని, తహసీల్, జిల్లా, సీసీఎల్ఏ స్థాయిలో వాస్తవ రికార్డుల్లో ఉన్న విషయాలను పక్కనబెట్టి, రెవెన్యూ అధికారులు దొంగ పత్రాలను స్వీకరించారని తెలిపింది. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే.. మరిన్ని విషయాలు బయటకు వస్తాయని అభిప్రాయపడింది. ఈ మేరకు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. ఏపీ, తెలంగాణకు చెందిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నాగారంలోని భూములకు సంబంధించి ఫోర్జరీ పత్రాలతో రెవెన్యూ రికార్డులను

మిగతా 9వ పేజీలో...



విద్యుత్తు సంస్థల్లో కొలువుల మేళా

నాలుగు సంస్థల్లో 5,368 పోస్టుల ఖాళీ

డిస్కమ్‌లలో 4175, ట్రాన్స్‌కోలో 703, జెన్‌కోలో 490 ఖాళీలు

బీటెక్/బీఈ, డిప్లొమా ఎలక్ట్రిక్, ఐటీఐ పూర్తి చేసిన వారికి అవకాశం

12

కఠినంగా కనిపించినా..

అభిమానమే!

- సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తాం
- ప్రభుత్వపరంగా కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు
- కానీ, మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటాం
- 'తెలంగాణ రైజింగ్-2047' డాక్యుమెంట్‌లో..
- ఒక చాప్టర్ సినీ పరిశ్రమకు కేటాయిస్తాం
- దానికి తగ్గట్లుగా ప్రణాళికను రచించండి
- రాష్ట్ర అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కావాలి
- ఇంకా 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో ఉంటా
- గద్దరన్న అంటే ఒక చైతన్యం.. ఒక విప్లవం
- గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్
- కన్నుల పండువగా అవార్డుల వేడుక

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా కనిపిస్తుంది. ప్రభుత్వాన్ని నడిపేటప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. కానీ, మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటుంది. మీ అభివృద్ధికి నూటికి నూరు శాతం తోడ్పాటునందిస్తుంది. మిమ్మల్ని ప్రోత్సహించడానికి, అభినందించడానికి, మీకు సముచిత స్థానం కల్పించడానికి ప్రయత్నం చేస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సినీ ప్రముఖులను ఉద్దేశించి అన్నారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీని సాధించాలన్న లక్ష్యంతో రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌లో ఒక చాప్టర్‌ను సినీ పరిశ్రమకు కేటాయిస్తున్నామని తెలిపారు. దానికి తగినట్లుగా ప్రణాళికను రచించాలని సినీ ప్రముఖులకు సూచించారు. శనివారం రాత్రి హైటెక్స్‌లో జరిగిన 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల' ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. "సుమారు 14 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనిని నిర్వహించాలని సినీ ప్రముఖులు, దిల్‌రాజు వంటివారు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు

మిగతా 13వ పేజీలో...

గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్లు మంజూరు

అత్యధిక మార్కులు 686

ఈసారి నీట్ కఠినం.. తగ్గిన మార్కులు, ఉత్తీర్ణుల సంఖ్య

- తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నిరాశే.. టాప్-20లో ఇద్దరే.. టాప్-100లో 11 మంది
- రాజస్థాన్ విద్యార్థి మహేశ్‌కుమార్‌కు టాప్ ర్యాంకు
- 18వ ర్యాంకుతో దక్షిణాది రాష్ట్రాల్లోనే టాపర్‌గా
- హైదరాబాద్ విద్యార్థి కాకర్ల జీవన్ సాయికుమార్
- 19వ ర్యాంక్ సాధించిన ఏపీ విద్యార్థి కార్తీక్‌రామ్ కిరీటి
- టాప్ ర్యాంకుల్లో బాలురు.. ఉత్తీర్ణతలో బాలికలు ముందు
- జనరల్ కటాఫ్ 144 మార్కులు



జీవన్ (18వ ర్యాంకు)

వరుణ్ (46వ ర్యాంకు)

రోజుకు 14 గంటల పాటు చదివా.. 'ఆంధ్రజ్యోతి'తో జీవన్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్ పరీక్ష ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నిరాశే ఎదురైంది. ప్రతిసారీ టాపర్లలో నిలిచే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈసారి టాప్-10లో ఒక్కరు కూడా చోటు దక్కించుకోలేకపోయారు. టాప్-20లో ఇద్దరే నిలవగా.. టాప్-100లో మాత్రం 11 మందికి ర్యాంకులు వచ్చాయి. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) శనివారం నీట్ ఫలితాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 22.76 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 22.09 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 12.36 లక్షల మంది (56 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదితో పోలిస్తే 79,322 మంది తక్కువ. ఈసారి నీట్ పరీక్ష కఠినంగా ఉండటం, ముఖ్యంగా ఫిజిక్స్ ప్రశ్నలు మరింత కఠినంగా రావడంతో.. విద్యార్థులకు మార్కులు, ఉత్తీర్ణులైన వారి సంఖ్య తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. గతంలో నీట్‌లో టాపర్లకు గరిష్ఠంగా 720 వరకు కూడా మార్కులు రాగా.. ఈసారి టాప్ మార్కులు 686కే పరిమితం కావడం గమనార్హం. నీట్‌లో రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్ మొదటి ర్యాంకు (99.9999547 పర్సంటైల్‌తో), మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ రెండో ర్యాంకు (99.9999095 పర్సంటైల్), మహారాష్ట్రకు

మిగతా 14వ పేజీలో...

ఇరాన్‌లో భారీ విధ్వంసం

ఆర్థిక మూలాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు

- రెండు కీలక చమురు క్షేత్రాలపై బాంబుల వర్షం
- ఇరాన్ చుట్టూ 78 ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు
- 150 టార్గెట్లపై దాడులు.. 78 మంది మృతి
- ఆర్మీ, ఎమర్జెన్సీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌ల దుర్మరణం
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడిలో ముగ్గురి మృతి

టెల్‌అవీవ్/న్యూఢిల్లీ, జూన్ 14: ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో భారీ విధ్వంసం జరుగుతోంది. శనివారం తెల్లవారుజాము వరకు ఇరాన్ క్షిపణి కేంద్రాలనే లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్.. సాయంత్రం తొలిసారి ఆర్థిక మూలాలపై విరుచుకుపడింది. బుషెహర్ చమురు క్షేత్రాలు (ఇక్కడే అణు విద్యుత్తు కేంద్రం ఉంది), సౌత్ పార్స్ న్యాచురల్ గ్యాస్ క్షేత్రాలపై దాడులు చేసింది. ఆ ప్రాంతాల్లో పెద్దఎత్తున మంటలు

మిగతా 11వ పేజీలో...



విమాన ప్రమాదంపై ఉన్నతస్థాయి కమిటీ

- కూలడానికి కారణాలపై పరిశీలన
- భవిష్యత్తు భద్రతపై రోడ్‌మ్యాప్
- 3 నెలల్లో కమిటీ నివేదిక వస్తుంది
- యాక్సిడెంట్‌లో తండ్రిని కోల్పోయా
- బాధిత కుటుంబాల ఆవేదనను అర్థం చేసుకోగలను: రామ్మోహన్‌నాయుడు
- 274కు చేరిన మృతుల సంఖ్య

12

కల్తీ ఇంధనమే కూల్చిందా?

- 2 ఇంజన్లు విఫలమయ్యే చాన్స్ తక్కువే
- ఎన్ఏఎల్ మాజీ అధికారి మురళీధర్



చిత్రపతి శివాజీ బొమ్మల సేన!

బొమ్మలు నిర్భయ ప్రకాశికలు. తెగువకి, ఎదురీతకి, నిలదీతకి నిజదర్శనాలు. ఒంటి రేఖాచిత్రమైనా సరే... కోటి సిపాయిల బలాన్ని మించిన శక్తివంతం. ఒక వ్యంగ్యచిత్రం లక్ష అక్షరాలలో పొదిగిన భావానికంటే కూడా మహా మిన్న. వందశాతం గురి తప్పని బాలిస్టిక్ క్షిపణితో సమానం. ఇవి అతి శయోక్తులు కావు. క్రూర నియంతలను, కర్కోటక చక్రవర్తులను వేలెత్తి చూపి వెక్కిరించిన కార్టూనిస్టులు, చిత్రకారుల జీవిత కథలు కోకొల్లలు. ఏ ప్రజా కళకైనా ఉండేది అంతటి పదునే. అందుకే పాలకులకు అవంటే అస్సలు గిట్టదు.

పైకి వినిపించకపోవచ్చును గానీ బొమ్మలు మనతో సంభాషిస్తాయి. మనలోని ఖాళీలను ప్రేమతనంతో నింపుతాయి. శైశవ గీతాలకి కోరస్ ఇస్తాయి. మనసుకి గాయమైతే మందు పూస్తాయి. నిస్పృహ పుటని మూసేసి ఆశల మీటని సుతారంగా తడతాయి. ఈ ఊరడింపే కళా ప్రయోజనానికి సూచిక. ఈ వరుసలో ఇప్పుడు తలుచుకోవలసిన ముఖ్యులు తల్లావజ్ఝల శివాజీ. ఆయన సీనియర్ పాత్రికేయుడు, చిత్రకారుడు, రచయిత, కళా విమర్శకుడు. ఆయన రాతలో, గీతలో హాస్యమూ, సున్నితత్వమూ సమతూకంలో ఒదిగిపోతాయి. విషయం ఎంత గాఢమైనదైనా ఇట్టే జీర్ణమైపోవడం ఆయన చిత్రాల స్వభావం. ఒకానొక కాలంలో ఆర్టిస్ట్ రాజుతో కలిసి ఆయన సృష్టించిన 'లింగా ది గ్రేట్' కార్టూన్ కదంబం సూపర్ డూపర్ హిట్. అంతకంటే ముందే 'ఆ నీలి నగరిలో' పేరుతో శివాజీ ఒక నవలిక రాశారు. నగరానికి వచ్చిన ఒక బాలుడి జీవితంలో జరిగే సంఘటనలే ఇందులో కథాంశం. పిల్లల కోసమే శివాజీ ఎక్కువ ఆలోచిస్తారనడానికి ఇది మరొక దాఖలా. ప్రస్తుత ప్రస్తావనకి హేతువు కూడా ఇక్కడే ఉంది. గాజాలో గత కొన్ని నెలలుగా సాగుతున్న భీకర దాడుల్లో అసంఖ్యాకంగా పిల్లలు మరణించారు, మరణిస్తున్నారు. గాయపడ్డ చిన్నారుల సంఖ్య అంతకు అనేక రెట్లు అధికం. తప్పొప్పుల లెక్కలను అలా ఉంచితే, ఏ యుద్ధంలో అయినా అతిగా ఛిద్రమయ్యేది పిల్లలు, స్త్రీలు, వృద్ధుల జీవితాలే. గాజాలో ఇజ్రాయిల్ దళాల దాడుల్లో సాగుతున్న శిశువధ పట్ల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయిల్ పౌరసమాజం కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న సందర్భాలున్నాయి. ఎక్కడికక్కడ కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు, చిత్రకారులు సహా వివిధ శ్రేణులవారు రకరకాల రూపాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తల్లావజ్ఝల శివాజీ డజను వరకు చిత్రాలు వేశారు. 'ఓ.. నౌ వెకేట్ గాజా లిటిల్ డియర్', 'ప్లాంట్ హోప్ @ గాజా', 'ఐ లవ్ వార్ ఎనీ వేర్', 'లెట్ దేర్ బి హోప్.. గాజా', 'వెయిట్ యు విల్ హావ్ సమ్ మోర్.. గాజా' వంటి క్యాప్షన్స్‌తో శివాజీ వేసిన ఈ చిత్రాలు కార్టూన్ శైలిలో ఉన్నప్పటికీ, వ్యంగ్యం కంటే విషాదస్పర్శే మనసుని తాకుతుంది.

> క్రూర నియంతలను, కర్కోటక చక్రవర్తులను వేలెత్తి చూపి వెక్కిరించిన కార్టూనిస్టులు, చిత్రకారుల జీవిత కథలు కోకొల్లలు. ఏ ప్రజా కళకైనా ఉండేది అంతటి పదునే. అందుకే పాలకులకు అవంటే అస్సలు గిట్టదు.

జెరూసలెంలోని హిబ్రూ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డేవిడ్ షుల్మన్ ఇండియన్ స్టడీస్‌లో తులనాత్మక మత అధ్యయనం విభాగంలో ప్రొఫెసర్‌గా దీర్ఘకాలం పనిచేశారు. ఆయన కవి, చరిత్రకారుడు, ఇండాలజిస్ట్ కూడా. దక్షిణ భారత మత చరిత్ర, భారత రాజకీయాలు, ద్రవిడ భాషాశాస్త్రం, కర్ణాటక సంగీతం వంటి అంశాలలోనూ ఆయన నిష్ణాతులు. తమిళ, తెలుగు, హిందీ, సంస్కృత భాషల్లో పట్టున్న విద్యాధికుడు, పీస్ యాక్టివిస్ట్ కూడా. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఆ దేశ పౌరసమాజంతో కలిసి అనేక నిరసన ప్రదర్శనలు నిర్వహించారాయన. శివాజీ సోదరులు తల్లావజ్ఝల పతంజలిశాస్త్రికి షుల్మన్‌తో స్నేహ సంబంధాలు ఉండటంతో శివాజీ వేసిన చిత్రాలను షుల్మన్‌కి పంపించారు పతంజలిశాస్త్రి. వాటిని చూసిన షుల్మన్ ఎంతో ఆసక్తి కనబరిచి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఇజ్రాయిల్ పాలకుల వైఖరిని నిరసించే అక్కడి పౌరసమాజ ప్రముఖుడి ప్రశంసలందుకున్న చిత్రాలు ఈ శివాజీ బొమ్మలు.

గాజాపై సాగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ నేడు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని లా మకాన్‌లో 'హైదరాబాద్ ఫర్ ద చిల్డ్రన్ ఆఫ్ గాజా' పేరుతో ఒక కార్యక్రమం జరుగుతున్నది. ఇందులో కవి గాయకులు, చిత్రకారులు, కళాకారులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటున్నారు. ఈ తరుణంలో శివాజీపై గౌరవంతో ఆయన చిత్రాలను పోస్టర్లుగా తీర్చి ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. యుద్ధ వ్యతిరేక చిత్రకారుడు, చిన్నారుల శ్రేయోభిలాషి శివాజీకి అభినందనలు.

○ ఒమ్మి రమేష్‌బాబు

సింధు జీవధార సమరాయుధమా?

ఒక దేశం యుద్ధంలో ఉన్నప్పుడు ఆ దేశ ప్రజలు, నాయకులు శత్రుదేశానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రకటనలు చేస్తారు. అవి ఆచరణ సాధ్యంకాకున్నా సరే. కానీ, బాధ్యతాయుతమైన నాయకులు ఆ ప్రకటనలను పదేపదే పునరుద్ఘాటిస్తే దేశ ప్రయోజనాల దృష్ట్యా వాటిని నిశితంగా పరిశీలించవలసి ఉన్నది. సింధు నదీజలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ– ఐడబ్ల్యుటి) విషయంలో అటువంటి పరిస్థితే ఇప్పుడు భారత్‌కు తటస్థించింది.

సింధు నదీజలాల ఒప్పందం గురించి రాజకీయవేత్తలు ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నప్పటికీ అది కాల పరీక్షకు నిలిచింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగినా వాటి ప్రభావం దాని అమలుపై పడలేదు. ఆ ఒప్పందాన్ని చారిత్రక తప్పిదంగా కొందరు ఘోషిస్తున్నారు. ఇది వివేకవంతమైన అభిప్రాయం కాదు. అంతకంటే మెరుగైన, ఉభయత్రా మేలైన ఒప్పందం ఇప్పుడు సాధ్యం కాదు.

ఇరుగు పొరుగు దేశాలతో ఉమ్మడి నదీ పరీవాహక ప్రాంతాలున్న దేశం భారత్ మాత్రమే కాదు. ప్రపంచ వ్యాప్తంగా కనీసం 286 నదీ పరీవాహక ప్రాంతాలను ఒకటి కంటే ఎక్కువ దేశాలు కలిగి ఉన్నాయి. 150కి పైగా దేశాలు వివిధ నదీ పరీవాహక ప్రాంతాలను పంచుకుంటున్నాయి. రాజకీయ సరిహద్దులను అధిగమించే నదీ పరీవాహక ప్రాంతాలు ప్రపంచ భూ విస్తీర్ణంలో 42 శాతంగా ఉన్నాయి. ఈ పరీవాహక ప్రాంతాలలో 300 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ రివర్ బేసిన్‌ల నిర్వహణ, యాజమాన్యం వివిధ ఒప్పందాలకు అనుగుణంగా జరుగుతోంది. మన దేశం వివిధ నదీ పరీవాహక ప్రాతాలను డజన్‌కు పైగా దేశాలతో పంచుకుంటున్నది. ఆయా ప్రాంతాలకు భారత్ ఎగువ దేశంగాను, దిగువ దేశంగాను ఉన్నది. నదీజలాల పంపకానికి సంబంధించి అనేక అంతర్జాతీయ ఒప్పందాలు, మార్గదర్శక సూత్రాలు, చారిత్రక రివాజులు ఉన్నాయి. ప్రపంచ అగ్రరాజ్యంగా ప్రభవించాలని ఆకాంక్షిస్తున్న భారత్ వాటన్నిటినీ గౌరవించవలసి ఉన్నది. అది అనివార్యం. నీరు, ప్రాదేశిక హక్కులు ఉన్న భూమి కాదు. నది సదా దిగువకే ప్రవహిస్తుంది. వివిధ చట్టాల ప్రకారం నీటి నిర్వహణ, యాజమాన్యం ఉంటుంది. ఇది ఎవరూ కొట్టివేయలేని సత్యం.

నదీ పరివాహక ప్రాంతాలకు సంబంధించిన ఒప్పందాలలో సింధు నదీజలాల ఒప్పందం (ఐడబ్ల్యుటి) కొంత మేరకు భిన్నమైనది. 1947లో దేశ విభజన కాలం నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య అపరిష్కృతంగా ఉన్న వివాదాన్ని సింధు ఒప్పందం ఒక కొలిక్కి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీ పరీవాహక ప్రాంతాల ఒప్పందాలు నదీజలాల పంపకానికి సంబంధించినవి కాగా ఐడబ్ల్యుటి నదుల విభజనకు సంబంధించినది. ఈ ఒప్పందం సమకూర్చిన ఏర్పాటును భారత్ స్వయంగా కోరుకున్నదే. ఇటువంటి ఏర్పాటుకు భారత్ 1954లో సానుకూలత చూపగా పాకిస్థాన్ దాన్ని అంగీకరించేందుకు చాలా సంవత్సరాలు తీసుకున్నది. ఐడబ్ల్యుటి కింద సింధు నదీ వ్యవస్థను పశ్చిమ, తూర్పు నదులుగా విభజించారు. పశ్చిమ నదులు అయిన జీలమ్, చీనాబ్, ఇండస్‌ను పాకిస్థాన్‌కు కేటాయించారు. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ నదుల నీటిని భారత్ చాలా పరిమితంగా మాత్రమే వినియోగించుకోవలసి ఉన్నది. ఆ నదులలో మొత్తం ప్రవాహ పరిమాణంలో ఎటువంటి తేడా సంభవించకుండా ఉండేలా మాత్రమే వినియోగించుకోవాలి. ఈ ప్రకారం ఆ మూడు పశ్చిమ నదులపై భారత్ ఎటువంటి ఆనకట్టలు నిర్మించకూడదు. తూర్పు నదులు అయిన రావి, బియాస్, సట్లేజ్‌లను భారత్‌కు కేటాయించారు. ఈ మూడు నదులు పాకిస్థాన్‌లోకి ప్రవేశించేంతవరకు వాటిపై పూర్తి నియంత్రణ భారత్‌కు ఉంటుంది. ఈ నదులలోని ప్రతి చుక్క నీటిని భారత్ వినియోగించుకోవచ్చు. పాకిస్థాన్‌కు ఏ మాత్రం నీరు ప్రవహించకుండా చేసేందుకు కూడా భారత్‌కు హక్కులు ఉన్నాయి. పాకిస్థాన్‌కు ఆ నదులు ప్రవహించకుండా భారత్ అడ్డుకున్నా అది ఐడబ్ల్యుటి ఉల్లంఘన కిందకు రాదు.

సింధు నదీపరివాహక ప్రాంతం నాలుగుదేశాల– పాకిస్థాన్, భారత్, చైనా, అఫ్ఘానిస్తాన్–లో 1.14 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నది. సింధు ఆయకట్టులో నివసిస్తున్న మొత్తం జనాభా 2025లో 320మిలియన్లు. 2050 సంవత్సరం నాటికి ఈ జనాభా 380 మిలియన్లకు పెరగవచ్చని అంచనా. ఈ జనాభాలో 110 మిలియన్ (35శాతం) భారత్‌లో ఉండగా 195 మిలియన్ (61శాతం) పాకిస్థాన్‌లో ఉన్నారు. మిగతా 4శాతం మంది



> ఐడబ్ల్యుటి భవిష్యత్తును న్యూఢిల్లీలో నిర్ణయించేందుకు ఆస్కారం లేనేలేదు. అంతర్జాతీయ వేదికలలో లేదా అంతర్జాతీయ న్యాయస్థానంలో దానిపై నిర్ణయమవుతుందనేది స్పష్టం.

అఫ్ఘానిస్తాన్‌లో ఉన్నారు. చైనా పరిధిలో ఉన్న జనాభా సంఖ్య ఉపేక్షింపదగినది. పాకిస్థాన్ జనాభాలో 80 శాతం మంది, భారత్ జనాభాలో 8 శాతం మంది సింధు నదీపరివాహక ప్రాంతంలోనే నివసిస్తున్నారు.

సింధు బేసిన్‌లో లభ్యమయ్యే మొత్తం ఉపరిత జలాల పరిమాణం 239 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బిసిఎమ్). ఇందులో తూర్పు నదుల నుంచి ప్రవహించేది 73.3 బిసిఎమ్‌లు. ఈ జలాలపై భారత్‌కు సంపూర్ణ హక్కులు ఉన్నాయి. వివిధ ప్రాకృతిక కారణాల వల్ల భారత్ ఈ జలాలను పూర్తిగా వినియోగించుకోలేకపోతోంది. కేవలం 46 బిసిఎమ్‌లను మాత్రమే వినియోగించుకోగలుగుతుంది. భారత్ తన అవసరాలకు తగ్గట్టుగా ఈ నీటిని వినియోగించుకోవచ్చు. అయితే కేవలం 16.3 బిసిఎమ్‌లను మాత్రమే నిల్వచేసుకోగల సామర్థ్యం మాత్రమే కలిగి ఉంది. మిగతా జలాలు పాకిస్థాన్‌లోకి ప్రవహిస్తున్నాయి. వాటిని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉన్నది. అయితే వాటిని నిల్వ చేసుకునే సామర్థ్యం భారత్‌కు లేదు. పాకిస్థాన్‌కు కేటాయించిన పశ్చిమ నదుల నుంచి లభ్యమయ్యే సగటు నీటి సామర్థ్యం 165 బిసిఎమ్. ఐడబ్ల్యుటి ప్రకారం వాటిని సంపూర్ణంగా వినియోగించుకునే హక్కు పాకిస్థాన్‌కు ఉన్నది. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ పశ్చిమ నదుల నీటిని మళ్లించేందుకుగానీ, నిల్వచేసుకునేందుకుగానీ భారత్‌కు హక్కు లేదు.

ఐడబ్ల్యుటి ఇప్పటికే అంతర్జాతీయ అంశమయింది. పాకిస్థాన్ దాన్ని తన ప్రచారానికి, ఉగ్రవాదంపై చర్చను దారి మళ్లించేందుకు పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటుంది. సాయుధ సంఘర్షణ కాలంలో నదీజలాల పరిరక్షణ విషయమై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నిర్వహించిన ఒక సమావేశంలో భారత రాయబారి మాట్లాడుతూ సింధు నది ఎగువ ప్రాంత దేశంగా భారత్ ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వస్తోందని పునరుద్ఘాటిస్తూ ఐడబ్ల్యుటి పీఠిక ప్రస్తావించిన 'సుహృద్భావ, స్నేహ స్ఫూర్తిని పాకిస్థానే ఉల్లంఘించిందని విమర్శించారు. ఉగ్రవాదులు తుల్‌బుల్ నేవిగేషన్ ప్రాజెక్ట్‌పై కూడా దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. పాక్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదుల వల్ల ఆ ప్రాజెక్ట్ భద్రతకు, ప్రజల ప్రాణాలకు రక్షణ కొరవడుతోందని భారత రాయబారి అన్నారు. అదే సమావేశంలో పాకిస్థాన్ ప్రతినిధి సైమా సలీమ్ మాట్లాడుతూ పాకిస్థాన్‌లో 24కోట్ల ప్రజలకు ప్రాణరక్షకంగా ఉన్న సింధు జలాల ప్రవాహానికి భారత్ అవరోధాలు కల్పిస్తోందని అంటూ, 'నీరే ప్రాణం. అది సమరాయుధం కానేకాదు' అని వ్యాఖ్యానించారు. చెప్పవచ్చినదేమిటంటే ఐడబ్ల్యుటి భవిష్యత్తును న్యూఢిల్లీలో నిర్ణయించేందుకు ఆస్కారం లేనేలేదు. అంతర్జాతీయ వేదికలలోను లేదా అంతర్జాతీయ న్యాయస్థానంలో దానిపై విస్తృత చర్చల ద్వారా అది నిర్ణయమవుతుందనేది స్పష్టం. సింధు వివాదానికి ఇటువంటి పరిష్కారం కోసమే పాకిస్థాన్ సకల ప్రయత్నాలు చేస్తోంది.

పహల్గాం ఉగ్రఘాతుకానికి మొదటి ప్రతిస్పందనగా సింధు నదీజలాల ఒప్పందం అమలును నిలిపివేస్తామని భారత్ ప్రకటించింది. 2016లో కూడా భారత్ ఇటువంటి హెచ్చరికే చేసింది. అయితే అప్పుడుగానీ, ఆ తరువాత గానీ ఏమీ జరగలేదు. తమ పోరాటం ఉగ్రవాదుల నిర్మూలనకేనని భారత్ పదేపదే చెప్పుతుండగా ఐడబ్ల్యుటి అమలును నిలిపివేయడం తమ ప్రజలను అకారణంగా శిక్షించడమేనని పాకిస్థాన్ ఆక్రోశిస్తోంది. ఆపరేషన్ సిందూర్ పూర్వాపరాలను ప్రపంచ దేశాల నాయకులకు వివరించేందుకు మోదీ సర్కార్ పంపించిన భారత పార్లమెంటరీ ప్రతినిధుల బృందాలు ఐడబ్ల్యుటి అమలు నిలిపివేత విషయంలో ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో ఇబ్బందుల నెదుర్కొన్నాయి.

> నదీపరివాహక ప్రాంతాలకు సంబంధించిన ఒప్పందాలలో సింధు నదీజలాల ఒప్పందం భిన్నమైనది. 1947లో దేశ విభజన కాలం నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య అపరిష్కృతంగా ఉన్న వివాదాన్ని ఈ ఒప్పందం ఒక కొలిక్కి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీ పరీవాహక ప్రాంతాల ఒప్పందాలు నదీజలాల పంపకానికి సంబంధించినవి కాగా, ఐడబ్ల్యుటి నదుల విభజనకు సంబంధించినది.

అంతర్జాతీయ పర్యవసానాలను ఉపేక్షించి పాకిస్థాన్‌కు ప్రవహించే సింధు జలాలను నిలిపివేసేందుకు భారత్ దృఢంగా నిర్ణయించుకుందనే అనుకుందాం. ఆ నిర్ణయాన్ని అమలుపరచడం సాధ్యమవుతుందా? సింధునదిపై భారత ప్రభుత్వ నివేదిక ఒకటి ఇండస్ బేసినులో సగటు నీటి లభ్యత 73 బిసిఎమ్ (బిలియన్ క్యూబిక్ మీటర్లు) పేర్కొంది. ఉపయోగించుకోగల మొత్తం ఉపరితల జలాల లభ్యత 46 బిసిఎమ్ అని, ప్రస్తుత 'లైవ్ స్టోరేజ్ కెపాసిటీ' 16.3 బిసిఎమ్ అని ఆ నివేదిక పేర్కొంది. ఈ అంకెలు అన్నీ భారత్‌కు కేటాయించిన తూర్పు నదులకు సంబంధించినవి. లభ్యమయ్యే మొత్తం నీటిని పూర్తిగా నిల్వ చేసుకోవాలంటే భారత్ కనీసం భాక్రానంగల్ స్థాయి భారీ ప్రాజెక్టులు ఒకటి కాదు, రెండు కాదు, మూడు నిర్మించుకోవలసి ఉంటుంది. కేవలం తూర్పు నదుల నుంచి నీరు పాకిస్థాన్‌కు ప్రవహించకుండా నిలిపివేసేందుకే అంత ఖర్చుచేయవలసి ఉంటుంది. మరి పశ్చిమ నదుల నుంచి లభ్యమయ్యే నీటిని సైతం పూర్తిగా నిల్వ చేసుకోవాలని భారత్ నిర్ణయించుకుంటే అందుకయ్యే వ్యయం అనేక రెట్లు అధికంగా ఉంటుంది. సింధు, దాని ఉపనదుల నుంచి ఒక్క చుక్క నీరు కూడా పాకిస్థాన్‌కు వెళ్లకుండా నిలిపివేసేందుకు భారత్ రాబోయే పదిసంవత్సరాల కాలంలో కనీసం 10,000 నుంచి 15,000 కోట్ల డాలర్లను వెచ్చించవలసి వస్తుంది.

భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు జారీ చేస్తున్న హెచ్చరికలు దేశంలో ప్రజల మద్దతును మరింతగా సమీకరించుకోవడానికే కావచ్చు. కానీ, అవి పాకిస్థాన్ పాలకులకు బాగా తోడ్పడుతున్నాయి. వారు తమకు స్వదేశంలో భారత్‌కు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టుకొనేందుకు అవి తోడ్పడుతున్నాయి. సింధు ఒప్పందం అమలును నిలిపివేయడం ద్వారా పాకిస్థాన్‌ను గట్టిగా శిక్షించినట్లయిందని కోట్లాది భారతీయులు భావిస్తున్నట్టుగానే, ఆ నీళ్ళు తమకు చేరకుండా భారత్ అడ్డుకుంటోందని ఇప్పటికే కోట్లాది పాకిస్థాన్ ప్రజలు విశ్వసిస్తూండవచ్చు. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు సింధు వాహిని నిలిపివేస్తామని పదే పదే ప్రకటించడం సరైన వ్యూహం కాదు, కాబోదు. –భారత్ ప్రయోజనాలకు అదేమీ దోహదం చేయదు.

■ బిక్షం గుజ్జా
అంతర్జాతీయ జలవిధాన నిపుణుడు

రియల్ హీరో 'నాన్న'



అంతులేని ప్రేమతో
అంతంలేని ఆయుష్షు నీకివ్వాలని
అనుక్షణం తాపత్రయపడుతూ
అద్భుతమైన జీవితాన్ని
నీకు పరిచయం చెయ్యాలని

అత్యాశతో పగలు, రాత్రి
అలసట ఎరుగని శ్రామికుడు నాన్న
అంతులేని ప్రేమను పంచి, అందలం ఎక్కించి,
అట్టడుగులో తానుండి
నీ నవ్వును చూసి మురిసే పిచ్చోడు నాన్న

అపురూపమనే పదానికి
అందం అనే అబద్ధానికి
అర్థ నిస్వార్థమైన తన బిడ్డలని
అరమరికలు లేని నీ స్వభావాన్ని
నీ విజయోత్సవంగా ఉత్సహించే ప్రేమపిపాసి నాన్న

బరువు అనిపించినా నీ బలం తానై
బలహీనతలు వెంటాడుతున్నా
బాధ్యతను విడిచిపెట్టక
భక్తికి శక్తిని తోడుచేసుకొని
తన జీవితమంతా రంగరించి
బిడ్డలకు నేనున్నాననే గుండె నిబ్బరం నాన్న

అనునిత్యం కర్పూరంలా తాను కరిగిపోతూ
నవ్వులు వెదజల్లే విశ్వాసం నాన్న
ప్రతి కూతురుకి (కొడుకుకి) రియల్ హీరో నాన్న
ఈ రోజున ఎదిగిన ప్రతి కొడుక్కి జీరో నాన్న
అత్యంత విలువైన సంపద నాన్న

– వాసి జ్యోత్స్న
(నేడు ఫాదర్స్ డే)

మృత్యువిహంగం

గగనాన ఎగరాల్సిన కలలు
రెక్కలు తెగి నేలరాలడమేమిటి
అనుబంధాల దారప్పోగులు
పుటుక్కున తెగి
చితిపై కాలడమేమిటి
చంద్రమండలం మీద కాలుమోపిన
మానవుడు చటుక్కున
చతికిలపడటమేమిటి

యంత్రానికి ప్రకృతికి నడుమ
నిరంతర సంఘర్షణ
పెనువిధ్వంసం జరిగాక
బ్లాక్ డే గా ప్రకటించాక
బ్లాక్ బాక్స్ కై వెతుకులాటెందుకు
ఎక్స్‌గ్రేషియా టిష్యూ పేపర్‌తో
కంటితుడుపు చర్యలెందుకు
పెనువిధ్వంసం జరిగాక
పోస్టుమార్టమ్ రిపోర్టులెవరికోసం...

కుటుంబాలకు కుటుంబాలే
బుగ్గిపాలైన ఘోరవిపత్తు
ఆకాశమంత ఎదిగిన
సంతానం సజీవదహనమైతే
ఆ బూడిదను ఏ పుణ్యతీర్థంలో
నిమజ్జనం చేయాలి

విమానంలో ప్రయాణించే
మనుషులు వేరు కావచ్చు
ఎదురొచ్చిన చావు ఒక్కటే

ఐనా ఎవ్వడికీ ఏమీ పట్టదు
ఈ రోజు పతాక శీర్షికలో
నెత్తురోడినవార్త...

అనాథశవంలా
రేపు చెత్తకుప్పలోకే...

కాలం నేర్పే గుణపాఠాలను
గుండెగోడలకు వేలాడదీసే
కనువిప్పు కావాలిప్పుడు

వర్తమానం కాన్వాసు మీద మనిషి
వాస్తవాల వర్ణచిత్రం కావాలిప్పుడు

కానీ ఎప్పటికీ ఒక్కడుంటాడు
సమాధి మీద ఎగిరే విజయపతాకై
ఒక్కడుంటాడు
బతుకుపోరులో మృత్యుంజయుడై...

– సరికొండ నరసింహరాజు
(అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించినవారి కోసం)

తూర్పు ఆఫ్రికాలో 'ఇనుపపాము'



> ఇప్పుడు కెన్యాగా పిలుస్తున్న ప్రదేశంలో యూరోపియన్లు అడుగుపెట్టడానికి వంద సంవత్సరాల క్రితమే, కిమ్నియోల్ అనే గిరిజన ప్రవక్త గడ్డి మైదానాల గుండా జారిపోయే ఒక క్రూరమైన 'ఇనుప పాము' గురించి మాట్లాడాడు. 'అది పశువులను మింగేస్తుందని, విధ్వంసం సృష్టిస్తుందని, ఇంతకు ముందెన్నడూ చూడని విదేశీయుడిని తీసుకువస్తుందని' అతను చెప్పాడు. తన ప్రజలకు కష్టాలు రాబోతున్నాయన్నదే కిమ్నియోల్ ప్రవచనాల సారాంశం. అవి నిజమని తేలినప్పటికీ 'ఇనుప పాము' ఆఫ్రికన్ ప్రజల జీవితాలను కిమ్నియోల్ ఊహించలేని విధంగా మార్చింది.

తూర్పు ఆఫ్రికాలోని ప్రాంతాలను అనుసంధానించడానికి, కెన్యా నుంచి ఉగాండా వరకూ రైలు మార్గాన్ని నిర్మించాలని బ్రిటిష్ సామ్రాజ్య పాలకులు నిర్ణయించారు. చౌక శ్రమశక్తికి వెసులుబాటు కల్పించిన బానిసత్వ వ్యవస్థ అప్పటికే రద్దయ్యింది. దీంతో రైలు మార్గాన్ని నిర్మించడానికి కాంట్రాక్ట్ ప్రాతిపాదికన, తక్కువ ధరలో ఒప్పంద కార్మికులను భారతదేశం నుంచి తెచ్చుకోవచ్చు అనుకున్నారు తూర్పు ఆఫ్రికా వలస పాలకులు. దానికోసం 'ఇంపీరియల్ బ్రిటిష్ ఈస్ట్ ఆఫ్రికా కంపెనీ'ని 1888లో స్థాపించి, 1896లో మొంబాసా నుంచి విక్టోరియా సరస్సు దాకా రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అవసరమైన కార్మికులు, సహాయక అధికారులను నియమించడానికి బాధ్యత వహించే ఒక ఏజెంట్‌ను కరాచీలో నియమించారు. ప్రధాన నియామక కేంద్రమైన లాహోర్‌లో ఒక బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

భారతదేశంలో రైల్వే నిర్మాణాన్ని ప్రారంభించిన దాదాపు 40 సంవత్సరాల తరువాతనే, తూర్పు ఆఫ్రికాలో రైల్వ నిర్మాణ ఆలోచన మొదలయింది. భారతదేశంలో అటువంటి నిర్మాణ పనుల్లో పనిచేసిన



కార్మికుల మీద బ్రిటిష్ వారి దృష్టి పడింది. ఉచిత ప్రయాణం, ఉచిత భోజనం, జీతం, ఉచితంగా తిరుగు ప్రయాణం లాంటి జనాకర్షక హామీలతో, పంజాబ్‌లోని గ్రామాల నుంచి కేవలం మగ, యువ కార్మికులను సమీకరించగలిగారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి చెందిన ప్రత్యేక చార్టర్డ్ స్టీమర్లలో వారినందరినీ కరాచీకి పంపారు. అక్కడి నుంచి మొంబాసాకు దాదాపు 3వేల మైళ్ళు, తొమ్మిది రోజుల ప్రయాణం. 1896 జనవరి 24న మొంబాసాలో 350 మంది పంజాబీల మొదటి జట్టుతో ఒప్పంద కార్మిక వ్యవస్థ అక్కడ ప్రారంభమైంది. 7,500 మంది నైపుణ్యం ఉన్న కార్మికులు, 20 వేల మంది నైపుణ్యం లేని కార్మికులు భారతదేశం నుంచి వెళ్లారు. మొత్తం మీద, రైల్వే నిర్మాణంలో 32 వేల మంది భారతీయులు ఉపాధి పొందారు.

1898లో రైల్వే నిర్మాణం 100 మైళ్ల దూరం వరకూ సాగింది. తీరం నుంచి 326 కి.మీ దూరంలో ఉన్న నైరోబీకి మే 1899లో చేరుకుంది. ఆ తరువాత అక్కడ అది కీలకమైన ఓడరేవు అయింది. అయితే 200 మైళ్ల ప్రయాణం తరువాత, రైల్వే నిర్మాణంలో అత్యంత భయంకరమైన అధ్యాయాలలో ఒకటి 1898లో త్సావో నది మీద వంతెన నిర్మాణ సమయంలో జరిగింది. నరమాంస భక్షక మగ సింహాల జత, కార్మికుల శిబిరాలకు చేరి, రాత్రిపూట గుడారాలలో నిద్రిస్తున్న కార్మికులను బయటకు లాగి భక్షించేవి. పది నెలల పాటు కొనసాగిన ఆ దాడిలో వందమందికి పైగా మరణించారు. వందలాది మంది కార్మికులు త్సావో నుంచి పారిపోవడంతో రైల్వే నిర్మాణం దాదాపు ఆగిపోయింది. ఆ సింహాలు కొంతకాలం తర్వాత, పనిలో ఉన్న పురుషులను వెంబడించడంలో నిపుణులయ్యాయి. సింహాలు అనుసరించిన పద్ధతులు అసాధారణమైనవి కావడంతో, ఆ రెండు మగ సింహాలూ కచ్చితంగా సింహాల శరీరంలోకి ప్రవేశించిన దెయ్యాలని భారతీయ కార్మికులు నమ్మడం మొదలుపెట్టారు. సింహాలను అంతం చేసే పని రైల్వే నిర్మాణాన్ని పర్యవేక్షించే ఇంజనీర్, లెఫ్టినెంట్ కల్నల్ జాన్ ప్యాటర్సన్ మీద పడింది. వారాల తరబడి నిరంతరాయంగా వెంబడించిన తర్వాత, ప్యాటర్సన్ ప్రాణాలకు తెగించి సింహాలను అంతం చేయగలిగాడు. వీటి నిర్మూలన ఆ రైల్వే చరిత్రలో ఒక భయంకరమైన అధ్యాయానికి ముగింపు పలికింది. 'దెయ్యం' 'చీకటి' అనే మారుపేరుతో వాటిని చెప్పుకునేవారు.



రైలు నైరోబీ రైల్వే రిఫ్ట్ వ్యాలీ వైపు మళ్లిన తర్వాత ఆ ప్రాంతం మరీ ప్రమాదకరంగా మారింది. నిర్మాణం త్సావో నదికి చేరుకోకముందే, రైల్వే కార్మికుల మీద అక్కడి మాసాయి తెగ భయంకరంగా దాడి చేసింది. దానికి కారణం గతంలో (నవంబర్ 1895) ఇద్దరు మాసాయి గిరిజన బాలికల మీద అత్యాచారం జరగడమే. దానికి ప్రతిక్రియగా, మాసాయి తెగ దాదాపు ఆరు వందల మందికి పైగా రైల్వే కార్మికులను హతమార్చింది. మరొక ముఖ్యమైన ప్రతిబంధకం... అక్కడి సెత్సే దోమల కాటు. ఇవి కార్మికులలో నిద్ర జబ్బును సృష్టించేవి. క్లిష్టమైన భూభాగం కారణంగా చాలా మంది మలేరియా, నల్ల జ్వరంతో మరణించారు. అనేక మరణాలకు అక్కడ ఏ వైద్య సదుపాయాలూ లేవు. పేలుడు పదార్థాలతో పని చేయడం వల్ల, వడదెబ్బల వల్ల, సొరంగాల తవ్వకాలలో కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. విక్టోరియా సరస్సుకి దగ్గరగా రైలు మార్గం విస్తరించడంతో నిర్మాణ పనుల్లో ఆటంకాలు మరింత పెరిగాయి. కార్మికుల పరిస్థితి మరింత దిగజారింది. అయినా భారతీయ ఒప్పంద కార్మికుల అకుంఠిత కృషి కారణంగా రైల్వే అథారిటీ ఆరేడు సంవత్సరాల వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేయగలిగింది.

1899లో తీరం నుంచి నైరోబీ వరకు, 1900 నాటికి నకురు ప్రాంతం వరకూ రైల్వే పనులు పూర్తయి, 1901లో విక్టోరియా సరస్సు తీరంలో కిసుము ప్రాంతానికి రైల్వే అథారిటీ చేరుకుంది. మొంబాసా నుంచి కిసుము దాదాపు 560 మైళ్ల దూరంలో ఉంది. కిసుముకు చేరుకునే నాటికి దాదాపు 2,500 మంది మరణించారు. 1903 నాటికి విక్టోరియా సరస్సు వరకు రైలు మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేశారు. పూర్తిగా స్థానిక కార్మికులపై ఆధారపడి ఉంటే రైల్వే నిర్మాణం కనీసం ఇరవై సంవత్సరాలు పట్టేదని బ్రిటిష్ అధికారులే భావించారు. ఆ ప్రశంస, కీర్తి అక్కడి ఒప్పంద భారతీయ కార్మికులకే చెందుతాయి. రైల్వేను నిర్మించడానికి మొత్తం 31,983 మంది భారతీయ కార్మికులు పని చేశారు. 6,454 మంది వ్యక్తులు ట్రాక్‌లు వేయడం మూలంగా అశక్తులయారు. రైల్వే నిర్మాణం పూర్తయిన తర్వాత 6,724 మందిని వారి సంరక్షిత రాజ్యంలో పని చేసేందుకు తీసుకున్నారు. వీరిలో 2,000 మందిని మాత్రమే రైల్వే శాఖల్లో నియమించుకున్నారు.

ఆఫ్రికా సమాజానికి ఆ రైల్వే అనేక విధాలుగా ఉపయోగపడింది. భారతీయ ఒప్పంద కార్మికులు పోషించిన పాత్రతో తరువాత ఆఫ్రికా సమాజంలో అనేక మార్పులొచ్చాయి. రైల్వే నిర్మాణానికి ప్రారంభ ఖర్చు 50 లక్షల డాలర్లుగా నిర్ణయించబడినా, దాని నిర్మాణానికి బ్రిటిష్ వారికి 90 లక్షల డాలర్ల వరకూ ఖర్చయింది. అది పార్లమెంటులోను, మీడియాలోను తీవ్ర ఆగ్రహాన్ని సృష్టించింది. నిర్మాణం ప్రారంభించకముందే, ఈ ఆలోచనను వ్యతిరేకించినవారు చాలా మంది ఉన్నారు. వీరిలో ఒకరైన హెన్రీ లాబౌచెర్ కామన్స్ సభలో బ్రిటిష్ విదేశాంగ మంత్రి జార్జ్ కర్జన్‌ను ఇలా ఆక్షేపించాడు: 'దీనికి ఎంత ఖర్చవుతుందో ఏ పదాలూ చెప్పలేవు/ దాని లక్ష్యం ఏమిటో ఏ మెదడూ ఊహించలేదు/ అది ఎక్కడి నుంచి మొదలవుతుందో ఎవరూ కనిపెట్టలేరు/ అది ఎక్కడికి వెళుతుందో ఎవరికీ తెలియదు... స్పష్టంగా అది ఒక ఉన్మాద లైను తప్ప మరొకటి కాదు' అని. ఉగాండా రైల్వేను లూనాటిక్ (ఉన్మాద/పిచ్చి) అనే పదంతో పేర్కొనడం అదే మొదటిసారి. 'లూనాటిక్ ఎక్స్‌ప్రెస్' అనే పదాన్ని చార్లెస్ మిల్లర్ 1971లో తన పుస్తకం 'ది లూనాటిక్ ఎక్స్‌ప్రెస్: యాన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇన్ ఇంపీరియలిజం'లో ఉపయోగించాడు. అయితే కొంతమంది స్థానికులు ఆ ఎక్స్‌ప్రెస్‌ను 'ఇనుప పాము' అని పిలుచుకున్నారు. దానికి కారణం– ఇప్పుడు కెన్యాగా పిలువబడే ప్రదేశంలో యూరోపియన్లు అడుగుపెట్టడానికి వంద సంవత్సరాల క్రితమే, కిమ్నియోల్ అనే గిరిజన ప్రవక్త గడ్డి మైదానాల గుండా జారిపోయే ఒక క్రూరమైన 'ఇనుప పాము' గురించి మాట్లాడాడు. 'అది పశువులను మింగేస్తుందని, వారి భూములను దోచుకుంటుందని, దారిలో విధ్వంసం సృష్టిస్తుందని, ఆ మృగం, ఇంతకు ముందెన్నడూ చూడని ఒక రకమైన విదేశీయుడిని తీసుకువస్తుందని, ఒక రోజు వారి భూమిని పరిపాలించే వింతైన ఎర్రటి జుట్టు గల వ్యక్తిని తీసుకొస్తుందని' అతను చెప్పాడు. అతను చేసిన ప్రవచనం ఒక విషయాన్ని స్పష్టపరిచింది– అక్కడి ప్రజలకు కష్టాలు రాబోతున్నాయని! కిమ్నియోల్ ప్రవచనాలు నిజమని తేలినప్పటికీ 'ఇనుప పాము' ఆ ప్రజల జీవితాలను ఆయన కూడా ఊహించలేని విధంగా మార్చింది. ఆశ్చర్యంగా బ్రిటిష్ పత్రికలు సైతం దానిని 'ఇనుప పాము' అనే అన్నాయి, ఎందుకంటే దాని నిర్మాణ సమయంలో అపారమైన సంపద వృథా అయింది. ఆ ప్రాంతంలో నివసించిన తెగలు రైల్వే నిర్మాణాన్ని ప్రతిఘటించాయి.



ఈ రైలు మార్గం ఉగాండా, కెన్యా అంతర్భాగాలను, కెన్యాలోని హిందూ మహాసముద్ర నౌకాశ్రయాన్ని మొంబాసాతో అనుసంధానించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో తూర్పు ఆఫ్రికాలో జర్మనీని ఓడించడానికి బ్రిటిష్ వారికి సహాయపడి, ఇతర వలస రాజ్యాలతో కమ్యూనికేషన్ కొనసాగించడానికి చాలా ముఖ్యమైనదిగా మారింది. రైల్వే రాక ముందు నైరోబీ జనావాసాలు లేని చిత్తడినేల. నేడు నైరోబీ కెన్యాలో ముప్పై లక్షలకు పైగా జనాభా ఉన్న అతిపెద్ద నగరం. నిద్రాణస్థితిలో ఉన్న తీరప్రాంతం మొంబాసా అనంతరం పట్టణమై, ఆధునిక ఓడరేవుగా రూపాంతరం చెందింది. కెన్యాతో పోలిస్తే ఉగాండాకు ఇప్పుడు వ్యవసాయం నుంచి సమృద్ధిగా రాబడి వస్తోంది. 1938 నాటికి, పత్తి సాగు ఒక్కటే 30 లక్షల ఎకరాల భూమిని ఆక్రమించింది. 1900–04 సంవత్సరాల మధ్య బ్రిటిష్ తూర్పు ఆఫ్రికా కమిషనర్‌గా ఉన్న చార్లెస్ ఎలియట్ వీటన్నింటినీ గమనించి ఇలా వ్యాఖ్యానించాడు: 'ఒక దేశం రైల్వేను సృష్టించడం అసాధారణం కాదు, కానీ రైల్వేనే ఒక దేశాన్ని సృష్టించడం అసాధారణం.'

• ముకుంద రామారావు
కవి, వలసజీవితాల చరిత్రకారుడు (99083 47273)

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 కనిష్ఠం 24.7

తళుక్కు తార..

దక్షిణాది నటి కావ్యా థాపర్ నగరంలో తళుక్కున మెరిశారు. శనివారం వేడుకగా జరిగిన ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో పాల్గొని ఫొటోలకు ఇలా పోజిచ్చారు.
-ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్





హ్యాపీ మూమెంట్..


దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ శనివారం అట్టహాసంగా సాగింది. ఫ్లయింగ్ శిక్షణను పూర్తి చేసుకున్న కెడెట్స్ పరేడ్ అనంతరం ఇలా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సందడి చేశారు.
-ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్



అవార్డుల సంబరం

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024 కార్యక్రమం శనివారం హైటెక్స్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. సినీ రంగంలో వివిధ కేటగిరీల్లో ఉత్తమ నటీనటులు, దర్శక నిర్మాతలకు పురస్కారాలను అందించారు. రెడ్‌కార్పెట్‌పై సినీ ప్రముఖులు సందడి చేశారు. ఈ సందర్భంగా కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు.

సివిల్స్, పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు
నోటిఫికేషన్ విడుదల



ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్స్ (ప్రిలిమ్స్), గ్రూప్-1, గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షల కోసం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు జనరల్ స్టడీస్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఓయూ సివిల్స్ అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఇందుకు సంబంధించిన అప్లికేషన్ను ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, అప్లికేషన్‌లో పేర్కొన్న పత్రాలను జతచేసి ఓయూ అకాడమీలో జూన్ 30లోపు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు అన్ని పనివేళల్లో సివిల్స్ అకాడమీని విద్యార్థులు సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.



లోక్ అదాలత్‌లో హైకోర్టు సీనియర్ జడ్జి సుజోయ్ పాల్

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి

అడ్డగుట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ పెరుగుతున్న తరుణంలో అన్ని కోర్టుల్లో కేసులు పెండింగ్ లేకుండా చూసుకునే బాధ్యత న్యాయమూర్తులు తీసుకోవాలని హైకోర్టు సీనియర్ జడ్జి సుజోయ్ పాల్ సూచించారు. శనివారం సికింద్రాబాద్ సివిల్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించుకునే వీలు కక్షిదారులకు కల్పించాలని తోటి న్యాయమూర్తులు, న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ కోర్టుల ఇన్‌చార్జి సీనియర్ జడ్జి శశిధర్‌రెడ్డి, సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సంయుక్త కార్యదర్శి వినోద్‌కుమార్ తాండ్లే, తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్‌పై ఫోకస్

ఆదాయం పెంపునకు దక్షిణ డిస్కం చర్యలు

- నష్టాలు తగ్గించేందుకు కార్యాచరణ
- డివిజన్ల వారీగా ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- కమర్షియల్ ఆదాయంలో టాప్‌లో సైబర్‌సిటీ



హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కమర్షియల్ నష్టాలు తగ్గించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)నిర్ణయించింది. కమర్షియల్ ఆదాయం పెంచుకునేలా డివిజన్ల వారీగా ప్రత్యేక బృందాలతో విద్యుత్ కనెక్షన్ల తనిఖీలు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. గ్రేటర్‌లోని మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధుల్లోని 10 సర్కిళ్లలో 8.22 లక్షల కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. హైదరాబాద్ సౌత్‌సర్కిల్‌లో అత్యధికంగా 1.24 లక్షల కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉండగా ప్రతినెలా విద్యుత్‌బిల్లుల రూపంలో రూ.33 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. హబ్సిగూడ సర్కిల్‌లో 92 వేలు, మేడ్చల్ సర్కిల్‌లో 78 వేల కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిసంవత్సరం కమర్షియల్ కనెక్షన్లసంఖ్య పెరుగుతున్నా పలు సర్కిళ్లలో అనుకున్న స్థాయిలో ఆదాయం పెరగడం లేదు. కొన్ని సర్కిళ్లలో డొమస్టిక్ (గృహ) కేటగిరిలో విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటూ కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో గుర్తిస్తున్నారు.

కేటగిరి మార్చకుండానే..

కొన్ని సర్కిళ్లలో నిర్మాణదారులు క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బందికి అక్రమంగా డబ్బులు చెల్లించి కేటగిరి మార్చకుండానే విద్యుత్ వాడుతున్నారనే

మిగతా 4వ పేజీలో..



గ్రేటర్‌లో సర్కిళ్ల వారీగా కమర్షియల్ కనెక్షన్లు, ఆదాయం (ప్రతినెలా.రూ.కోట్లలో)

సర్కిల్	కమర్షియల్ కనెక్షన్లు	బిల్లుల ఆదాయం
బంజారాహిల్స్	56,472	56.29
హబ్సిగూడ	92,533	33.59
సైబర్‌సిటీ	76,337	65.82
హైదరాబాద్ సెంట్రల్	83,489	42.05
హైదరాబాద్ సౌత్	1,24,108	33.86
మేడ్చల్	78,352	41.68
రాజేంద్రనగర్	74,088	24.44
సంగారెడ్డి	69,954	21.23
సరూర్‌నగర్	90,093	33.03
సికింద్రాబాద్	76,662	30.93



తొలి విడతలో

52,500 ఇళ్ల నిర్మాణం

- స్థలాలున్న వారికి మొదటి ప్రాధాన్యం
- తర్వాత స్థానికులకు అవకాశం
- ముంబై తరహాలో మురికివాడల అభివృద్ధి
- 2050 నాటికి సరిపడే నీటి ప్రణాళికలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలివిడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున నగరంలోని 15 అసెంబ్లీ సెగ్మెంట్లలో 52,500 ఇళ్లను నిర్మిస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా 18 నెలల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

నగరంలో నివసిస్తున్న పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని, ప్రధానంగా ముంబై తరహాలో మురికివాడలను తీర్చిదిద్దుతామని తెలిపారు. గ్రేటర్‌లో ప్రభుత్వ భూముల కొరత ఉన్నందున తొలుత సొంత స్థలాలు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని, తర్వాత స్థానికులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. జీ+3 విధానంలో నిర్మాణాలు చేపట్టి ఎక్కువ మందికి ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఇప్పటివరకు జిల్లాలో లక్ష దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 10వేల మందికి మాత్రమే

మిగతా 4వ పేజీలో..

పబ్‌లపై ఎస్‌ఓటీ దాడులు

- అదుపులోకి పలువురు అనుమానితులు
- పబ్ బయట నలుగురికి గంజాయి పాజిటివ్



రాయదుర్గం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ గచ్చిబౌలి, మాదాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లోని పబ్‌లలో శుక్రవారం అర్ధరాత్రి ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. కాగా.. ఎవరూ డ్రగ్స్, గంజాయి తీసుకున్నట్లు నిర్ధారణ కాలేదు. ఇదిలా ఉండగా, పబ్‌ల బయట అనుమానాస్పదంగా సంచరిస్తున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. నలుగురు యువకులకు పాజిటివ్ వచ్చింది. వారు బయట గంజాయి సేవించి వచ్చి పబ్‌ల చుట్టుపక్కల తిరుగుతున్నట్లు ఎస్‌వోటీ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఆ నలుగురిని అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ప్రవళికను అభినందించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చైనా జియాన్ నగరంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఆసియా కప్ ఉమెన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలలో పాల్గొనే భారత్ జట్టును ఇటీవల ప్రకటించారు. భారత జట్టులో హైదరాబాద్‌కు చెందిన చెపూర్వ ప్రవళిక ఎంపిక అయ్యారు. శనివారం మినిస్టర్స్ కార్వర్టర్స్‌లో చెపూర్వ ప్రవళిక.. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలవగా, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆసియా కప్ పోటీల్లో అత్యుత్తమంగా రాణించి తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే

తెలుగు రాష్ట్రాల్లో కూడా మరో నల్లచొక్కా ఉద్యమం రావాలి

రవీంద్రభారతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : తమిళనాడులో అగ్రకులాల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ పెరియార్ రామస్వామి నాయకర్ ప్రారంభించిన నల్ల చొక్కాల ఉద్యమం ఘన విజయం సాధించిందని, దాని నుంచే ద్రవిడ కళగం పుట్టి డీఎంకే, అన్నడీఎంకే పార్టీలు ఆవిర్భావించాయని ఏబీఎస్పీ జాతీయ సమన్వకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా మరో నల్లచొక్కా ఉద్యమం రావాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. తమిళనాడులో సత్ఫలితాలను చూసి మనం నేర్చుకోవాలని సూచించారు. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్‌సింగ్ పరమార్ కలిసి రచించిన ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని శనివారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఓబీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ హామీలు అంశాలపై సమగ్రంగా వివరాలను ఈ పుస్తకంలో వెలువరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.


ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, ఈటల తదితరులు


మాట్లాడుతున్న ఎంసీపీఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్

మతోన్మాదంతో బీజేపీ రెచ్చగొడుతోంది

ఎంసీపీఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్

రాంనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలలో యుద్ధోన్మాదం పై రెచ్చగొట్టే విధానాలపై ప్రజలు తిరుగుబాటు చేయాలని ఎంసీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ పిలుపునిచ్చారు. శనివారం ఓంకార్ భవన్‌లో జరిగిన ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సమావేశంలో మాట్లాడారు. యుద్ధంలో మరణించిన వారికి తమ పార్టీ సంతాపం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి వ్యవస్థల విధానం వల్లనే యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. ఆధిపత్యం, దోపిడీ కోసమే కొన్ని దేశాలు యుద్ధాలు చేస్తున్నాయని, కార్పొరేట్ వర్గాల ప్రయోజనం కోసం బీజేపీ ప్రభుత్వం మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు ఆపి అభివృద్ధి వైపు పయనం చేయాలన్నారు. సమావేశానికి మేక మోహన్‌రావు అధ్యక్షత వహించగా ఎంసీపీఐ నాయకులు గాదగోని రవి, వనం సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, కుమారస్వామి, సుకన్య, హంసారెడ్డి, అనిల్‌కుమార్, సావిత్రి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ ఆస్పత్రిలో నూతన బ్లడ్ యూనిట్

- రక్తదానంపై అవగాహన ర్యాలీ

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిమ్స్ ఆసత్రిలో నూతనంగా బ్లడ్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ యూనిట్‌లో దాదాపు వెయ్యి యూనిట్ల బ్లడ్‌ను భద్రపరచవచ్చు. ఈ అడ్వాన్స్ కోల్డ్ స్టోరేజీ యూనిట్‌ను ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలను వారు సన్మానించారు. అంతకు ముందు నిమ్స్ రక్తదాన కేంద్రం విభాగం అధిపతి డాక్టర్ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం ఆస్పత్రి పాత ఓపీడీ, సమాచార కేంద్రం నుంచి అత్యవసర భవనంలోని రక్తదాన కేంద్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ ఆస్పత్రి సిబ్బంది, కాంట్రాక్ట్ టెక్నీషియన్స్, బ్లెడ్ బ్యాంక్ విద్యార్థులు, పీజీ, బీఎస్సీ విద్యార్థులు, బ్యాంక్ ఇతర సహాయక సిబ్బంది, అలైడ్ హెల్త్ సైన్సు కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్, స్వచ్ఛంద రక్తదాతల ఆర్గనైజర్స్, హెల్పీనీడి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


నిమ్స్‌లో కొత్త బ్లడ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప

మాతృభాషపై పట్టు సాధిస్తే ఏ రంగంలోనైనా రాణించొచ్చు

- ఇరాన్ రిపబ్లిక్ వైస్ కౌన్సిల్ మోసిన్ మొఘద్దమీ

చాదర్‌ఘాట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మాతృభాషపై పట్టు సాధించితే ఏ రంగంలోనైనా రాణించ వచ్చని హైదరాబాద్‌లోని ఇరాన్ రిపబ్లిక్ వైస్ కౌన్సిల్ మోసిన్ మొఘద్దమీ అన్నారు. చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఇంటర్నేషన్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎవరైనా ముందుగా మాతృభాషను నేర్చుకోండి ఆ తర్వాతే తమ అభిరుచి మేరకు ఇతర భాషలను నేర్చుకోడానికి ప్రయత్నించాలన్నారు. మాతృ భాషను పక్కన పెట్టి ఆంగ్లభాష నేర్చుకోడానికి ప్రయత్నిస్తే అంతగా ప్రావీణ్యం సాధించలేరన్నారు. 12 ఏళ్లలోపు చిన్నారులకు అర్థం అయ్యే తరహాలో బోధన ఉండాలన్నారు. విద్యావేత్త డాక్టర్ కేహెచ్ సల్మానీ మాట్లాడుతూ సంపన్నులు పేద విద్యార్థులను చేరదీసి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. చంచల్‌గూడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్‌లలో గడుపుతూ పుస్తక పఠనం తగ్గిపోయిందని, ప్రతీ విద్యార్థి విద్యపై దృష్టి సారించి ఇష్టమైన సబ్జెక్ట్‌ను ఆసక్తితో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఫజలూర్ రెహమాన్ ఖుర్రమ్, డాక్టర్ సయ్యద్ ఇక్రముల్లా హుస్సేనీ, సయ్యద్ వికారుద్దీన్ అలీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇరాన్ రిపబ్లిక్ వైస్ కౌన్సిల్ మోసిన్ మొఘద్దమీ

నేరేడ్‌మెట్ డైట్ కాలేజీలో

బోధన, బోధనేతర పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నేరేడ్‌మెట్‌లోని డైట్ కాలేజీలో వివిధ సబ్జెక్ట్‌లో బోధన, బోధనేతర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయాల్సి ఉం టుంది. సోషల్ స్టడీస్-1, ఉర్దూ లాంగ్వేజ్-1, లలిత కళలు/ప్రదర్శన కళలు-1 పోస్టు ఖాళీలు ఉన్నాయి. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ), ఎంఈడీ పాసై ఉండాలని, లలిత/ప్రదర్శన కళలకు సంబంధించిన అంశంలో పీజీ చేసి వారు అర్హులు. అభ్యర్థుల వయస్సు 65 ఏళ్లలోపు ఉండాలని ఆసక్తి కలిగిన అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో ఈనెల 19 లోపు నేరేడ్‌మెట్ డైట్ కాలేజీలో దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ రవికాంత్‌రావు తెలిపారు.

తొలి విడతలో 52,500 ఇళ్ల నిర్మాణం

(3వ పేజీ తరువాయి)

సొంత స్థలాలున్నాయన్నారు.

కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు..

నగరంలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ కాలుష్యం బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రమాణాలు పాటించాలన్నారు. ఇందుకు ఎలక్ట్రిక్ వాహనాలు, బస్సులను వినియోగించాలని సూచించారు. ఈ-వెహికిల్ పాలసీ ద్వారా ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలకు ఉచిత రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని చెప్పారు. అలాగే మెట్రో స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్ల నుంచి కాలనీల వరకు కూడా ఎలక్ట్రిక్ బస్సులతో ఫీడర్ సర్వీసులను ఏర్పాటు చేసే విషయంపై ఆలోచిస్తున్నామన్నారు.

2050 నాటికి సరిపడే నీటి ప్రణాళికలు

మహానగరం రోజురోజుకు విస్తరిస్తోందని, ప్రధాన జలాశయాలపైనే తాగునీటి సరఫరా ఆధారపడి ఉందని మంత్రి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు వచ్చే 2050 నాటికి కూడా సరిపడే విధంగా గోదావరి ఫేజ్-2, 3 కింద మరో 20 టీఎంసీల నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో సీఎం చేతుల మీదుగా పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మురుగునీరు రోడ్లపై ఓవర్ ఫ్లో కాకుండా సులువుగా ముందుకు సాగేలా డ్రైనేజీ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే 180 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్ మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు.

సియోల్, సబర్మతి తరహాలో మూసీ అభివృద్ధి

మురుగునీరు శుద్ధి చేసి మూసీలోనే వదిలే విధంగా ఎస్టీపీలను నిర్మిస్తున్నామని, ఇప్పటికే వందశాతం మురుగు శుద్ధికి చేరువయ్యామని చెప్పారు. ఆర్థిక భారమైనప్పటికీ ఎలాంటి ఆటంకం లేకుండా నగరవాసులకు ఉచిత నీటి సరఫరా పథకాన్ని అందిస్తున్నామన్నారు. సియోల్, సబర్మతి తరహాలో మూసీ నదిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ప్రతి 300 గజాలకు పైగా ఉన్న నివాసాల్లో ఇంకుడు గుంతలను తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే బహుళ అంతస్తు భవన సముదాయాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీలు) తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో అల్పాహారంపై ఆలోచన

నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో త్వరలో పిల్లలకు అల్పాహారం అందించే విషయాన్ని ఆలోచిస్తున్నామని మంత్రి పొన్నం చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అంగన్‌వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్‌ను అమలు చేస్తే హాజరుశాతం పెరిగే అవకాశం ఉంటుందని, ఇటీవల జిల్లా అధికారులు తన దృష్టికి తీసుకొచ్చినందున దానిని పరిశీలిస్తున్నామన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

'కమర్షియల్'పై ఫోకస్

(3వ పేజీ తరువాయి)

ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో సర్కిల్ స్థాయి ఉన్నతాధికారులు సెక్షన్ల వారీగా ఇలాంటి కనెక్షన్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా మేడ్చల్, సరూర్‌నగర్, సంగారెడ్డి, రాజేంద్రనగర్, హబ్సిగూడ, సైబర్‌సిటీ సర్కిళ్లపై డిస్కం ఉన్నతాధికారులు దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా అకౌంట్స్ వింగ్ అధికారులు పాతబకాయిల వసూళ్లకోసం క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తిరుగుతున్నారు.

టాప్‌లో సైబర్‌సిటీ

గ్రేటర్‌లో ప్రతినెలా విద్యుత్‌బిల్లుల ఆదాయం రూ. వెయ్యికోట్ల వరకు ఉంటే దాంట్లో 40 శాతం కమర్షియల్ ఆదాయమే ఉంటోంది. పది సర్కిళ్లలో కమర్షియల్ ఆదాయం పరంగా చూస్తే సైబర్‌సిటీ సర్కిల్ రూ.65కోట్లతో టాప్‌లో నిలుస్తోంది. కనెక్షన్ల సంఖ్య తక్కువగా ఉన్న కమర్షియల్ విద్యుత్‌వాడకం ఎక్కువగా ఉండటంతో సైబర్‌సిటీ, బంజారాహిల్స్ సర్కిళ్లలో ఆదాయం అధికంగా ఉంటోంది. బంజారాహిల్స్ సర్కిల్‌లో 56,472 కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉండగా ప్రతి నెలా రూ. 56కోట్ల నుంచి రూ.57 కోట్ల ఆదాయం వస్తోంది. హబ్సిగూడ సర్కిల్‌లో 92 వేలకుపైగా కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉండగా రూ. రూ.33కోట్ల నుంచి రూ.34 కోట్ల ఆదాయం వసూలవుతుంది.

గాంధీ ఆస్పత్రి నుంచి

నలుగురు అదృశ్యం

- ఇద్దరు రోగులు.. సహాయకురాలిగా వచ్చిన మహిళ, ఆమె కుమారుడు

బౌద్ధనగర్, జూన్14(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు సహా మరో రోగికి సహాయకురాలిగా వచ్చిన మహిళ తన కుమారుడితో సహా అదృశ్యమయ్యారు. మొత్తం నలుగురు అదృశ్యమైన ఘటనలకు సంబంధించి చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన పి.ప్రశాంత్ తన కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో మే 13వ తేదీన గాంధీ ఆస్పత్రిలో చేరారు. సహాయకురాలిగా భార్య పి.స్వప్న(25) కుమారుడు అభిలాష్(2) వచ్చారు. అయితే మే25న డబ్బుల కోసం మెదక్ వెళ్లొస్తానని భర్తకు చెప్పి అభిలాష్‌ను తీసుకుని వెళ్లిన స్వప్న ఊరుకు చేరుకోలేదు. దాంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబీకులు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


స్వప్న, అభిలాష్


ఎండీ రసూల్


నర్సింహ

మరో ఘటనలో ఇద్దరు

- అనారోగ్యంతో బాధపడుతున్న మెదక్ జిల్లా మల్లి గ్రామానికి చెందిన ఎండీ రసూల్(50)కు ఐదురోజుల క్రితం గాంధీలో చేరాడు. ఆయనకు సహాయకురాలిగా ఉన్న భార్య సహేదబేగం ఈనెల 12న ఆస్పత్రి బయట టీ తాగి వచ్చేసరికి భర్త కనిపించలేదు. దీంతో అతని అల్లుడు షేక్ ఇమ్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- అనారోగ్యంతో ఉన్న గాజులరామారం చంద్రగిరినగర్‌కు చెందిన ఎ.నర్సింహ(55) ఈనెల 12న గాంధీలో అడ్మిట్ అయ్యాడు. అదే రోజు అర్ధరాత్రి 12:30 గంటలకు నర్సింహ ఆస్పత్రి అత్యవసర వార్డు నుంచి కనిపించకుండ పోయాడు. దీంతో శుక్రవారం రాత్రి తన భర్త కనిపించటం లేదని భార్య అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గృహ నిర్మాణ కార్మికులకు ప్రత్యేక చట్టం తేవాలి

● రేపు ఇందిరాపార్కు వద్ద గృహకార్మికుల మహాధర్నా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేషనల్ ప్లాట్‌ఫారం ఆఫ్ డొమస్టిక్ వర్కర్స్ ప్రతినిధులు

బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నేషనల్ ప్లాట్‌ఫారం ఆఫ్ డొమెస్టిక్ వర్కర్స్ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 16న అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈమేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నేషనల్ ప్లాట్‌ఫారం ఆఫ్ డొమెస్టిక్ వర్కర్స్ ప్రతినిధి వర్గీస్ టేకాంత్, కన్వీనర్ లీజిజోసెఫ్, టీడీడబ్ల్యూఎల్ అధ్యక్షురాలు జోషెఫ్, జీయూటీఎఫ్ అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ.. ఐఎల్‌వో గృహకార్మికుల హక్కులను రక్షించేందుకు సమగ్ర చట్టం చేయాలని ఆదేశించిన ఇంతవరకు అమలు జరగలేదని, దీనిపై గత జనవరి 29న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని వారు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. గృహకార్మికుల చట్టం కోసం ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రం అందజేస్తామని వారు తెలిపారు.

బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అవగాహన



నిరంజనయ్య, శ్రీనివాస్‌లకు నియామకపత్రాలు అందజేస్తున్న సయ్యదా సీమాఫాతిమా తదితరులు

బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ ట్రస్ట్ డైరెక్టర్ సయ్యదా సీమాఫాతిమా, రాష్ట్ర అధ్యక్షుడు నైనం పల్లి శ్రీనివాస్, కార్యదర్శి నృజుల్లా షరీఫ్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ట్రస్ట్ 4వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు కంటి నిరంజనయ్యను ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా, ప్రభుత్వ ఉద్యోగి బండారు శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ నియామకపత్రాలతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థ నేటి సమాజానికి సవాల్‌గా మారిందని, దీనిని నిర్మూలించడానికి రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మానవ హక్కులను కాపాడడానికి ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేక్ కట్‌చేసి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. ట్రస్ట్ ప్రతినిధి అనస్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్‌గౌడ్

రాజేంద్రనగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సానెం శ్రీనివాస్‌గౌడ్ శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేయారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేయడానికి పనిచేయాలని సూచించారని సానెం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి బాటలు వేయాలన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న సీనియర్ నాయకులకు మంచి గుర్తింపు ఉంటోందన్నారు. పార్టీ అన్ని విషయాలపై దృష్టి సారించి సరైన నాయకులకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి సేవ చేసే బాగ్యం లభించడం సంతోషకరమని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటు ముందుకు సాగాలన్నారని సానెం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



● టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న గోషామహల్ నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరమ్ కన్వీనర్ బద్దం సతీష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శివకుమార్
- గోషామహల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి)



● రాష్ట్ర మంత్రిగా జి.వివేక్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గాంధీభవన్‌లో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, నాయకులు రణ్‌వీర్ సింగ్, బాలపోచయ్య తదితరులు
- అఫ్జల్‌గంజ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి)

పీరం చెరువులో శ్రమదానం



శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, ఐటీ ఉద్యోగులు



చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

నార్సింగ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం పీరంచెరువు పరిసర ప్రాంతాల్లో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. సేవ్ పీరంచెరువు కమిటీ ఆధ్వర్యంలో శనివారం కమిటీ సభ్యులు, స్థానికులు, ఐటీ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. చెరువులో ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు, చెత్తాచెదారం లాంటివి తొలగించారు. మన చెరువులను మనమే కాపాడుకోవాలని, చెరువులు బాగుంటే చాలా రకాల కాలుష్య సమస్యలు దూరమవుతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని అక్కడ పాల్గొన్న వారు పేర్కొన్నారు.

25న ఎమర్జెన్సీ చీకటి రోజులపై అవగాహన

● 20న ఎల్‌బీ స్టేడియంలో యోగా వేడుకలు



లంకల దీపక్‌రెడ్డి

బర్కత్‌పుర, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 ఏళ్ళు నిండిన సందర్భంగా విస్తృతమైన కార్యక్రమాలు చేపడుతున్నట్టు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి తెలిపారు. ఈ నెల 25న ఎమర్జెన్సీ ప్రకటించి 50 ఏళ్ళు నిండుతున్న సందర్భంగా ఎమర్జెన్సీ చీకటిరోజులపై యువతలో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమర్జెన్సీని వ్యతిరేకించినందుకు ఆనాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎంతో మంది జాతీయ వాదులను చిత్ర హింసలకు గురిచేసి జైల్లో పెట్టించారని ఆరోపించారు. ఎమర్జెన్సీ చీకటి రోజులను నేటి యువతకు తెలియజేయడానికే పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆయన చెప్పారు. ఈనెల 23న డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ పురస్కరించుకొని అన్ని డివిజన్లలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 20న ఎల్‌బీ స్టేడియంలో 50వేల మందితో యోగా వేడుకలు నిర్వహిస్తున్నామని, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

సర్కార్ బడుల్లో చేర్పించండి

● బడి బాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల అవగాహన



వాంబే కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, అధ్యాపకులు

రాజేంద్రనగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): లక్ష్మీగూడ వాంబే కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంది. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్దన్ అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య, మారధ్వతి, మంజుల, మదహర్, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, సాయి ప్రసన్న, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అండాలుతో కలిసి బడిబాట కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోటు, పాఠ్య పుస్తకాలు ఇవ్వడంతో పాటు మధ్యాహ్నం భోజనంతో పాటు ఎలాంటి ఫీజు లేకుండా ఇంగ్లిష్‌లో విద్యాభోధన ఉంటోందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే చిన్నారులను తీర్చిదిద్దనున్నట్టు వారు పేర్కొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపండి

సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులను లక్ష్మీగూడలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, సాయి ప్రసన్న కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను తీర్చిదిద్దడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారికి పౌష్టికాహారాన్ని కూడా అందజేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతి రోజూ గ్రుడ్డు, పప్పు అన్నం పెడతారు. ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు బాలామృతంతో పాటు నెలకు 16 గుడ్లు ఇస్తామని, బాలింతలకు, గర్భిణులకు రోజుకు ఒక గుడ్డు, 200 గ్రాముల పాలు, అన్నం వండి పెడతామన్నారు. ఇంత చక్కటి అవకాశం కల్పిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల సేవలను అర్హులైన ప్రతి ఒక్క రూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకురాలు లక్ష్మమ్మ, అంగన్‌వాడీ ఆయా మహానంద తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సహాయం చేయాలి



నేతాజీ నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

రాజేంద్రనగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వర్షాలకు మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వరద నీరు చేరుతోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాల ఆవరణమంతా బురద మయంగా తయారైంది. స్థానికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సహకరించి పాఠశాల ఆవరణలోకి వరద నీరు రాకుండా పనులు చేపట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, ఉపాధ్యాయులు మహేశ్వర్, లక్ష్మి, యాదమ్మ కోరుతున్నారు. పాఠశాల గేటు వద్ద నిల్వ ఉంటున్న వరద నీరు ఆవరణలోకి వస్తోందని, ఇలాగే జరిగితే విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదముందని గుర్తు చేస్తున్నారు. వాష్ రూమ్‌ల వద్దకు వెళ్లాలన్నా, తరగతి గది నుంచి బయటకు రావాలన్నా రాలేని పరిస్థితి నెలకొందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు తమ పాఠశాలను సందర్శించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బడిబాటలో కార్పొరేటర్ లాల్‌సింగ్, తదితరులు

లోయర్ ధూల్‌పేట్‌లో బడి బాట

అఫ్జల్‌గంజ్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బడి బాట కార్యక్రమంలో భాగంగా లోయర్ ధూల్‌పేటలోని సీతారాంపేట్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల, జుమ్మేరాత్ బజార్‌లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో గోషామహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పాల్గొని విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కరుణాదేవి, ఎ.వేణుమహాదేవ్, సంజీవ్‌రావు, ఎల్.అశోక్, స్వాతి ఠాకూర్, బీజేపీ నాయకులు జైపాల్‌సింగ్, సుధాకర్‌గౌడ్, అక్షయ్ సాహు, ప్రదీప్‌సింగ్, కిషన్ పాల్గొన్నారు.



2024-25 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి జగదీష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ విజయభాస్కర్‌ను సన్మానించి జ్యోతిరావు ఫూలే అవార్డును ప్రదానం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్సీ కొమరయ్య, తదితరులు
- చాంద్రాయణగుట్ట, జూన్ 14(ఆంధ్రజ్యోతి)

రక్తదాన శిబిరం



హ్యూమినిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెహిదీపట్నం నానాల్ నగర్ జీఎం గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఇర్ఫాన్‌షేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు యువతీ యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో తలసీమియా సొసైటీ వారు, శ్రీరామ్ డయాగ్నోస్టిక్ సెంటర్, ఒరియంటల్ ఆస్పత్రి సిబ్బంది, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జాయేద్, లోహిత పాల్గొన్నారు. - కార్వాన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి)

వాహ్.. క్యా రోడ్డు హై!



గురువారం ఉదయం ఒక దఫా, సాయంత్రం ఒక దఫా కురిసిన సాధారణ వర్షానికి రోడ్డు కోసుకుపోయింది. ఇది గండిపేట మండలం బండ్లగూడ మున్సిపాలిటీలో వైష్ణవి వయానీస్ టౌన్‌షిప్ వద్ద. చిన్నపాటి వర్షానికే రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే, వర్షాకాలంలో ఎలా ఉంటుందోనని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. ప్రమాదాలు జరగక ముంతే అధికారులు మేల్కోవాలంటున్నారు.
- నార్సింగ్, జూన్ 14(ఆంధ్రజ్యోతి)



గౌలిపురా డివిజన్ బాలాగంజ్‌లో రూ.5.90 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే బాగ్యలక్ష్మి
- చాంద్రాయణగుట్ట, జూన్ 14(ఆంధ్రజ్యోతి)

ఆహార తయారీ కేంద్రంపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అందిన ఫిర్యాదు మేరకు ఆయన ఆదేశాలతో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం గోల్కొండలోని ఓ ఆహార తయారీ కేంద్రం (సమోసా, ఇతర ఆహార పదార్థాలు)పై దాడులు చేసి తనిఖీ చేశారు. తయారీ కేంద్రం ఎండీ అల్తాఫ్.. ఎలాంటి లైసెన్స్, అనుమతులు లేకుండా అక్రమంగా ఈ యూనిట్‌ను నడుపుతున్నట్టు అధికారులు గుర్తించారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా.. ఆహార పదార్థాలను చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు గుర్తించి యూనిట్‌ను సీజ్ చేశారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలకు అన్యాయం'

చార్మినార్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధీ అన్నారు. పురాని హవేలిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులను మైనార్టీ సంక్షేమ శాఖలో విలీనం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయినా ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లింలను నిరాశ పరిచారన్నారు. తెలంగాణ మంత్రివర్గంలో ముస్లిం ప్రాతినిధ్యాన్ని విస్మరించి ముస్లింల మనోభావాలను దెబ్బతీశారన్నారు.

సిటీ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న ఎస్.శశిధర్ రెడ్డి, తదితరులు

చార్మినార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుంటే సమయం, ధనం ఆదా అవుతుందని సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం జాతీయలోక్ అదాలత్‌లో భాగంగా హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులోని లోక్ అదాలత్‌లో 1234 కేసులు పరిష్కరించబడ్డాయి. అందులో పెండింగ్‌లో ఉన్న 693 కేసులు, 541 ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించి వారికీ రూ. 43 కోట్ల 42 లక్షల 93 వేల 069 చెల్లించారు, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అదనపు న్యాయమూర్తి జి.ఉదయ్ కుమార్, డి.వి.నాగేశ్వరావు, సి.సురేష్, ఎం.ఎస్. అనామికతో పాటు న్యాయవాదులు కక్షిదారులు పాల్గొన్నారు.

బస్తీల్లో జలమండలి అధికారుల పర్యటన



బస్తీల్లో పర్యటిస్తున్న జలమండలి అధికారులు, బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఉప్పుగూడ, లలితాబాగ్, రియాసత్‌నగర్ డివిజన్లలోని పలు బస్తీల్లో శనివారం జలమండలి అధికారులు పర్యటించారు. మురుగునీరు సమస్య, లోప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతున్న విషయాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బస్తీల్లో నీటి సమస్యపై లైన్‌మెన్, మేనేజర్‌లకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయిందని బీజేపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు శాశ్వత పరిష్కారం కనుగొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్, భాగ్యనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యులు డి.మాణిక్, నాయకులు చిరంజీవి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

హైవే రోడ్డు విస్తరణ పోరాట కమిటీ ఏర్పాటు

నార్సింగ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అప్పా జంక్షన్ నుంచి వికారాబాద్ వన్‌వే వరకు ప్రభుత్వం రోడ్డు వెడల్పు చేసి నిర్మిస్తామని ప్రకటించింది. కానీ ఇంత వరకు పనులు మొదలు పెట్టడంలేదు. ఈ రోడ్డును నాలుగులైన్‌ల రోడ్డుగా మారుస్తామని ప్రకటనలకే పరిమితమైంది. ఈ విషయంపై పోరాటం చేయాలని రాజేంద్రనగర్, చేవేళ్ల, పరిగి, వికారాబాద్ ప్రాంత ప్రజలు కలిసి 'హైవే విస్తర్ణ పోరాట కమిటీ'ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆందోళనలు, ధర్నాలు, వినతిపత్రాలు వంటి కార్యక్రమాలు చేపట్టి రోడ్డు విస్తర్ణ చేయించాలని వారంతా డిమాండ్ చేశారు. ఈ రోడ్డు చిన్నగా ఉండడంతో అనేక ప్రమాదాలు జరిగి, చాలా మంది మరణిస్తున్నారని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ రోడ్డు విస్తరణ కోసం 13 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేశారని వారు గుర్తు చేశారు. ఈ ఉద్యమం ఎలా నడపాలన్న విషయంపై 15వ తేదీన హైదర్షాకోట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

పాతబస్తీ బోనాల ఉత్సవాల్లో ఉమ్మడి ఆలయాల పాత్ర కీలకం



బోనాల ఉత్సవాలు (ఫైల్)

చాంద్రాయణగుట్ట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాస బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించడంలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ పాత్ర కీలకంగా ఉంటుంది. భక్తులను ఏకతాటిపైకి తెచ్చి వారి మనోభావాలను కాపాడడానికి 75 ఏళ్ల క్రితం నాలుగు దేవాలయాలతో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఏర్పాటైంది. రొటేషన్ పద్ధతిలో ప్రతి ఏటా ఒక్కరు అధ్యక్షుడిగా ఎన్నికై ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాలక్రమేణా ఊరేగింపు కమిటీలో ఎనిమిది దేవాలయాలు చేరాయి. 2025 బోనాల ఉత్సవాల కమిటీ అధ్యక్ష పదవి హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయానికి వంతు రావడంతో గోపిశెట్టి రాఘవేందర్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బోనాల ఉత్సవాల సందర్భంగా సప్త బంగారు బోనాలు సమర్పిస్తామని ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్, ఉపాధ్యక్షుడు బుల్లెట్ శ్రీధర్, కార్యదర్శులు మాణిక్ ప్రభుగౌడ్, వేణు గోపాల్, శ్రీకాంత్ తెలిపారు.

ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తాం



తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బోనాల ఉత్సవాలను ఈయేదాది ప్రభుత్వ సహకారంతో వైభవంగా నిర్వహిస్తాం. ఇప్పటికే ప్రభుత్వం బోనాల నిర్వహణ కోసం రూ. 20 కోట్లు మంజూరు చేయడం హర్షణీయం.
- గోపిశెట్టి రాఘవేందర్, ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు

'చిన్న గుడులకు కూడా నిధులు కేటాయించాలి'

మదీన, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణంలో బోనాల జాతరకు ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి చర్చించారు. పాతబస్తీలోని ప్రముఖ దేవాలయాలతోపాటు బహదూర్‌పురా నియోజకవర్గంలోని దేవాలయాల్లో కూడా ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రముఖ దేవాలయాలకే కాకుండా చిన్న గుడులకు ప్రభుత్వం ఇచ్చే బోనాల ఫండ్‌ను 10 శాతం అయినా పెంచి ఇవ్వాలని ఆయన మంత్రిని కోరారు.

ఎంఐఎం ఆగడాలను అడ్డుకుంటాం: మాధవీలత

సైదాబాద్, జూన్14(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ఎంఐఎం ఆగడాలను అడ్డుకుంటామని బీజేపీ నేత మాధవీలత అన్నారు. మలక్‌పేట అస్మాన్‌గఢ్‌ని ఎలైట్ రెసిడెన్సీలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అక్రమ కట్టడం అడ్డుకున్న అపార్ట్‌మెంట్‌వాసులపై బిల్డర్, అతడి అనుచరులు చేసిన దాడిలో గాయపడి సైదాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు బ్రహ్మానందును ఆమె శనివారం పరామర్శించారు. అనంతరం అపార్ట్‌మెంట్‌కు వెళ్లి బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. అపార్ట్‌మెంట్ వాసులు ఎటువంటి భయాందోళనకు గురికావద్దని భరోసానిచ్చారు. బీజేపీ అండగా ఉంటుందని ధైర్యమిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డి, వాసరసేన అధ్యక్షుడు రాంరెడ్డి, రమణ్‌సింగ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుడిపై కేసు

బంజారాహిల్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారుడిపై కేసు నమోదైంది. కోట్ల రూపాయలు విలువచేసే జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 1 లో జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ కు చెందిన 2000 గజాల స్థలాన్ని పి సత్యనారాయణ అనే వ్యక్తి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని సొసైటీ జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయగా 2010లో అధికారులు నోటీసులిచ్చారు. అనంతరం ఈ వివాదం కోర్టుకు వెళ్లింది. స్థలాన్ని స్వాధీనపరుచుకోవాలని 2022లో కోర్టు.. జీహెచ్ఎంసీని ఆదేశించింది. అధికారులు నోటీసులిచ్చి పట్టించుకోవడం మానేశారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు సత్యనారాయణపై చట్టపరమైన చర్యలు తీసుకొని అందు వద్ద ఉన్న దాఖలాల మెంట్లను పరిశీలించి కేసు నమోదు చేయాలని రవీంద్రనాథ్ పోలీసులను కోరారు. ఆ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు సత్యనారాయణ పై 467, 468, 471, 420, 427, 447 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బసవతారకం ఆస్పత్రిలో యోగాపై ప్రత్యేక సదస్సు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రత్యామ్నాయ వైద్య విభాగం, యాడ్ లైఫ్, పుణె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతిలు... సంయోగం పేరుతో శనివారం యోగా పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం బసవతారకం ఆస్పత్రిలో జరిగింది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంయోగ పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో సమగ్రమైన ఆరోగ్యం కోసం యోగాను ఆధునిక వైద్య విధానంతో ఎలా అనుసంధించాలనే విషయాన్ని వక్తలు చర్చించారు. కార్యక్రమంలో యాడ్ లైఫ్ నేచురోపతి విభాగం అధిపతి డాక్టర్ సుమతితో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బలవంతంగా మద్యం తాగించి.. రాడ్డుతో భార్య దాడి

● ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి

సైదాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో విసుగుచెందిన భార్య చంద్ర అలియాస్ ఆయేషా భర్త జీషన్ అలీ(45)ను మద్యం తాగించి ఇనుపరాడ్డుతో దాడి చేయగా తీవ్ర గాయాలపై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జీషన్ అలీ బతుకుదెరువుకు 20 సంవత్సరాల క్రితం ఉత్తర ప్రదేశ్ నుంచి నగరానికి వలసవచ్చి పూల వ్యాపారిగా స్థిరపడ్డాడు. ఆమెను ప్రేమ వివాహం చేసుకుని ఎల్బీనగర్‌లో నివాసముండేవారు. నెల క్రితం సైదాబాద్ సింగరేణి వాంబేకాలనీకి మకాం మార్చారు. అయితే జీషన్ అలీ తరుచుగా మద్యం తాగి కొడుతుండటంతో స్థానికంగా ఉన్న వ్యక్తితో కలిసి ఎల్బీనగర్ పీఎస్‌లో భార్య ఫిర్యాదు చేసింది. కక్ష పెట్టుకుని నిత్యం తాగి గొడవకు దిగేవాడు. విసుగుచెందిన భార్య గురువారం ఇంట్లో భర్తకు బలవంతంగా మద్యం తాగించి మత్తులో ఉండగా ఇనుప రాడ్‌తో దాడి చేసింది. తీవ్ర గాయాలైన జీషన్ అలీని స్థానికుల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కేసును సైదాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'సుమన్' విద్యాసంస్థలో బీబీఏ కోర్సు

చందానగర్, జూన్14(ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో సామర్థ్యాలను పెంపొందించి జీవితంలో రాణించవచ్చని గవర్నర్ సతీమణి సుధాదేవ్ జీ వర్మ అన్నారు. చందానగర్ గంగారం సుమన్ మహిళ దక్షిణ సమితి విద్యాసంస్థలో శనివారం బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) కోర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం మహిళా దక్షిణ సమితి అధ్యక్షురాలు డాక్టర్.సరోజ్ బజాజ్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ కార్యదర్శి డాక్టర్ వి.ఎస్. అలగు వర్షిణి(ఐఏఎస్)తో కలిసి ఆమె ప్రారంభించారు.

వియ్ హబ్, ఫ్లిప్‌కార్ట్.. వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వియ్ హబ్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు కలిసి శనివారం వియ్ హబ్ క్యాంపస్‌లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా వియ్ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఉషా సత్య, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ పబ్లిక్ పాలసీ హెడ్ డాక్టర్ వసీమ్ సిద్దిఖీ తదితరులు హాజరై మాట్లాడారు. మహిళా వ్యవస్థాపకులకు ఈ- కామర్స్ రంగంలో ఉన్న అవకాశాల పట్ల అవగాహన కల్పించటంతో పాటుగా వ్యాపారాన్ని విస్తరింపజేయడానికి అవసరమైన పరిజ్ఞానం, సాధనాలతో శక్తివంతం చేయటానికి ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు.

రేపు జాబ్ మేళా

పంజాగుట్ట, జూన్14(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్, స్కిల్స్, లోన్ మేళా నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ (టీఆర్ఎల్డీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆక్టస్ సొసైటీ, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఉద్యోగశిక్షణ శాఖల సహకారంతో ఈ నెల 16న బషీర్ బాగ్ లోని పీజీ న్యాయ కళాశాలలో నిర్వహించనున్న ఈ మేళాలో 80 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర నైపుణ్య అభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



కొవ్వొత్తుల ర్యాలీ

అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ట్యాంక్ బండ్ వద్దకు ర్యాలీగా చేరుకుని పీసీసీ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలోనూ లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉన్న డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకుని క్యాండిల్స్ వెలిగించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయా ర్యాలీల్లో పార్టీల ముఖ్యనేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/ కవాడిగూడ



ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో విభేదాలు

● నియోజకవర్గ సమావేశంలో స్వల్ప ఉద్రిక్తత

బంజారాహిల్స్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పి విజయారెడ్డి వర్గానికి చెందిన ఓ సైదారెడ్డి నాయకుడు మాట్లాడుతూ పార్టీ జెండాను మోసిన వారిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఇక మీదట ఇలా జరిగితే ఎవరిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలను మేయర్‌తో పాటు దానం మనుషులు వ్యతిరేకించారు. విజయారెడ్డి మనుషులతో వాగ్వాదానికి దిగడంతో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. చివరకు సీనియర్‌లు కలగ చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం: ఎమ్మెల్యే దానం నాగేందర్

కార్యకర్తల బలమే కాంగ్రెస్‌కు కొండంత అండని వారి మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నాయకుల వెనకాల తిరుగుతూ జెండాలు కొడితే పదవులు దక్కవని పార్టీ కోసం పనిచేసే వారికే తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం శనివారం ఆయన అధ్యక్షతన బంజారాహిల్స్‌లోని లేక్ వ్యూ బంజారాలో జరిగింది. ముఖ్య అతిథులుగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగిరెడ్డిరోహిన్‌రెడ్డి, పరిశీలకుడు వినోద్ హజారియా హాజరయ్యారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ నగరంలో కాంగ్రెస్‌ను బలపేతానికి ప్రతీ ఒక్కరు కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతీఒక్కరి పై ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

పత్రికా స్వేచ్ఛను నియంత్రించే యత్నం

పంజాగుట్ట, జూన్14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నాయని, పరిస్థితి ఇలానే ఉంటే జర్నలిస్టులు రానున్న రోజులలో చాలా గడ్డు కాలం ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే శక్తులు వివిధ రూపాల్లో వివిధ స్థాయిలలో ఉన్నాయన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు, రహమాన్ పై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ప్రజాస్వామ్యం - పత్రికా స్వేచ్ఛ'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీనియర్ పాత్రికేయులు దిలీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, దేవులపల్లి అమర్, విజయ్ బాబు, టంకశాల అశోక్, అల్లం నారాయణ తదితరులు మాట్లాడారు. శైలేష్ రెడ్డి, రహమాన్, దసుజయ రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి రాజేష్, బాపురావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కే శ్రీనివాస్

చిట్టి చేతులు.. వంట సామగ్రిని మోస్తూ..

● మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో వెలుగులోకి

సరూర్‌నగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు పట్టుకోవాల్సిన చేతులు వంటసామగ్రిని మోశాయి. భవిష్యత్తును తీర్చిదిద్దుకుందామని ఎంతో ఆశతో వచ్చిన వారికి విద్యాసంవత్సరం ఆరంభంలోనే అగచాట్లు గురయ్యారు. మేడ్చల్ మల్కాజిగిరి... పుస్తకాలు పెట్టాల్సి ఉండగా.. శారీరకంగా శ్రమించారు. ఇదే పాఠశాల ఆవరణలో ఎంతమో కార్యాలయం ఉన్నా ఈ విషయం గురించి పట్టించుకోకపోవడం దారుణం. విషయానికొస్తే.. బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ఓ ట్రస్ట్ ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరా అవుతోంది. నగరంలో అక్షయపాత్ర ద్వారా సరఫరా చేస్తున్న సదరు ఆహారాన్ని ట్రస్ట్ నిర్వాహకులు ఆటోలో పాఠశాలలకు తరలిస్తుంటారు. వాస్తవానికి ఆటోలో వచ్చిన ఇద్దరో భోజనం పాత్రలన్నింటిని వరండాలో గానీ, గదిలోగానీ జాగ్రత్తగా పెట్టి వెళ్లాలి. స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా ఇతర ఉపాధ్యాయులు పర్యవేక్షించాలి. ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆటోలో వచ్చే వ్యక్తులు దర్జాగా కూర్చుని, విద్యార్థులతో పాత్రలు మోయిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు గురువారం ప్రారంభం కాగా.. మరోసటి రోజైన శుక్రవారం బాలాపూర్ మండలం మల్లాపూర్ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం పాత్రలు మోశారు. అదే పాఠశాల ఆవరణలో మండల విద్యాధికారి కార్యాలయం కూడా ఉండడం ఇక్కడ గమనార్హం.



మధ్యాహ్న భోజనం పాత్రలను మోస్తున్న విద్యార్థులు

ఉద్యోగాల భర్తీకి కేటీఆర్ మోకాలడ్డు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీని కేటీఆర్ అడ్డుకుంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆరోపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయనకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం ఉస్మానియా వర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ దయాకర్‌ను అభినందించారు. రాష్ట్ర పాలన దేశానికే ఆదర్శమని దయాకర్ అన్నారు. కేటీఆర్ హద్దులు దాటి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. 10 ఏళ్లలో ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేశారని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని పేర్కొన్నారు. గద్దర్ అవార్డులపై మాట్లాడే స్థాయి బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ యువత అభివృద్ధి కోసం, విద్యావ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు

డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిన్‌రెడ్డి .. నేతలను హెచ్చరించారు. శనివారం నగరంలో నిర్వహించిన కాంగ్రెస్ ఖైరతాబాద్ నియోజకవర్గ సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ వర్గీయులు, కార్పొరేటర్ విజయారెడ్డి వర్గీయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ సమావేశం తీరుపై, రభస కారణాలకు గల కారణాలు, వర్గ విభేదాలపై పూర్తిస్థాయి నివేదికను త్వరలోనే పార్టీ క్రమశిక్షణ కమిటీకి సిఫారసు చేస్తామన్నారు.



వైభవంగా ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ 2025

హైదరాబాద్ సిటీ , జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ 2025 వేడుకను ప్రైడ్ ఇండియా అవార్డ్స్ సంస్థ ఘనంగా నిర్వహించింది. సోమాజిగూడలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా విచ్చేసిన ఆయా రంగాల్లోని ప్రముఖులకు దక్షిణాది నటి కావ్యా థాపర్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నటి మాట్లాడుతూ, "ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో పాలుపంచుకోవడం గౌరవంగా భావిస్తున్నా"న్నారు. ప్రైడ్ ఇండియా అవార్డ్స్ వ్యవస్థాపకులలో ఒకరైన వినయకుమార్ మాట్లాడుతూ, 120 మందికి ఈసారి అవార్డులను అందజేశామన్నారు.

సీవీడీ కేసులు భారత్‌లో అధికం

● యశోద ఆస్పత్రుల సంస్థ డైరెక్టర్ డాక్టర్ జీఎస్‌రావు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్డియో-వాస్కులర్ వ్యాధులు రోజురోజుకు పెరుగుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా కార్డియో- వాస్కులర్ డిసీజ్ (సీవీడీ)లక్షలతో ఎక్కువగా భారతదేశంలో ఒకటి అని యశోద ఆస్పత్రుల సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జీఎస్ రావు పేర్కొన్నారు. యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో హైటెక్ సిటీ బ్రాంచ్‌లో శనివారం అంతర్జాతీయ కార్డియాలజీ సదస్సు లైవ్ వర్క్‌షాప్ ఆయన ప్రారంభించారు. భారతదేశంలో సీవీడీతో మరణాల సంఖ్య 2.26 మిలియన్ల (1990) నుంచి 4.77 మిలియన్లకు (2020) పెరిగిందని అంచనా వేసినట్లు వివరించారు. భారతదేశంలో గత కొన్ని దశాబ్దాలుగా అంచనా వేస్తున్నారని, గ్రామీణ జనాభాలో 1.6 శాతం నుంచి 7.4 శాతం వరకు, పట్టణ జనాభాలో 1 శాతం నుంచి 13.2 శాతం వరకు పెరిగినట్లు చెబుతున్నాయని పేర్కొన్నారు. క్లినికల్ కార్డియాలజీలో గుండె జబ్బుల చికిత్సలో వచ్చిన అధునాతన వైద్య విధానాలు, అడ్వాన్స్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు లైవ్ వర్క్‌షాప్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడానికి ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన సుమారు 500 మందికి పైగా కార్డియాలజీ వైద్యులు పాల్గొన్నారు. సీనియర్ కార్డియాలజిస్ట్, ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ డాక్టర్. వి. రాజశేఖర్ మాట్లాడుతూ యశోద ఆస్పత్రిలో కార్డియాలజిస్టులకు ఉన్నత స్థాయి శిక్షణ ఇచ్చేందుకుగాను హైటెక్ సిటీ లోని ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ విభాగం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది.



అంతర్జాతీయ కార్డియాలజీ సదస్సు లైవ్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న యశోద ఆస్పత్రుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు

నటి కల్పికపై మరో కేసు

● సోషల్ మీడియాలో వేధిస్తోందంటూ సైబర్ క్రైమ్‌లో బాధితురాలు ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రిజం పబ్‌లో జరిగిన వివాదంలో సినీనటి కల్పికపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఆమెపై హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చేసుకొని కల్పిక తనను అసభ్య పదజాలంతో దూషిస్తోందని, ఆన్‌లైన్‌లో వేధింపులకు పాల్పడుతోందని కీర్తన అనే బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అందుకు సంబంధించిన ఆధారాలను పోలీసులకు సమర్పించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నీట్‌లో 'రెసొనెన్స్' సత్తా

నీట్ 2025 ఫలితాల్లో రెసొనెన్స్ సత్తా చాటిందని రెసొనెన్స్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, ఎండీ పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. హైదరాబాద్ క్యాంపస్ నుంచి ప్రతీ ముగ్గురిలో ఒక విద్యార్థి మెడికల్ సీటు సాధించడం గర్వకారణం అన్నారు. 72వ ర్యాంక్‌ను హరిణి శ్రీరామ్, 185వ ర్యాంక్‌ను కార్తిక్ ఎంబర్, 225 ర్యాంక్‌ను అన్మోల్ సింగ్, 285వ ర్యాంక్‌ను ధీరజ్, 398వ ర్యాంక్‌ను పి. శ్రావ్య హంసే సాధించారని తెలిపారు.

- హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి)

నీట్ ఫలితాల్లో గురుకులం ప్రతిభ

రాయదుర్గం, జూన్14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. చందన ఆలిండియా 1,61,687, క్యాటగిరి (8410), ప్రవంతి ఆలిండియా 2,58,043 (ఎస్టీ క్యాటగిరి 4974), అక్షయ ఆలిండియా 43,985 (ఓబీసీ క్యాటగిరి 20,863), స్పందన ఆలిండియా 30,732 (ఓబీసీ క్యాటగిరిలో 14,214) ర్యాంకులు సాధించారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

● నీట్ ఫలితాల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని గురుకుల పాఠశాల విద్యార్థులు ఎం.శేఖర్(526), శ్రీకాంత్(642), ఎం.సందీప్(1514), ఎం.మూర్తి(1898), డి.మహేష్, పి.అశోక్ ర్యాంకులు సాధించారు. మొత్తం 85మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌తో పాటుగా నీట్ పరీక్షకు శిక్షణ పొందగా 22 మంది విద్యార్థులు అర్హత సాధించారని కళాశాల ప్రధాన ఆచార్యులు అంజయ్య తెలిపారు.



ఎం. శేఖర్ (ర్యాంక్ 526)

దరఖాస్తుల ఆహ్వానం

అల్వాల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ స్కూళ్లలో 2025-26కి గాను నాలుగో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) తెలిపింది. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లల్లో ఉన్న సీట్ల ఖాళీ కోసం www.tgstelangana.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. సెప్టెంబర్ 1, 2016 నుంచి ఆగస్టు 30, 2017 మధ్య జన్మించిన 8, 9 సంవత్సరాల వయసు గల వారు అర్హులని పేర్కొంది.



బిజినెస్ ప్లస్

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.



లవ్ యూ నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్లు పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

ఇదీ GST

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసీకి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..

ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యక్తికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్సే-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జీఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కొజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃపవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, ధీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ట సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 138 ఆలౌట్; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకు ముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.



మార్‌క్రమ్

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్‌క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
హైదరాబాద్ ● ఆదివారం 15 జూన్ 2025

రేవంత్ అన్నా... తగ్గేదేలే

సంధ్య థియేటర్ ఘటన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, అల్లు అర్జున్ ఒకే వేదికను పంచుకోవడం ఇదే తొలిసారి కావడం, వారిద్దరి కలయిక ఎలా ఉండబోతోందో అనే ఆసక్తిని పెంచింది. అల్లు అర్జున్‌ను రేవంత్‌రెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'పుష్ప 2' చిత్రానికి గాను ఉత్తమనటుడు పురస్కారాన్ని రేవంత్‌రెడ్డి నుంచి అందుకున్నారు అల్లు అర్జున్. వ్యాఖ్యాతలు ఆయన్ను వేదికపై మాట్లాడాలని కోరడంతో అల్లు అర్జున్ మైక్ అందుకున్నారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి అన్న అంటూ ముఖ్యమంత్రిని సంబోధించారు. 'సినిమా ఫంక్షన్ కాబట్టి సరదాగా ఒక డైలాగ్ చెప్పొచ్చా అన్నా' అంటూ రేవంత్‌రెడ్డిని అనుమతి అడగడం, ఆయన నవ్వుతూ అనుమతిస్తున్నట్లు చేతిని ఊపడంతో 'పుష్ప 2'లోని డైలాగ్‌ను అల్లు అర్జున్ చెప్పారు.




పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు
మణిరత్నం


బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు
సుకుమార్


నాగిరెడ్డి - చక్రపాణి అవార్డు
అట్లూరి పూర్ణచంద్రరావు


కాంతారావు ఫిల్మ్ అవార్డు
విజయ్ దేవరకొండ


రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు
యండమూరి వీరేంద్రనాథ్


2024 ఉత్తమ నటి
నివేదా థామస్


ఉత్తమ చిత్రం బాహుబలి 2
రాజమౌళి, ప్రసాద్ దేవినేని

కన్నుల పండుగగా గద్దర్ అవార్డుల వేడుక

'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024' ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా 2024 ఏడాదికి గాను తెలుగు చలనచిత్రాలకు చెందిన వివిధ కేటగిరీల్లో విజేతలతో పాటు 2014-2023 వరకు ఉత్తమ ప్రథమ, ద్వితీయ, తృతీయ చలనచిత్రాలకు, ఉత్తమ నటీనటులు, దర్శక నిర్మాతలకు సైతం ఈ పురస్కారాలను అందించారు. 14 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినిమాకు ప్రాంతీయ అవార్డులు ఇచ్చింది ఈ కార్యక్రమానికి యావత్ చిత్ర పరిశ్రమ కదిలొచ్చింది. తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ఎండీ ఎస్. హరీష్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. రెడ్‌కార్పెట్‌పై సినీ ప్రముఖులు సందడి చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే అవార్డ్ ఫంక్షన్‌కు సంబంధించిన సావనీర్‌ను వారిద్దరూ ఆవిష్కరించారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ మెమెంటోనూ రూపొందించిన రమావత్ నాగుల నాయక్‌ను, జ్యూరీ చైర్మన్ మురళీమోహన్, చైర్‌పర్సన్ జయసుధ, సభ్యులు కే దశరథ్, డీవీకేరాజు, ఊహ తదితరులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు ఎస్. తమన్, ఎం.ఎం కీరవాణి, గాయకులు రామ్ మిరియాల, మంగ్లీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గద్దర్‌ను గుర్తు చేసుకుంటూ మంగ్లీ 'పొడుస్తున్న పొద్దుమీద, బండెనక బండికట్టి' పాటలు ఆలపించారు. పాతతరం కథానాయికలు జయప్రద, జయసుధ, సుహాసిని, ఒకేఫ్రేమ్‌లో కనిపించి అలరించారు. భీమ్స్ సిసిరోలియో తల్లితో పాటు కలసి పురస్కారం అందుకున్నారు. ఆ సందర్భంలో ఆయన తల్లిని ముద్దాడిన దృశ్యం మనసుకు హత్తుకుంది. ముందుగా వ్యక్తిగత అవార్డ్ విభాగం ప్రధానంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ పురస్కారాలను అందజేశారు. తర్వాత రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తొలిపురస్కారాన్ని 'రజాకార్' చిత్రానికి గాను ఉత్తమ నిర్మాతగా గూడురు నారాయణరెడ్డి, దర్శకుడు యాట సత్యనారాయణకు అందజేశారు. ఉత్తమ ప్రజాదరణ చిత్రం కేటగిరిలో 'ఆయ్' చిత్రానికి గాను బన్నీ వాసు తరపున అల్లు అరవింద్ పురస్కారం అందుకున్నారు.

శుభ పరిణామం

14 ఏళ్ల తర్వాత ఈ రోజు తెలుగు సినిమా అవార్డ్ వేడుకను నిర్వహించుకోవడం శుభ పరిణామం. 2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి జ్యూరీ ఎంపిక చేసిన చిత్రాలకు అవార్డ్ ఇవ్వడం సంతోషకరం. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ఈ రోజు ఇంత వైభవంగా నిర్వహించుకోవడానికి కారణమైన తెలంగాణ సీఎం ఎ. రేవంత్‌రెడ్డి గారికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి ధన్యవాదాలు.

- దిల్‌రాజు

నా కుటుంబం తరపున ధన్యవాదాలు

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నందమూరి బాలకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ ప్రభుత్వం బ్రహ్మాండమైన ఉత్సవాన్ని జరుపుతోంది. గద్దరన్న తెలంగాణ ముద్దుబిడ్డ. ఆయన పేరును చిరస్థాయిగా నిలబెట్టేలా ఈ అవార్డ్‌లు ఇవ్వడం గొప్ప విషయం. అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. 1996లో ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఇవ్వడం మొదలైంది. మధ్యలో ఆగిపోయింది. మళ్లీ పదేళ్ల తర్వాత తిరిగి ఎన్టీఆర్ అవార్డ్‌ను ఇస్తున్నందుకు నా కుటుంబం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ అవార్డ్‌కు తొలి గ్రహీతగా ఎంపికవ్వడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ పురస్కారంతో పాటు ఇచ్చే నగదు బహుమతిని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు రేవంత్ అన్న ఇచ్చినట్లు భావిస్తున్నాను' అని చెప్పారు.

నా బాధ్యతను పెంచింది

సినిమా పరిశ్రమను ఒకతాటిపైకి తెచ్చి గద్దరన్న పేరుతో అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. కాంతారావు గారి పేరు మీద ఇచ్చే అవార్డ్‌ను స్వీకరిస్తున్న తొలి నటుడిగా నా బాధ్యతను మరింత పెంచింది. రేవంత్‌రెడ్డి గారికి ధన్యవాదాలు.

విజయ్ దేవరకొండ



2024లో ఉత్తమ చిత్రాలు


మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ - దర్శక నిర్మాతలు చలసాని అశ్వనిదత్, నాగ్ అశ్విన్


రెండో ఉత్తమ చిత్రం పొట్టేల్ - నిర్మాత ఎస్ కుమార్


మూడో ఉత్తమ చిత్రం లక్కీ భాస్కర్ - దర్శకనిర్మాత వెంకీ అట్లూరి, నాగవంశీ


రజాకార్ (బెస్ట్ పిక్చర్ ఆన్ హిస్టరీ)
నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ


ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా-2)


దర్శకులు- సుజిత్, సందీప్ ('క')


బాలనటులు -అరుణ్‌దేవ్, హారిక (35 చిన్న కథ కాదు)


ఉత్తమ చిత్రం ఉప్పెన
నవీన్ యెర్నేని, వై. రవిశంకర్


దర్శకుడు వేణు - బలగం


అడివి శేష్ - మేజర్


జ్యూరీ చైర్మన్ మురళీమోహన్


జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ


కీరవాణి, చంద్రబోస్‌కు సత్కారం


దర్శకుడు యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)

భూదాన్ భూములపై భారీ కుట్ర!



(మొదటిపేజీ తరువాయి)

తారుమారు చేశారని ఆరోపిస్తూ.. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన బీర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఆ సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ ఏప్రిల్ 24న ఆదేశాలు జారీచేసింది. అయితే.. సర్వే నంబర్లు 194, 195లో తాము చట్టబద్ధంగా భూములను కొనుగోలు చేశామని.. ఏకపక్షంగా తమ వాదన వినకుండా సదరు సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో పెట్టడం చెల్లదని.. ఈ మేరకు సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టేయాలని.. పలువురు ఐపీఎస్‌లు, వారి కుటుంబ సభ్యులు– మహేశ్ భగవత్, సౌమ్యామిశ్రా, స్వాతి లక్రా, రవిగుప్తా, తరుణ్‌జోషి, రేణుగోయల్, బీకే రాహుల్ హెగ్డే, రాహుల్ బుసిరెడ్డి, వీరన్నగారి గౌతమ్‌రెడ్డి, రేఖా షరాఫ్ తదితరులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని డివిజన్ బెంచ్ స్పష్టంచేసింది. దీంతో బీర్ల మల్లేశ్ దాఖలు చేసిన పిటిషన్ మళ్లీ సింగిల్ జడ్జి వద్దకు వచ్చింది. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి ధర్మాసనం ఎదుట ఈడీ దాఖలు చేసిన కౌంటర్ సంచలనంగా మారింది. ఇదే వ్యవహారానికి సంబంధించి అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను సైతం ఈడీ విచారించింది. ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌లో.. సర్వే నంబర్ 181, 182లో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చిన అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్ వాగ్మూలాన్ని సైతం తీసుకున్నట్లు తెలిపింది. పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తే.. ప్రభుత్వ అధికారులు, ఇతరుల పాత్రపై మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేసింది. "సర్వే నంబర్లు 181, 182లో ఉన్న భూములను అసలు యజమాని అయిన నవాబ్ హాజీ అలీఖాన్ కుమారులైన అక్బర్ అలీఖాన్, ఫరూఖ్ అలీఖాన్‌ల నుంచి షేక్ దస్తగిరి షరీఫ్ అనే వ్యక్తి కొనుగోలు చేశారు. నవాబ్ హాజీ అలీఖాన్ కుమార్తె ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునావర్‌ఖాన్‌కు ఎలాంటి టైటిల్ హక్కులు లేకపోయినా.. అక్రమ పత్రాలతో తామే అసలు వారసులమంటూ పాస్‌పుస్తకాలను సంపాదించారు. ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునార్‌ఖాన్ 2021లో మరో 11 సేల్ డీడ్స్‌ను సృష్టించారు. బొబ్బిలి దామోదర్ రెడ్డి, బొబ్బిలి విశ్వనాథ్‌రెడ్డి, ఎన్.సంతోష్‌కుమార్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అక్రమంగా సదరు భూములకు రిజిస్ట్రేషన్లు చేశారు. మొత్తం 40 ఎకరాలను రూ.13.57 కోట్లకు విక్రయించారు. ఈ భూముల కొన్న నలుగురు.. 40 ఎకరాలను ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్స్‌కు నాలుగు సేల్‌డీడ్‌ల ద్వారా రూ.17.50 కోట్లకు అమ్మేశారు. ఈ అక్రమాలపై షేక్ దస్తగిరి షరీఫ్ ఫిర్యాదుతో మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. దాని ఆధారంగా ఈడీ కేసు నమోదైంది. దాంతో అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్ తదితరులను విచారించాం" అని ఈడీ తన కౌంటర్‌లో వివరించింది. ప్రభుత్వ భూములకు సంబంధించిన వ్యవహారం అని తెలిసి కూడా అప్పటి తహసీల్దార్-కం-జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఆర్‌పీ జ్యోతి నేరపూరిత కుట్రలో భాగస్వామిగా తప్పుడు పత్రాలను స్వీకరించడం ద్వారా ప్రభుత్వ భూమిని ప్రైవేటు బిల్డర్స్ పరంచేశారని తెలిపింది. ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునార్‌ఖాన్, ఆర్పీ జ్యోతి, బొబ్బిలి దామోదర్‌రెడ్డి తదితరులు నోటిపై చేసిన ప్రభుత్వ భూమిని విక్రయించి నేరానికి పాల్పడినట్లు వెల్లడించింది. అదేవిధంగా సర్వే నంబర్లు 194, 195లలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పాగావేశారని తెలిపింది. "ఆ సర్వే నంబర్ల గురించి ఎక్కడా ఎఫ్ఆర్ నమోదు కాలేదు. అందుకే మేం ఆ భూములపై దర్యాప్తు చేపట్టలేదు. అయితే సర్వే నంబర్లు 194, 195 గురించి పిటిషనర్ బీర్ల మల్లేశ్ వాంగ్మూలం ఆధారంగా వివరాలను తెలంగాణ డీజీపీకి పంపి.. ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధంగా పరిశీలించాలని కోరాం. అయితే డీజీపీ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మా దర్యాప్తులో కీలక విషయం ఏంటంటే.. సర్వే నంబరు 194లోని భూములను నవాబ్ హాజీఅలీ ఖాన్ నుంచి 1992లో అబ్దుల్ షుకూర్ కుటుంబ సభ్యులు కొనుగోలు చేసినట్లు పత్రాలు ఉన్నప్పటికీ.. అబ్దుల్ షుకూర్ ల్యాండ్ గ్రాబింగ్ చేసినట్లు ఇప్పటికే రెండు ఎఫ్ఆర్‌లు ఉన్నాయి. దీనిప్రకారం 1992లో 194 సర్వే నంబర్‌లో కొనుగోళ్లు మోసపూరితమని గుర్తించాం" అని ఈడీ తన కౌంటర్‌లో తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపితే.. మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడింది.

పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

» పోరుబాట పట్టిన మాజీ సర్పంచులు

పంజాగుట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. అప్పులు చేసి మరీ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, కానీ ప్రభుత్వం ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. శనివారం ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం గేటుకు వినతిపత్రాన్ని ముడుపు కట్టి వినూత్న రీతిలో మాజీ సర్పంచులు నిరసన తెలిపారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సర్పంచుల జేఏసీ నేతలు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే బకాయిలు వెంటనే చెల్లిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి18 నెలలైనా ఒక్క బిల్లు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పుల బాధతో కొంతమంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేస్తే తమకు బిల్లులు చెల్లించకుండా.. బడా కాంట్రాక్టర్లకు మాత్రం ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. రూ.650 కోట్ల మేర పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని, రెండు, మూడు రోజుల్లో తమకు బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో ఇందిరాపార్కు వద్ద దీక్షలు చేపడతామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

ఇజ్రాయెల్ మారణహోమాన్ని ఆపాలి

» వామపక్ష పార్టీల డిమాండ్

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాలస్తీనా ప్రజలపై 20 నెలలుగా దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్ తక్షణమే మారణహోమాన్ని ఆపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడారు. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థుల శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతుందని, ఇప్పటికే 50వేల మంది మరణించారన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల నేతృత్వంలో జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఏఐజీ ఆస్పత్రిలో కేసీఆర్‌కు రెండోరోజూ వైద్య పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మరోసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్న కేసీఆర్.. శనివారం రెండో రోజూ ఆస్పత్రికి వచ్చారు. ఆయనకు ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంటారాలజిస్టు డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పూర్తి రక్త పరీక్షలు (సీబీపీ), ఎండోస్కోపి చేసినట్లు సమాచారం. కేసీఆర్ ఆస్పత్రిలో దాదాపు గంట సమయం వరకు ఉన్నారు. ల్యాబ్ పరీక్షల అనంతరం ఆయన ఏఐజీ నుంచి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఉన్నారు. కేసీఆర్‌కు సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగానే గ్యాస్ట్రో పరీక్షలు చేసినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

తిరుగుబాటు అనే మాట అననేలేదు

» తన మాటలను తప్పుగా రాశారన్న మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

హైదరాబాద్ సిటీ, జూన్14(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించడం ద్వారా సీట్లు తగ్గిస్తే దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా దక్షిణ భారతీయుల్లో పెద్దఎత్తున అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా కూడా ఆలోచించాలని హితవు పలికారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వేదికగా సాగిన జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా సమావేశంలోనూ తాను ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు చెప్పారు. అయితే, పలు పత్రికల్లో... దక్షిణాది ప్రజలు కేంద్రంపై తిరుగుబాటు చేయాలని తాను పిలుపునిచ్చినట్లుగా తప్పుగా వచ్చిందని జస్టిస్ చంద్రకుమార్ వివరణ ఇచ్చారు. తిరుగుబాటు అనే పదమే ఉటంకించలేదని స్పష్టం చేశారు.

సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై ఈనెల 11న కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది దోనేటి భానుచందర్, కాంగ్రెస్ నాయకులు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. కేటీఆర్.. సీఎంను కించపరుస్తూ ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చెబుతూ ఆ ప్రసంగ వీడియోను పోలీసులకు చూపించారు. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలని, కేటీఆర్‌పై బీఎస్ఎస్ యాక్ట్ 356, 352, 353, 296 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఈబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయండి

» మంత్రిత్వ శాఖ, ఫైనాన్స్ కార్పొరేషన్ కూడా..

» సీఎంకు ఈబీసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈబీసీ జాతీయ అధ్యక్షుడు, అగ్ర కుల నిరుపేదల సంఘాల జేఏసీ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎంను ఆయన నివాసంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈబీసీ కమిషన్ ఏర్పాటుతో పాటు ఈబీసీల అభివృద్ధికి మంత్రిత్వ శాఖ, ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలన్నిటినీ అగ్రవర్ణాలలోని నిరుపేదలకు వర్తింపజేయాలని కోరారు. త్వరలో ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారని రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బాలికపై యువకుడి అత్యాచారం

» నిందితుడిపై పోక్సో కేసు నమోదు

» ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో ఘటన

కారేపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని ఓ గ్రామంలో ఆరో తరగతి చదువుతున్న 11ఏళ్ల గిరిజన బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం సాయంత్రం కిరాణా దుకాణానికి వెళ్లిన బాలికను అదే గ్రామంలో వ్యవసాయ కూలీగా పని చేస్తున్న 27 ఏళ్ల యువకుడు భూక్య హరి వెంబడించాడు. మార్గం మధ్యలో ఆమెను బలవంతంగా తన బైకుపై ఎక్కించుకుని గ్రామ సమీపంలోని ఓ పొలం వద్దకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కేకలు వేయడంతో సమీప పొలం వద్ద ఉన్న ఓ రైతు గమనించి ఘటనా స్థలం వద్దకు వెళ్లేలోగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై గోపి తెలిపారు.



శైలజ-రాజేశ్ దంపతుల పెళ్లి ఫొటో (ఫైల్)

వరకట్న వేధింపులకు నవ వధువు బలి

» పెళ్లయిన 3 నెలలకే ఆత్మహత్య

» నిర్మల్ జిల్లాలో విషాదం..

» భర్త, అత్త సహా ఆరుగురిపై కేసు

ఖానాపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌పై ఎన్నో కలలుకంటూ అత్తారింట్లోకి అడుగుపెట్టిన ఓ నవ వధువు పెళ్లయిన మూడు నెలలకే తనువు చాలించింది. అదనపు కట్నం వేధింపులకు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది. ఖానాపూర్ మండలం మస్తాన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన దండగుల శైలజ(20)కి పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అల్లెపు రాజేష్‌తో వివాహం జరిగింది. పెళ్లి అయిన కొద్ది రోజులకే అదనపు కట్నం తీసుకు రావాలంటూ శైలజకు అత్తింటి వారి వేధింపులు మొదలయ్యాయి. ఈ విషయమై ఇటీవల ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. అయితే వేధింపులు రోజురోజుకూ ఎక్కువ కావడంతో.. శనివారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరేసుకుని శైలజ మృతిచెందింది. తమ కూతురి ఆత్మహత్యకు అత్తింటి వేధింపులే కారణమని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శైలజ భర్త, అత్త సహా ఆరుగురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్టు ఖానాపూర్ ఎస్సై రాహుల్ తెలిపారు.

డబ్బా రేకుల్లా ఫర్నిచర్!

వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో నాసిరకం సరుకు

» నాణ్యతలేని కుర్చీలు, టేబుళ్లు, అల్మారాలు

» కొన్నాళ్లకే విరిగిపోయి మూలన

» 25 కాలేజీల కోసం కొనుగోలు

» ఒక్కో కాలేజీకి రూ.10కోట్లు.. నాణ్యత పరిశీలించకుండానే ఓకే చేసిన వైనం

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల కోసం కొనుగోలు చేసిన ఫర్నిచర్ కొన్నాళ్లకే మూలన పడుతోంది. ఏమాత్రం నాణ్యత లేకపోవడంతో ఎక్కడికక్కడ విరిగిపోయి పనికిరాకుండా పోతోంది. గత నాలుగేళ్లలో కొత్తగా ఏర్పాటు చేసిన 25 మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆస్పత్రుల కోసం వైద్య పరికరాలు సహా ఫర్నిచర్‌ను తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ) ద్వారా కొనుగోలు చేశారు. ఒక్కో కళాశాల, అనుబంధ ఆస్పత్రికి ఫర్నిచర్ కోసం రూ.10 కోట్లు వెచ్చించారు. ఫర్నిచర్ అంతా ఐరన్‌తో చేసిందే. ఇందులో ప్రధానంగా విద్యార్థులు, ప్రొఫెసర్ల కోసం కుర్చీలు, బెంచ్‌లు, అల్మారాలు, లాకర్లు, ర్యాక్స్ ఆఫీసు టేబుల్స్ ఉన్నాయి. కొత్త కాలేజీల్లో రెండో ఏడాది తరగతులు ప్రారంభమయ్యాక ఫర్నిచర్ కొన్నారు. తొలుత జైళ్ల శాఖ తయారు చేసిన ఫర్నిచర్‌ను కార్పొరేషన్ కొనాలనుకుంది. అవి నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని అప్పటి వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదులు రావడంతో కొనుగోలును కార్పొరేషన్ నిలిపివేసింది. ఆ తర్వాత ఫర్నిచర్ కొనుగోలు కోసం కార్పొరేషన్ గత ఏడాది చివర్లో టెండర్లు పిలిచింది. ఆ టెండరు నిబంధనల్లో విచిత్రమైన నిబంధనలు పెట్టింది. కుర్చీలు సరఫరా చేయాలంటే సంబంధిత సంస్థ ఆ ఒక్క విభాగంలోనే రూ.కోట్ల టర్నోవర్ ఉండాలని పేర్కొంది. అలా అన్ని రకాల ఫర్నిచర్ సరఫరా చేయాలంటే వందల కోట్ల టర్నోవర్ ఉండటాన్ని తప్పనిసరి చేసింది. ఫలితంగా రాష్ట్రం నుంచి ఒక్క కంపెనీకి కూడా టెండరులో పాల్గొనే అర్హత లేకుండా పోయింది. ఉత్తరాదికి చెందిన ఓ కంపెనీ టెండరు దక్కించుకుంది. ఆ కంపెనీకే టెండరు దక్కేలా నిబంధనలు పెట్టారన్న ఆరోపణలు వ్యక్తమయ్యాయి. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్న ఫర్నిచర్‌నే సరఫరా చేసినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. అయితే అవి ఏమాత్రం నాణ్యతగా లేవనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫర్నిచర్ అంతా కిరోసిన్ డబ్బా రేకుల్లా ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. కనీసం ఆ ఫర్నిచర్ నాణ్యతను తనిఖీలు చేసే వారు కూడా ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ఫర్నిచర్ మెటీరీయల్‌ను కాలేజీల్లో దింపేసి కార్పొరేషన్ అధికారులు చేతులు దులుపుకున్నారని వైద్యవర్గాలు వెల్లడించాయి.

90 కేజీలు ఉండాల్సిన అల్మారా 50 కేజీలే

నిబంధనల ప్రకారం 8 లాకర్లతో కూడిన అల్మారా 90 కిలోల బరువుండాలి. కానీ కార్పొరేషన్ కొనుగోలు చేసి పంపిన అల్మారాలు 50కిలోలే ఉంటున్నట్లు సిబ్బంది వెల్లడించారు. ఆఫీసు టేబుల్స్‌లో ఒక్క డ్రాను లాగితే డ్రా మొత్తం ఊడివస్తోందని చెబుతున్నారు. ఇక లెక్చర్ హాల్‌లో టేబుల్స్, కుర్చీలు సౌకర్యవంతంగా లేవని, కాళ్లకు తగిలి.. గాట్లతో గాయాలయ్యే పరిస్థితి ఉందని మెడికోలు చెబుతున్నారు. ఈ ఫర్నిచర్ పరికరాల నాణ్యతను కార్పొరేషన్ అధికారులు తనిఖీలు చేయడం లేదు. టెండరుకు ముందే ఫర్నిచర్ డెమో చూసి.. ఇండియన్ స్టాండర్డ్స్ స్పెసిఫికేషన్స్ మేరకు ఫర్నిచర్ ఉందా.. లేదా? అన్నది నిర్ధారించుకోవాలి. పరికరాల కొలతలు, మందం, బరువు, ధృఢత్వాలను కార్పొరేషన్ సాంకేతిక బృందం తనిఖీ చేయాలి. ఆ నివేదికను కార్పొరేషన్ ఉన్నతాధికారులకు పంపాలి. అప్పుడే సరఫరాదారులకు బిల్లులు చెల్లించాలి. కానీ ఇక్కడ తనిఖీలు లేకపోవడంతో సరఫరాదారులు నాసిరకం ఫర్నిచర్ పంపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్‌లోనూ కొందరు అధికారులు, సిబ్బంది ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. దీని వెనుక పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.





ఓ వైద్య కళాశాలలో తుప్పుపట్టిన కుర్చీలు, స్ట్రెచర్



పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్

ఆపరేషన్ సిందూర్ ఎయిర్ ఫోర్స్ శక్తికి నిదర్శనం

- యుద్ధరంగంలో వైమానిక దళం ఎల్లప్పుడూ ముందే
- దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో భారత వైమానిక దళాధిపతి అమర్‌ప్రీత్ సింగ్

అల్వాల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళ సామర్థ్యం, పోరాట పటిమ, కార్యాచరణకు ఆపరేషన్ సిందూర్ నిదర్శనంగా నిలిచిందని ఎయిర్ ఫోర్స్ చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత వైమానిక దళం అపారమైన పరాక్రమాన్ని ప్రదర్శించిందన్నారు. శత్రువులపై వేగంగా, కచ్చితత్వంతో, నిర్ణయాత్మక దాడులు చేసి వారిని కోలుకోలేని దెబ్బ తీసిందని చెప్పారు. యుద్ధ రంగంలో ఎయిర్ ఫోర్స్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా 254మంది ఫ్లైట్ కేడెట్లు నిర్వహించిన కవాతును ఆయన తిలకించారు. వారికి ప్రెసిడెంట్ కమిషన్‌తో పాటు వింగ్స్‌ను ప్రదానం చేశారు. పరేడ్ అనంతరం ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ప్రదర్శించిన స్కై డైవింగ్, సుఖోయ్-30, ఆకాశ్, సూర్య కిరణ్, పిలాటస్ పీసీ-7 ఎయిర్‌క్రాఫ్ట్‌ల విన్యాసాలు అబ్బురపరిచాయి. వాయుసేనకు చెందిన ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

స్ఫూర్తిదాయకంగా సుప్రీంకోర్టు తీర్పులు

- హైకోర్టు న్యాయమూర్తుల ప్రశంస



మార్వాడీ శిక్షా సమితి (ఎంఎస్‌ఎస్) లా కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక చరిత్రాత్మక తీర్పులు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు పేర్కొన్నారు. 75 ఏళ్ల చరిత్రలో సుప్రీంకోర్టు నిర్దేశించిన న్యాయసూత్రాలు, కీలక తీర్పులు దేశంలోని న్యాయవ్యవస్థకు మార్గదర్శనం చేస్తున్నాయని తెలిపారు. మార్వాడీ శిక్షా సమితి (ఎంఎస్‌ఎస్) లా కాలేజీ ఆధ్వర్యంలో '75 ఏళ్ల సుప్రీంకోర్టు ప్రస్థానం'పై ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి సహకారంతో సెమినార్ జరిగింది. శనివారం బేగంపేట ప్లాజా హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి. మాధవీదేవి, జస్టిస్ నందా, జస్టిస్ రాధారాణి, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు. న్యాయవ్యవస్థకు సంబంధించిన పలు అంశాలపై వారు ప్రసంగించారు. ప్రాథమిక హక్కుల సంరక్షణలో సుప్రీంకోర్టు పాత్రను జస్టిస్ రాధారాణి వివరించారు. మహిళల హక్కులకు భంగం కలగకుండా సర్వోన్నత న్యాయస్థానం తీసుకుంటున్న చర్యలపై జస్టిస్ మాధవీదేవి ప్రసంగించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన పలు కీలక తీర్పుల ప్రభావాన్ని ఇతర న్యాయమూర్తులు వివరించారు. ప్రాథమిక హక్కుల సంరక్షణలో సుప్రీంకోర్టు పాత్రను జస్టిస్ రాధారాణి వివరించారు. మహిళల హక్కులకు భంగం కలగకుండా సర్వోన్నత న్యాయస్థానం తీసుకుంటున్న చర్యలపై జస్టిస్ మాధవీ దేవి ప్రసంగించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన పలు కీలక తీర్పుల ప్రభావాన్ని ఇతర న్యాయమూర్తులు వివరించారు.

జవాన్ కుటుంబానికి రూ.25 లక్షల సాయం

- మాట నిలుపుకొన్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్

హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన అగ్నివీర్ సైనికుడు మురళీనాయక్ కుటుంబానికి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీనాయక్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని కశ్మీర్‌లో మే 9న వీరమరణం పొందారు. 11న అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్ కల్యాణ్.. ఆ కుటుంబానికి రూ.25 లక్షల సాయం ప్ర కటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును జనసేన తిరుపతి, పాలకొండ ఎమ్మెల్యేలు అరణి శ్రీనివాసులు, జయకృష్ణ శనివారం జవాన్ కుటుంబానికి అందజేశారు.

తిరుమల కిటకిట.. సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్కూళ్లు ప్రారంభమైనా తిరుమలలో రద్దీ తగ్గలేదు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు శనివారం భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శ్రీవారిసేవా సదన్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర క్యూలైన్ ఉంది. దీంతో సర్వ దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. నడకమార్గాలు కూడా కిటకిటలాడుతున్నాయి. అలిపిరి పాదాల మండపం కూడా భక్తులతో రద్దీగా కనిపించింది.

లోక్‌అదాలత్‌లో 12 లక్షల కేసులు పరిష్కారం

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 12.48 లక్షల కేసులు పరిష్కారం అయ్యాయని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి తెలిపారు. ఇందులో 4.63 లక్షల కేసులు ప్రీ లిటిగేషన్ కేసులని, 7.85 లక్షల కేసులు పెండింగ్ కేసులని చెప్పారు. మొత్తం కేసుల్లో రూ.935 కోట్లు ఆయా లబ్ధిదారులకు పరిహారంగా అందజేశామన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి: డీటీఎఫ్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన సప్లిమెంటరీ బిల్లులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ జరిగిన డీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2024 ఏప్రిల్ నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇప్పటివరకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందలేదని తెలిపారు. బిల్లుల చెల్లింపునకు ప్రతి నెలా రూ.700 కోట్లు కేటాయిస్తామని చెప్పినా.. ప్రభుత్వం నయా పైసా విడుదల చేయలేదన్నారు. పీఆర్సీ మాట ఎత్తడం లేదని, 33 జిల్లాల్లో 12 జిల్లాలకే డీఈవోలు ఉన్నారని, ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు అసంబద్ధంగా, అన్యాయంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ ఉత్తర్వులను సవరించి, వెంటనే సప్లిమెంటరీ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రధాని పదవి నుంచి మోదీ దిగిపోవాలి

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ఇండియా విమాన ప్రమాద నేపథ్యంలో ప్రధాని మోదీ రాజకీయాలకు రిటైర్‌మెంట్ ప్రకటించి పదవి నుంచి దిగిపోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. ప్రధాని బాధ్యతలను అమిత్ షాకు అప్పగించాలన్నారు. శనివారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు పదవికి రాజీనామా చేయాలని, ఆయనకు విమానాయన రంగంలో అనుభవం లేదని చెప్పారు. కేంద్ర మంత్రితో వ్యక్తిగత గొడవలేమీ లేవని, దేశ ప్రతిష్ఠను దృష్టిలో ఉంచుకుని తప్పు చేసిన వారికి శిక్ష విధించాల్సిందేనన్నారు.



రక్తదాతలు.. సేవాతత్పరులు: గవర్నర్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానాన్ని మానవత్వంతో నిరంతర సేవగా కొనసాగించడం గొప్ప విషయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దాతలను అభినందించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్ కమ్యూనిటీ హాలులో రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గవర్నర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానాన్ని ప్రోత్సహించే విధంగా ఎప్పటికప్పుడు శిబిరాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలను కొనియాడారు.

ఏ సీటు సురక్షితం!

- విమానయాన నిపుణుల్లో చర్చ
- 11ఏ ప్రాణాలతో బయటపడటం అద్భుతమేనని వ్యాఖ్య

అహ్మదాబాద్, జూన్ 14: గుజరాత్ విమాన ప్రమాదంలో 11ఏ సీటు ప్రయాణికుడొక్కరే ప్రాణాలతో బయటపడటంతో విమాన ప్రయాణాల్లో ఏ సీటు సురక్షితమనే చర్చ నిపుణుల్లో మొదలైంది. విమానాల్లో ఇంకా ఏమైనా సురక్షితమైన సీట్లు ఉన్నాయా అని చర్చిస్తున్నారు. భారత సంతతికి చెందిన బ్రిటిష్ పౌరుడు విశ్వాస్ కుమార్ రమేశ్ ఒక్కరే ఈ ప్రమాదం నుంచి సజీవంగా బయటపడిన విషయం తెలిసిందే. ఆయన కూర్చున్న 11ఏ సీటు అత్యవసర ద్వారానికి దగ్గరగా ఉంది. 'స్టాటిస్టికల్‌గా విమానాల్లో సురక్షితమైన సీట్లు కొన్ని ఉన్నాయి. మధ్యలో ఉన్న సీట్ల కంటే చివరి సీట్లు, కుడివైపు ముందు వరస సీట్లు సురక్షితమని చాలా ఏళ్లగా జరుగుతున్న విమాన ప్రమాదాల్లో తేలింది. అయితే, తాజా విమాన ప్రమాదంలో అందుకు పూర్తి భిన్నంగా జరిగింది. 11ఏ సీటు విమానం మధ్యలో రెక్కకు ముందువైపు ఉంది. ఈ సీటులోని ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడటం అద్భుతమే' అని విమానయాన నిపుణుడు అంగద్ సింగ్ చెప్పారు. కాగా, రమేశ్ కూర్చున్న 11ఏ సీటు బిజినెస్ క్యాబిన్‌కు వెనుకగా ఎకానమీ క్లాస్ మొదటి వరుసలో అత్యవసర ద్వారానికి దగ్గరగా ఉంది. విమానం కూలిపోగానే 11ఏ సీటుతోసహా ఎడమవైపు ముందుభాగం విరిగిపడగా, విమాన ప్రధాన భాగంలోని ఉన్నత శ్రేణి భాగాలన్నీ తీవ్రంగా ధ్వంసమయ్యాయి. అయితే తాను ఎడమవైపు ఉండటంతో బయటికి రాగలిగానని రమేశ్ పేర్కొన్న విషయం తెలిసిందే.


విమానాల్లో సీట్ల కాన్ఫిగరేషన్లు వేర్వేరుగా ఉంటాయని, ప్రమాదాల్లో బయటపడటం విభిన్న అంశాలపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

దేవాదాయశాఖలో డిప్యూటేషన్ల దుమారం!

ఈవోల నుంచి డిప్యూటీ కమిషనర్ల వరకు.. ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్లతో భర్తీకి నిర్ణయం

- ఆయా విభాగాలకు లేఖ రాసిన దేవాదాయ శాఖ
- ఇది సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమంటున్న అధికారులు
- ఉపసంహరించుకోకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిక
- సొంతశాఖలో పదోన్నతులతో భర్తీ చేయాలని డిమాండ్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలోకి ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి డిప్యూటేషన్లు చేపట్టాలన్న నిర్ణయం దుమారం రేపుతోంది. ఇప్పటికే రెవెన్యూ విభాగం నుంచి కొందరు అధికారులను డిప్యూటేషన్ పై తీసుకురావడాన్ని తప్పుపడుతున్న దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది.. తాజాగా మరికొందరు అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకోవాలని నిర్ణయించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రయత్నాలను వెంటనే నిలిపేయాలని, దేవాదాయ శాఖలోనే పదోన్నతులతో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



GOVERNMENT OF TELANGANA
ENDOWMENTS DEPARTMENT

From
S.Venkata Rao, I.A.S.,
Director,
Endowments Department,
Boggulakunta, Tilak Road,
Telangana, Hyderabad.

To
The Commissioner & Director,
Municipal Administration,
Telangana

Letter No.A2/4401/2025-7, Dated: 09-06-2025.

Sir/Madam,

Sub:- ENDOWMENTS DEPARTMENT – Gazetted – Establishment – Request for deputation of Eligible Officials to the Endowments Department to work as Executive Officers against Vacant Posts - Regarding.

Ref:- Govt. Memo No.10121/Endts.1/2025, dt: 06.06.2025.

సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమంటూ ఆగ్రహం

ఈవో నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయి పోస్టుల్లోకి.. పట్టణ పరిపాలనతోపాటు ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకోవాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన అధికారులను పంపాలంటూ దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకటరావు రెండు రోజుల క్రితం ఆయా విభాగాలకు లేఖలు రాశారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఈవో గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టులకు సంబంధించి దేవాదాయశాఖ చెల్లిస్తున్న వేతనాలకు సమాన వేతనం పొందుతున్న, ఈ పోస్టులకు అర్హులైన అధికారులను డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు పంపించాలని కోరారు. ఖాళీలు భర్తీ అయ్యాక వారిని తిరిగి సొంత విభాగానికి పంపిస్తామని తెలిపారు. అయితే దీనిపై దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది మండిపడుతున్నారు. ఇతర విభాగాల నుంచి సిబ్బందిని దేవాదాయ శాఖలోకి డిప్యూటేషన్‌పై తీసుకోవద్దని సర్వీస్ రూల్స్‌లో స్పష్టంగా ఉందని చెబుతున్నారు. ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్ల ఆలోచనను విరమించుకోవాలని, లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు.

పదోన్నతులిస్తే సమస్య పరిష్కారం

దేవాదాయ శాఖలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. అర్హులు ఉన్నా కూడా ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించకపోవడంతో ఖాళీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉద్యోగుల సీనియారిటీని తేల్చి పదోన్నతులు కల్పించాలని హైకోర్టు సుమారు ఏడాదిన్నర క్రితం ఓ కేసు విచారణ సమయంలో ఆదేశించింది కూడా. అయినా ఆ ప్రక్రియను దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటివరకు చేపట్టలేదు. దేవాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్ పోస్టులు ఏడు ఉంటే.. ఇద్దరు రెగ్యులర్, ముగ్గురు తాత్కాలిక (అడ్‌హాక్) పద్ధతిలో కొనసాగుతున్నారు. మిగత రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ కమిషనర్ స్థాయిలో 28 పోస్టులకుగాను 14 ఖాళీగా ఉన్నాయి. ఈ నెలాఖరున మరో ఇద్దరు పదవీ విరమణ చేయనున్నారు. ఇక గ్రేడ్-1, గ్రేడ్-2 ఈవోల పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. సొంత శాఖలో ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించకుండా.. పోస్టులు ఖాళీగా ఉన్నాయంటూ ఇతర శాఖల నుంచి అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకురావడం ఏమిటని దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. కేవలం కొందరికి మేలు చేసేందుకే సీనియారిటీ జాబితాను తేల్చడం లేదని.. దీనితో అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి, పదోన్నతులు చేపడితే సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారు.

రేపటి వరకు జైల్లోనే కొమ్మినేని

- వరుస సెలవులతో బెయిల్ జాప్యం



గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో జైల్లో ఉన్న నిందితుడు(ఏ2), సాక్షి చానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు బెయిల్‌పై బయటకు వచ్చేందుకు వరుస సెలవులు అడ్డంకిగా మారాయి. దీంతో సోమవారం వరకు ఆయన జైల్లోనే ఉండాల్సి ఉంటుందని ఆయన తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ నెల 6న సాక్షి చానల్ డిబేట్‌లో రాజధాని ప్రాంత మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఎనలిస్టు కృష్ణంరాజును ప్రధాన నిందితుడిగా, ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా ప్రోత్సహించినట్లుగా మాట్లాడిన కొమ్మినేనిని ఏ2గా, సాక్షి యాజమాన్యాన్ని ఏ3గా పేర్కొంటూ తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడైన కొమ్మినేనిని ఈ నెల 9న పోలీసులు హైదరాబాదులో అరెస్టు చేసి 10న మంగళగిరి కోర్టులో హాజరు పరచగా ఆయనకు మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో ఆయనను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అయితే, ఆయన దీనిపై హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా అది విచారణలో ఉన్న సమయంలోనే.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బెయిల్ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. ట్రయల్ కోర్టు విధించే షరతులకు లోబడి బెయిల్ ఇస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అయితే, సుప్రీంకోర్టు ఉత్తర్వులు శుక్రవారం సాయంత్రం వరకు రాకపోవడంతో కొమ్మినేని విడుదలపై జాప్యం నెలకొంది. మరుసటి రోజు రెండవ శనివారం సెలవు అయినప్పటికీ మెజిస్ట్రేట్‌ను ఇంటి వద్ద కలసి బెయిల్ ఆదేశాలు తీసుకోవాలని ఆయన తరఫు న్యాయవాదులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో సోమవారం న్యాయవాదులు ట్రయల్ కోర్టులో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కొమ్మినేని బెయిల్ ఉత్తర్వులు పొందనున్నారు. దీంతో సోమవారం సాయంత్రానికి గాని కొమ్మినేని బయటకు వచ్చే అవకాశం ఉండదని న్యాయవాదులు తెలిపారు. ఇదిలావుంటే, ఈ కేసులో ప్రధాన నిందితుడైన(ఏ1) కృష్ణంరాజు ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కొమ్మినేనికి వైసీపీకి చెందిన లీగల్ సెల్ న్యాయవాదులు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారు. అయితే, కృష్ణంరాజు మాత్రం సొంతగా న్యాయవాదిని పెట్టుకున్నట్లు తెలిసింది.

ఏసీబీ నోటీసులతో హడలిపోతున్న కేటీఆర్

- జైలుకు వెళ్లాలన్న ఆయన కోరికను దర్యాప్తు సంస్థలే తీర్చుతాయి: ఆది శ్రీనివాస్
- కేటీఆర్‌కు ఇంగ్లిష్ ఫుల్.. సబ్జెక్టు నిల్: చామల
- జైల్లో ఉండొచ్చిన కవిత కూడా ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్నారు: మేడిపల్లి

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-రేస్ కేసులో ఏసీబీ నోటీసులతో కేటీఆర్ హడలిపోతున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. విచారణకు వెళ్తానంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ బడాయి కబుర్లు చెబుతున్నాడని ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. లైడిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. 'ఎవరి మీద కేసులుంటే వాళ్లు విచారణకు హాజరవుతారు తప్పా ఇంకొకరు వచ్చి లైడిటెక్టర్, నార్కో ఎనాలసిస్ టెస్టులు చేసుకోరు. మీ కుటుంబానికి అంత ధైర్యముంటే నీతోపాటు మీ అయ్య, చెల్లెలు, బావకు నార్కో టెస్టులు చేయించు. మీ కమీషన్ల కక్కుర్తి, స్కాముల బాగోతం బయటపడుతుంది. చాలెంజ్‌లు విసిరి పారిపోయిన చరిత్ర నీదే.. గతంలో డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో వైట్ చాలెంజ్‌కు రావాలని పిలిస్తే పారిపోలేదా? సంక్షేమం, అభివృద్ధితో మా ప్రభుత్వం ముందుకుపోతుంటే కేటీఆర్ పిచ్చి ప్రేలాపనలు, రోత మాటలు మాట్లాడుతున్నాడు. జైలుకు వెళ్లాలన్న ఆయన ఉబలాటాన్ని, కోరికను దర్యాప్తు సంస్థలే తీర్చుతాయి. కేటీఆర్ మాటలను కాంగ్రెస్ శ్రేణులు మాత్రం సహించరు' అని హెచ్చరించారు. కేటీఆర్‌కు ఇంగ్లిష్ ఫుల్, సబ్జెక్ట్ నిల్ అంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఓవర్ యాక్షన్‌తోనే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. ఫార్ములా ఈ-రేస్‌లో పాలనా అనుమతులు లేకుండా రూ.44 కోట్లు ఎలా మళ్లించారని ఏసీబి ప్రశ్నిస్తోందన్నారు. అవకతవకలు, అక్రమాలు జరిగినపుడు ఆయా ఏజెన్సీలు విచారణ చేయడం తప్పా? అని ప్రశ్నించారు. మొన్న కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయన్న కవిత ఈ రోజు మా వర్కింగ్ ప్రెసిడెంట్‌కు నోటీసులెలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లపై కవిత ఆరోపణలు, విమర్శలన్నీ డ్రామాయేనని స్పష్టమవుతోందని చెప్పారు. మద్యం కుంభకోణంలో దొరికిపోయి ఆరు నెలల పాటు తిహాడ్ జైలులో ఉండొచ్చిన కవిత సైతం తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దుయ్యబట్టారు. సీఎంపై చేసిన వ్యాఖ్యలను ఆమె తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసలు కవిత ఏ పార్టీలో ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌లో ఉంటే ఆ దయ్యాలెవరో, కోవర్టులెవరో తేల్చుకోవాలని.. ఆ తర్వాత తమ ప్రభుత్వం గురించి మాట్లాడాలని చెప్పారు. 'మీ అయ్య స్కూల్ కాంగ్రెస్‌లో, కాలేజీ టీడీపీలో చదివి.. బీఆర్‌ఎస్‌లో ఉద్యోగం సరిగా చేయక, అక్రమాలకు పాల్పడి ప్రజల చేత డిస్మిస్ అయ్యాడు. ప్రతిపక్ష నాయకుడిగా సైతం గుండు సున్నా మార్కులు తెచ్చుకుని విఫల రాజకీయ నాయకుడిగా మారాడు. ముందు బీఆర్‌ఎస్‌లో నీ స్థానమేంటో తేల్చుకో..' అని వ్యాఖ్యానించారు.

త్వరలో హౌసింగ్ బోర్డు స్థలాల అమ్మకం

చింతల్, గచ్చిబౌలి, నిజాంపేటలో అమ్మకానికి 22 స్థలాలు.. ఈ నెల 23న బహిరంగ వేలం

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లో ప్రభుత్వ స్థలాలు, ప్లాట్ల వేలానికి రంగం సిద్ధమైంది. ఇటీవలే రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ప్లాట్ల వేలం చేపట్టగా రికార్డు స్థాయిలో ధర పలికింది. ఇదే జోష్‌లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల రాష్ట్ర హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలాలను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలైంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని బాచుపల్లి మండలం నిజాంపేట, కుత్బుల్లాపూర్ మండలం చింతల్‌లోని స్థలాలను విక్రయించాలని నిర్ణయించారు. ఈ నెల 23న బహిరంగ వేలం ద్వారా మొత్తం 22 స్థలాలను విక్రయించనున్నారు. రెండు రోజుల క్రితం కూకట్‌పల్లిలోని హౌసింగ్ బోర్డు కాలనీ ఫేజ్-7లో ఖాళీగా ఉన్న 18 స్థలాలను విక్రయించగా హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఓ ప్లాట్ చదరపు గజం ధర అత్యధికంగా రూ.2.98 లక్షలు పలకడం గమనార్హం. అన్నీ ప్లాట్లు కలిపి సగటున చదరపు గజానికి రూ.2.38 లక్షలు పలకడం విశేషం.

చింతల్, గచ్చిబౌలి నిజాంపేటలో 22 స్థలాలు

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని స్థలాల విక్రయానికి భారీ స్పందన రాగా.. అదే దూకుడుతో పలు ప్రాంతాల్లో 22 స్థలాలను విక్రయించాలని నిర్ణయించారు. కుత్బుల్లాపూర్ మండలం చింతల్‌లో 266 చదరపు గజాలున్న 9 ప్లాట్లను విక్రయానికి పెట్టారు. ఈ స్థలాలను కొనాలనుకునేవారు రూ.5 లక్షల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే 3,388 చదరపు గజాల పాఠశాలను కూడా విక్రయానికి పెట్టగా.. కొనాలనుకునేవారు రూ.10 లక్షల ధరావత్తు చెల్లించాలి. చింతల్‌లోని ఈ ప్లాట్లకు చదరపు గజం అప్‌సెట్ ధరను హౌసింగ్ బోర్డు అధికారులే రూ.80 వేలుగా నిర్ణయించడం విశేషం.

- గచ్చిబౌలిలో నాలుగు స్థలాలను విక్రయానికి పెట్టగా.. అందులో 1,206 చదరపు గజాల పాఠశాల స్థలానికి చదరపు గజానికి అప్‌సెట్ ధర రూ.80 వేలు నిర్ణయించగా.. 1,487 చదరపు గజాల కమర్షియల్ స్థలానికి అప్‌సెట్ ధరను రూ.1.20 లక్షలుగా నిర్ణయించారు. ఆయా ప్లాట్లను కొనాలనుకునేవారు రూ.10 లక్షల ధరావత్తు చెల్లించాలి. 315, 263 చదరపు గజాలు కలిగిన రెండు ప్లాట్లకు చదరపు గజం అప్‌సెట్ ధరను రూ.50వేలు నిర్ణయించగా.. కొనుగోలు చేయాలనుకునేవారు 5 లక్షల ధరావత్తు చెల్లించాలి.
- బాచుపల్లి మండలం నిజాంపేటలో 413 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన 8 ప్లాట్లను అమ్మకానికి పెట్టగా.. ఆయా ప్లాట్లను కొనాలనుకునేవారు రూ.2లక్షల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్లాట్లను కొనుగోలు చేయాలన్న ఆసక్తి ఉన్న వారు వేలం జరిగే 23వ తేదీన ఉదయం 11 గంటల్లోపు డీడీ రూపంలో ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్లాట్ల వేలాన్ని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్ ఫేజ్-1, ఫేజ్-2లలో నిర్వహించనున్నారు.

ఈఎన్‌సీ అనిల్‌కు 'నూనె' సెగ!

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఈఈ నూనె శ్రీధర్
- గతంలో ఆయన బదిలీని అడ్డుకున్న ఈఎన్‌సీ అనిల్ కుమార్
- ఏసీబీ విచారణలో వెలుగులోకి

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవల అరెస్టయిన నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) నూనె శ్రీధర్ వ్యవహారం ఆ శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌కు చుట్టుకునేలా ఉంది. గతంలో ఈఈ శ్రీధర్ బదిలీని ఈఎన్‌సీ అనిల్ కుమార్ అడ్డుకున్నారనే విషయం ఏసీబీ విచారణలో వెలుగులోకి రావడమే ఇందుకు కారణం. ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమవ్వగా.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకు అనిల్ కుమార్ వివరణ ఇచ్చినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న విచారణను ప్రభావితం చేసేలా నూనె శ్రీధర్ వ్యవహరిస్తున్నారని గుర్తించిన ప్రభుత్వం 2024 జూన్ 27న ఆయన్ను బదిలీ చేసి ఈఎన్‌సీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. అయితే, నూనె శ్రీధర్ చొప్పదండిలోనే కొనసాగేలా ఈఎన్‌సీ అనిల్‌కుమార్ ఆ ఉత్తర్వులను అడ్డుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులను పట్టించుకోకుండా బదిలీ ఆపడం ద్వారా అనిల్‌కుమార్.. శ్రీధర్‌కు మేలు చేశారని ఏసీబీ భావిస్తోంది. దీంతో అనిల్ కుమార్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను కలిసిన ఈఎన్‌సీ అనిల్‌కుమార్.. ఈఈ శ్రీధర్ బదిలీని అడ్డుకోవడంలో తనకు ఎలాంటి దురుద్దేశాలు లేవని వారికి వివరణ ఇచ్చుకున్నట్టు తెలిసింది. కాళేశ్వరం విచారణ నేపథ్యంలో కమిషన్/విజిలెన్స్ అడిగే కీలక పత్రాలు, వివరాలను అక్కడ పనిచేసిన వారైతే త్వరగా ఇవ్వగలరన్న ఉద్దేశంతోనే శ్రీధర్ బదిలీని అడ్డుకుని విధుల్లో కొనసాగించామని చెప్పినట్టు సమాచారం. అంతేకాక, కాళేశ్వరం విచారణ నేపథ్యంలో ప్రాజెక్టుతో ముడిపడిన పోస్టుల్లో చేరేందుకు ఎవ్వరూ సిద్ధంగా లేకపోవడం వల్ల కూడా శ్రీధర్‌ను కొనసాగించినట్టు వివరించారు. ఇక ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టుకు నీటిని తరలించడానికి ఉద్దేశించిన నందిమేడారం, గాయత్రి పంపుల నిర్వహణ శ్రీధర్ చేతిలో ఉందని, పంపింగ్‌పై అవగాహన ఉన్నవారే ఆ పోస్టుల్లో ఉండాలనే ఉద్దేశం మాత్రమే ఉందని తెలిపారు. అంతేకాక, నూనె శ్రీధర్ బదిలీని నిలుపుదల చేయించిన రోజు నుంచి ఇప్పటిదాకా ఆ ప్రాంతంలో (శ్రీధర్ ఈఈగా ఉన్న ప్రాంతంలో) ఎలాంటి పనులు జరగలేదని వివరించినట్టు తెలిసింది. మరోపక్క, ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న నూనె శ్రీధర్‌ను ఐదు రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రూ.100 కోట్ల మేర అక్రమాస్తులు కూడబెట్టిన శ్రీధర్‌కు చెందిన బ్యాంకు లాకర్లు తెరిపించేందుకు, బినామీల అంశంలో ఆయన్ను ప్రశ్నించేందుకు కస్టడీ పిటిషన్ దాఖలు చేశామని ఏసీబీ ఉన్నతాధికారులు తెలిపారు.

రాష్ట్రపతి చొరవతో బెంగాల్ వాసికి విముక్తి

- సొంతూరికెళ్లనున్న కోప్నా ముర్ము



కోప్నా ముర్ము

ఆమనగల్లు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక డెయిరీ ఫామ్ యజమాని బెంగాల్ వాసితో బలవంతంగా పని చేయించుకుంటున్న ఘటన వెలుగు చూసింది. మాడ్గుల మండలం జయరామ్ తండా (దుబ్బ తండా) వాసి నిర్వహిస్తున్న డెయిరీ ఫామ్‌లో నాలుగేళ్లుగా పశ్చిమ బెంగాల్ వాసి కోప్నా ముర్ము పనిచేస్తున్నాడు. అతడికి సంజయ్ నాయక్ భోజనంతోపాటు వసతి కల్పించాడు. కొంతకాలంగా అతడు కనిపించడం లేదని, హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిసిందని ముర్ము కుటుంబ సభ్యులు రాష్ట్రపతి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించాలన్న రాష్ట్రపతి కార్యాలయం ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి విచారించగా సదరు వ్యక్తి.. మాడ్గుల సమీపంలో పనిచేస్తున్నట్లు తేలింది. కలెక్టర్ ఆదేశాలతో అక్కడికి వెళ్లిన కార్మిక, రెవెన్యూ శాఖల, పోలీసు అధికారులు కోప్నా ముర్మును మాడ్గుల పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి ఆయన వీడియో స్టేట్‌మెంట్ రికార్డు చేసి, వివరాలు సేకరించారు. తానెవ్వరికి ఫిర్యాదు చేయలేదని, తనకు రావాల్సిన రూ.5,000 ఇస్తే, సొంతూరికి వెళ్లిపోతానని అధికారుల విచారణలో ముర్ము చెప్పాడు. అధికారుల ఆదేశాల మేరకు ముర్ముకు సంజయ్ నాయక్ రూ.5,000 ఇచ్చి, రైలులో సొంతూరు పంపేందుకు ఏర్పాట్లు చేశాడని మాడ్గుల ఎమ్మార్వో వినయ్ సాగర్, సీఐ వేణుగోపాల్ తెలిపారు. శనివారం రాత్రి ముర్ము సికింద్రాబాద్ నుంచి సొంతూరుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

ఇరాన్‌లో భారీ విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

ఎగిసిపడుతున్నాయని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ తస్నీమ్ న్యూస్ పేర్కొంది. ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ ఇంటికి సమీపంలోనూ క్షిపణులు పడ్డాయని వెల్లడించింది. ఐక్య రాజ్య సమితి(ఐరాస) అణు విభాగం చీఫ్ రాఫెల్ గ్రోసీ కూడా ఓ ప్రకటన ద్వారా ఇరాన్‌లోని నటాంజ్(షాహిద్ అహ్మదీ రోషన్) అణు కేంద్రం ధ్వంసమైనట్లు నిర్ధారించారు. ఇరాన్ మొత్తం తమ టార్గెట్‌లో ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించగా.. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో 9 మంది కీలక సైంటిస్టులు, 16 మంది మిలటరీ జనరళ్లను హతమార్చినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వెల్లడించింది. వీరిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ముఖ్య సలహాదారు షంఖానీ, చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆఫ్ ఇరానియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మహమ్మద్ బఘేరీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ చీఫ్ గులామ్ అలీ రషీద్, ఇంటెలిజెన్స్ చీఫ్ గులామ్-అల్-మర్హాబ్, ఇస్లామిక్ రివొల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) కమాండర్ హుస్సేన్ సలామీ, ఐఆర్‌జీసీ ఎయిర్ కమాండర్ అమీర్ అలీ హాజీజాదే,డ్రోన్ల విభాగం కమాండర్ తాహెర్ పుర్, ఎయిర్ డిఫెన్స్ కమాండర్ దావూద్ షిహ్యాన్, క్షిపణి విభాగం కమాండర్ మహమ్మద్ బఘేరీ ఉన్నారు. దీంతో ఇరాన్ త్రివిధ దళాలు పెద్దదిక్కులను కోల్పోయినట్లయింది. ఆర్మీ కమాండర్ అమీర్ మౌసావీ, ఐఆర్‌జీసీ గ్రౌండ్ ఫోర్సెస్ కమాండర్ మహమ్మద్ పాక్‌పౌర్, ఖుద్స్ ఫోర్స్ కమాండర్ ఇస్మాయిల్ ఖ్వానీ, ఐఆర్‌జీసీ నేవీ కమాండర్ అలీరెజా తంగ్సిరి మాత్రమే ఇరాన్ సెక్యూరిటీ చైన్‌లో సజీవ కమాండర్లుగా ఉన్నట్లు తెలిపింది. శనివారం సాయంత్రం నెతన్యాహు మాట్లాడుతూ.. మరో 90 నిమిషాల్లో ఇరాన్‌కు పెద్ద దెబ్బ తగులుతుందని ప్రకటించారు. ఆయన ప్రకటన వెలువడిన 90వ నిమిషం నుంచి ఇజ్రాయెల్ వైమానిక దళం క్షిపణులతో ఇరాన్‌పై విరుచుకుపడడం గమనార్హం.! 150 టార్గెట్లను ఛేదించామని పేర్కొంటూ.. అందుకు సంబంధించిన ఫుటేజీని ఐడీఎఫ్ తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో విడుదల చేసింది. శుక్ర, శనివారాల్లో జరిపిన దాడుల్లో చనిపోయిన ఇరాన్ శాస్త్రవేత్తల వివరాలను ప్రకటించింది. ఆ జాబితాలో న్యూక్లియర్ ఇంజనీరింగ్ నిపుణులు ఫ్రెదోన్ అబ్బాసీ, అహ్మద్ రజా దరియానీ, ఫిజిక్స్ నిపుణులు మహమ్మద్ మెహ్దీ తెహ్రాన్చీ, అమీర్ హసన్ ఫఖీ, అబ్దుల్లామిద్ మినుషర్, మన్సూర్ అస్గరీ, మెకానిక్స్ నిపుణుడు అలీ బౌఖాయ్ ఖత్రిమీ, కెమికల్ ఇంజనీరింగ్ నిపుణుడు అక్బర్ మతాలిజాదా, మెటీరియల్స్ ఇంజనీరింగ్ నిపుణుడు సయీద్ బార్జీ ఉన్నట్లు తెలిపింది. ఇరాన్ మీడియా కూడా ఇజ్రాయెల్ దాడుల్లో 78 మంది మరణించారని, 320 మంది గాయపడ్డారని పేర్కొంది.



రిషోన్‌యెజిలోన్‌లో శిథిలాల నుంచి వెలికితీసిన పసిపాపను ఆసుపత్రికి తరలిస్తున్న మహిళా అధికారి



టెల్ అవీవ్‌లో ఇరాన్ దాడి

ప్రముఖుల పలాయనం?

ఇజ్రాయెల్ ముప్పేట దాడులతో ఇరాన్‌లోని ప్రముఖులు రష్యాకు పారిపోతున్నట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా స్పష్టం చేస్తోంది. సుప్రీం లీడర్ ఖమేనీ ఇంటి సమీపంలోనూ క్షిపణి దాడులు జరగడం.. ఆయన ముఖ్య సలహాదారు సహా, ఆర్మీ అధికారులు చనిపోవడంతో వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ జెట్లు పెద్ద సంఖ్యలో రష్యాకు చేరుకుంటున్నట్లు ఇజ్రాయెల్ వార్తాసంస్థ 'వైనెట్' ఓ కథనాన్ని ప్రచురించింది. ఇందులో ఓ విమానం ట్రాకింగ్ మధ్యలో కనుమరుగైందని, అందులో ఖమేనీలాంటి ప్రముఖ వ్యక్తి ఉండి ఉంటాడని పేర్కొంది. రష్యా-ఇరాన్ ద్వంద్వ పౌరసత్వం ఉన్న ప్రముఖులు కూడా ప్రైవేట్ జెట్లలో దేశాన్ని వీడుతున్నట్లు స్పష్టం చేసింది. మరోవైపు, ఇజ్రాయెల్ దాడుల పట్ల ఇరాన్‌లోనే పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ప్రతీ 47 ఏళ్లకు ఇరాన్‌కు స్వాతంత్ర్యం వస్తుందనుకుంటా. ఇప్పుడు కూడా సుప్రీంలీడర్ పాలన నుంచి విముక్తి దొరుకుతుందని భావిస్తున్నా" అంటూ ఓయువతి పేర్కొంది.

ఎస్‌సీవో ప్రకటనకు భారత్ దూరం

ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) తీవ్రంగా ఖండించింది. అయితే.. ఎస్‌సీవో ప్రకటనకు భారత్ దూరంగా ఉన్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ(ఎంఈఏ) స్పష్టం చేసింది. ఈ అంశంపై ఎస్‌ఈఏ ఏర్పాటు చేసిన సమావేశంలోనూ భారత్ పాల్గొనలేదని వివరించింది. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తాము ఇరు దేశాలను కోరుతున్నట్లు తెలిపింది. కాగా.. పాలస్తీనాలో నివసించే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం హెచ్చరించింది. వీలైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని, బయట తిరగొద్దని సూచించింది.

ఇక అమెరికాతో చర్చలు అర్థరహితం: ఇరాన్


ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో అమెరికాతో అణుచర్చలు జరపడం అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి అబ్బాస్ అరగ్చి అంతర్జాతీయ మీడియాతో వ్యాఖ్యానించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఆదివారం ఒమన్‌లో అణు చర్చలు జరగాల్సి ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదే విషయాన్ని ఆయన ఐరోపా సమాఖ్య రాయబారి ఖాజా కల్లాస్‌కు తెలిపానని వెల్లడించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ప్రత్యక్ష మద్దతు ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

నెతన్యాహు కుమారుడి పెళ్లి వాయిదా

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కుమారుడు అవ్నర్ నెతన్యాహు వివాహం వాయిదా పడింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నెతన్యాహు కుటుంబం ప్రకటించింది. అవ్నర్ పెళ్లి సోమవారం అమిత్ యార్డెనీతో జరగాల్సి ఉంది. వాయిదా పడ్డ పెళ్లి తేదీని త్వరలో ప్రకటిస్తారని సమాచారం.

ఇజ్రాయెల్‌లో ముగ్గురి మృతి

శుక్రవారం రాత్రి ఇరాన్ జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడుల్లో టెల్‌అవీవ్ శివార్లలోని రామత్‌గన్‌లో కోహెన్ ఏంజెల్(87), రిషోన్‌యెజిలోన్‌లో ఇజ్రాయెల్ అలోనీ(67), ఎట్టీ అనే మహిళలు చనిపోయారని, ఏడుగురు సైనికులు సహా.. 80 మందికి గాయాలైనట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. క్షతగాత్రుల్లో 34 మంది పారామెడికల్ బృందాలకు చెందిన వారని తెలిపింది. టెల్‌అవీవ్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం బెన్ గురియన్ వద్ద పేలుడు సంభవించినట్లు ఇరాన్ వార్తాసంస్థలు చెబుతుండగా.. యుద్ధం ప్రారంభానికి ముందు నుంచి ముందుజాగ్రత్త చర్యగా విమానాల రాకపోకలను నిషేధించామని ఐడీఎఫ్ పేర్కొంది. ఇరాన్ దాడుల్లో రామత్‌గన్, రిషోన్‌యెజిలోన్ నగరాల్లో నివాస గృహాలు, వాహనాలు భారీగా ధ్వంసమయ్యాయి. అయితే.. పౌరులను ముందుగానే బంకర్లకు తరలించడం వల్ల ప్రాణనష్టం తప్పిందని ఐడీఎఫ్ చెబుతోంది.



ఖమేనీ ముఖ్య సలహాదారు షంఖానీ



ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్‌లో విధ్వంసం

లోకం తీరు



ఏకకాలంలో మూడు యుద్ధాలు!

ఇరాన్‌తోపాటు.. గాజా, లెబనాన్‌పై ఏకకాలంలో మూడు యుద్ధాలు చేస్తున్నట్లు ఐడీఎఫ్ వివరించింది. గాజాలో జరిపిన తాజా దాడుల్లో 16 మంది చనిపోయారని పేర్కొంది. ఇక ఇరాన్ ప్రతీకార దాడులకు దిగబోదని తాము భావిస్తున్నట్లు రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కెట్జ్, ఐడీఎఫ్ బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డఫెరిన్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు ఇరాన్‌లోని 150 లక్ష్యాలపై దాడులు చేశామని చెప్పారు. తమ వైమానిక దళాల వ్యూహాలను ఇరాన్ తట్టుకోలేదని స్పష్టంచేశారు. ప్రధాని నెతన్యాహు కూడా అణు కేంద్రాలపై దాడులు కేవలం ఆరంభం మాత్రమేనని, ముందుందు ఇంకా భారీగా దాడులు ఉంటాయని వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపనున్న విషయం తమకు ముందుగానే తెలుసునని ట్రంప్ పేర్కొన్నారు.

వెయ్యి క్షిపణులతో ప్రణాళిక

ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ ఇజ్రాయెల్‌పై దాడికి వెయ్యి బాలిస్టిక్ క్షిపణులను సిద్ధం చేయాలని జాతీయ భద్రత మండలి(ఎన్ఎస్‌సీ) సమావేశంలో ఆదేశించారంటూ 'న్యూయార్క్ టైమ్స్' ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. అయితే.. ముందుగానే ఉప్పందుకున్న ఇజ్రాయెల్.. శుక్రవారం ఉదయం నుంచే టెహ్రాన్‌కు చెందిన క్షిపణి కేంద్రాలపై విరుచుకుపడింది. దీంతో.. ప్రతీకార దాడుల్లో ఇరాన్ 200 వరకు క్షిపణులను మాత్రమే వాడగలిగిందని ఆ కథనం వెల్లడించింది. కాగా.. ఇరాన్ వద్ద 2 వేల బాలిస్టిక్ క్షిపణులున్నట్లు ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ ఫాక్స్‌న్యూస్ ఓ కథనాన్ని ప్రసారం చేసింది. వచ్చే రెండేళ్లలో ఇరాన్ తన బాలిస్టిక్ క్షిపణుల సామర్థ్యాన్ని 8 వేలకు పెంచేదిశలో అడుగులు వేస్తున్న సమయంలో.. ఇజ్రాయెల్ దాడులు జరిపినట్లు ఆ కథనం వివరిస్తోంది. ఇరాన్‌పై దాడులకు బాలిస్టిక్ క్షిపణుల పెంపు ప్రయత్నమే కారణమని ఆ అధికారి వివరించినట్లు వెల్లడించింది. కాగా.. శనివారం పశ్చిమ ఇరాన్‌లోని క్షిపణి నిల్వల స్థావరాలపై దాడులు జరిపినట్లు ఐడీఎఫ్ వివరించింది.

'కుశ'తో ఇక కాస్కో!

» స్వదేశీ గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్న డీఆర్డీవో

న్యూఢిల్లీ, జూన్ 14: ఇటీవల పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల సమయంలో మన గగనతల రక్షణ వ్యవస్థ అద్భుతంగా పనిచేసింది. శత్రు దేశం ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ఆకాశంలోనే విజయవంతంగా కూల్చివేసింది. ఈ క్రమంలో దేశ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా డీఆర్‌డీవో దేశీయంగా 'ప్రాజెక్టు కుశ'లో భాగంగా మూడు రకాలను అభివృద్ధి చేస్తోంది. వాటిని దశలవారీగా 2030 నాటికి సాయుధ దళాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గగనతలంలో బహుళ అంచెల రక్షణను ఏర్పాటు చేసేలా ఈ కుశ వ్యవస్థను రూపొందించారు. విమానాలు, క్షిపణుల నుంచి వచ్చే ముప్పును అడ్డుకోవడానికి 'కుశ ఎం1'లో స్వల్ప శ్రేణి క్షిపణి వ్యవస్థలను అమర్చనున్నారు. మధ్యస్థ శ్రేణి కంటే ఎక్కువ సామర్థ్యంతో కూడిన ఉపరితలం నుంచి వాయు క్షిపణులతో 'కుశ ఎం2', అదేవిధంగా 400 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధిలోని లక్ష్యాలను, ముప్పును ఛేదించేలా 'కుశ ఎం3'ను రూపొందించనున్నట్లు డీఆర్‌డీవో వర్గాలు తెలిపాయి. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న ఈ విస్తృత శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ 'కుశ'ను రష్యాకు చెందిన ఎస్-500కు పోటీగా చూస్తున్నారు.

19న శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర: ఇస్రో

న్యూఢిల్లీ, జూన్ 14: పలు కారణాలతో వాయిదా పడుతూ వస్తోన్న యాక్సియం-4 మిషన్‌ను ఈ నెల 19వ తేదీన ప్రయోగించనున్నట్లు ఇస్రో శనివారం వెల్లడించింది. ఈ వాణిజ్య మిషన్ ద్వారా భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లనున్నారు. యాక్సియం రోదసీ యాత్రను నాసాకు చెందిన ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈనెల 11న ప్రయోగించాల్సి ఉంది. అయితే స్పేస్ ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌లో ఇంధనం లీకేజీ కారణంగా వాయిదా పడింది. ఇస్రో, యాక్సియం స్పేస్, స్పేస్ ఎక్స్ సమన్వయంతో ఈ ద్రవ ఆక్సిజన్ లీకేజీ సమస్యను పరిష్కరించారు.

సిందూర్‌కు వ్యతిరేకంగా వాట్సాప్ గ్రూప్

» ఎన్ఐఏ అదుపులో 30 మంది

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకిస్తూ వాట్సాప్ గ్రూప్ ద్వారా దుష్ప్రచారం చేసిన 30 మందిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. పాకిస్థాన్‌కు మద్దతు ప్రచారం సాగిస్తూ, ఆపరేషన్ సిందూర్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ వేల సంఖ్యలో ఇతర గ్రూపులకు సందేశాలు పంపినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడైంది. దీంతో రెండువారాలుగా ఎన్ఐఏ అధికారులు చెన్నై అంతటా నిఘా వేసి వాట్సాప్ గ్రూపు ద్వారా ఎవరెవరికి సందేశాలు వెళ్లాయన్నదానిపై ఆరా తీశారు. వాటి ఆధారంగా 30 మందిని అదుపులోకి తీసుకున్నారు.



దుబాయ్ మరీనా ప్రాంతంలోని 67 అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. భవనమంతా దట్టంగా పొగ అలుముకుంది. అగ్నిమాపక సిబ్బంది 6 గంటల పాటు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలోని 764 అపార్ట్‌మెంట్ల నుంచి సుమారు 4 వేల మందిని అధికారులు వేగంగా ఖాళీ చేయించడంతో ప్రాణాపాయం తప్పింది.

మహాత్మా గాంధీ మునిమనుమరాలికి జైలు

» రూ. 3.2 కోట్ల మోసం కేసులో ఏడేళ్లు శిక్ష ఖరారు చేసిన డర్బన్ కోర్టు



డర్బన్(సౌత్ ఆఫ్రికా), జూన్ 14: మహాత్మా గాంధీ మునిమనుమరాలు ఆషిష్ లత రామ్‌గోబిన్(56)కు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రముఖ హక్కుల కార్యకర్త ఇలా గాంధీ, దివంగత మేవా రామ్‌గోబిన్‌ల కుమార్తె లత.. వ్యాపారవేత్త ఎస్ఆర్ మహరాజ్‌ను 3.22 కోట్లకు మోసం చేశారు. నేరం రుజువుకావడంతో దక్షిణ ఆఫ్రికాలోని డర్బన్ కోర్టు శిక్ష ఖరారు చేస్తూ, అప్పీలు చేసుకునే అవకాశాన్నీ నిరాకరించింది. తనకు తాను అహింసావాదిగా, హక్కుల కార్యకర్తగా చెప్పుకునే లత రామ్‌గోబిన్‌ను, వ్యాపారవేత్త ఎస్ఆర్ మహరాజ్ 2015లో కలిశారు. ఆయన వస్త్ర, పాదరక్షల వ్యాపారి. ఇతర వ్యాపారవేత్తలకు అవసరమైన నిధులు సమకూరుస్తూ లాభంలో వాటా తీసుకుంటారు. 'దక్షిణాఫ్రికాలోని ఓ ప్రముఖ ఆసుపత్రి గ్రూప్‌నకు అవసరమైన 'లైనిన్' ఇండియా నుంచి దిగుమతి చేసుకున్నా. కస్టమ్స్ దిగుమతి సుంకం చెల్లించాలి. ప్రస్తుతం నా దగ్గర అంత పెట్టుబడి లేదు. మీరు సమకూరిస్తే లాభంలో వాటా ఇస్తాను' అంటూ లత.. మహరాజ్‌తో నమ్మబలికారు. మహరాజ్ పెట్టుబడి సమకూర్చారు. కొద్ది కాలానికే ఆమె మోసం చేసిందని తెలుసుకున్న ఆయన పోలీస్ కేసు పెట్టారు. అసలు ఆమె భారతదేశం నుంచి ఎలాంటి వస్తువులను దిగుమతి చేసుకోలేదని నిర్ధారణ అయింది.

దివ్యాంగుల కోసం 'ప్రత్యేకం'

రవాణా వ్యవస్థలో విస్తృత మార్పులు.. బస్సులు, మెట్రోల్లో వీల్‌చైర్‌కు స్థలం

» రైళ్లు, విమానాల్లోనూ సదుపాయాలు

» ప్రతిపాదనలతో ముసాయిదా సిద్ధం

న్యూఢిల్లీ, జూన్ 14: రవాణా వ్యవస్థలో దివ్యాంగులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. దీనికి సంబంధించి ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించారు. 'ట్రాన్స్‌పోర్టు యాక్సెసిబిలిటీ ఫ్రేమ్‌వర్క్' పేరుతో స్ట్రాటజిక్ యాక్సెసిబిలిటీ సెల్-రైట్స్ ఆఫ్ రైడర్స్ (ఎస్ఏసీ-ఆర్ఆర్) తయారు చేసిన ఆ ముసాయిదాపై అభిప్రాయాలను సామాజిక న్యాయం, సాధికారత శాఖ పరిధిలోని దివ్యాంగుల సాధికారత విభాగం (డీఈపీడబ్ల్యూడీ) సేకరిస్తోంది. వాటాదారులు, సాధారణ ప్రజల నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది మార్గదర్శకాలు విడుదల కానున్నాయి. ఇక ముసాయిదాలో టికెట్ బుకింగ్ నుంచి బోర్డింగ్ వరకు దివ్యాంగుల కోసం బస్సులు, రైళ్లు తదితర రవాణా వ్యవస్థలో విస్తృత మార్పులు చేయాలని సూచించారు. బస్సులు, మెట్రో రైళ్లలో వీల్ చైర్ కోసం కచ్చితంగా స్థలం కేటాయించాలని, స్టేషన్లలో మెట్లులేని టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, అలాగే ర్యాంపులు నిర్మించాలని, విమాన, రైలు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు వ్యవస్థలో శిక్షణ పొందిన సిబ్బందిని నియమించాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.



ఆ ముసాయిదాలో ఏమున్నాయి..

- చాలా అంశాలు మార్చకూడనివిగా పేర్కొన్నారు. అంటే ఒక్కసారి మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన తర్వాత వాటిలో మార్పులు చేర్పులు చేయడానికి అవకాశం ఉండదు.
- దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను అనుసరించి పలు మార్పులు సూచించారు.
- సెంట్రల్ స్కీం కింద తీసుకునే కొత్త బస్సుల్లో కచ్చితంగా లోఫ్లోర్ ప్రవేశద్వారం ఉండాలి. అలాగే ర్యాంపులు, సేఫ్టీ బెల్టులు, వీల్ చైర్ స్థానం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- ఇప్పటికే ఉన్న పీఎం ఈబస్ సేవ, టైప్ 3 ఇంటర్‌సిటీ వంటి బస్సుల్లో చిన్న లిఫ్టులు లేదా బ్రిడ్జి ర్యాంపులు ఏర్పాటు చేయాలి. ప్రతి బస్సులో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నాలుగు సీట్లు కేటాయించాలి. వాటికి సీటు బెల్టులు ఉండాలి.
- మెట్రో, సాధారణ రైళ్ల ప్లాట్‌ఫారాల్లో రబ్బర్ గ్యాప్ ఫిల్లర్స్ ఏర్పాటు చేయాలి. అలాగే వీల్ చైర్లు పట్టేలా డోర్లు వెడల్పు చేయాలి.
- దూరప్రయాణ రైళ్లలో కనీసం ఒక కోచ్‌లో దివ్యాంగులు వీల్‌చైర్ ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలి. అలాగే టైప్-ఏ టాయిలెట్ కూడా అందుబాటులో ఉండాలి.
- ఎయిర్‌పోర్టుల్లో కూడా పార్కింగ్ నుంచి చెకిన్ వరకు స్టెప్-ఫ్రీ యాక్సెసిబిలిటీ ఉండాలి. దివ్యాంగులు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక సీట్లను ఏర్పాటు చేయాలి. అలాగే దివ్యాంగుల పరికరాలు పెట్టుకునేందుకు తగిన స్థలం కేటాయించాలి.
- ట్యాక్సీలు, ఈ రిక్షాలు నడిపే సంస్థలు కూడా కొన్నింటిని దివ్యాంగులకు అనుకూలంగా మార్చాలి. రోప్ వేలను, ఫెర్రీలను కూడా ఈ పరిధిలోకి తీసుకొచ్చారు.
- ఫిర్యాదుల కోసం యాప్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దాలి. మార్పులు చేర్పులకు అనుగుణంగా వాహన చట్టం, అర్బన్ బస్ నిర్మాణం తదితర నిబంధనలు వెంటనే మార్చాలి.

భారతీయులకు ఇజ్రాయెల్ క్షమాపణలు


» కశ్మీర్‌ను పాక్‌లో అంతర్భాగంగా చూపుతూ 'ఎక్స్'లో చేసిన పోస్టుపై..

న్యూఢిల్లీ, జూన్ 14: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల వేళ.. ఇజ్రాయెల్ రక్షణ దళాలు సోషల్ మీడియాలో పంచుకున్న ఓ పోస్టు భారతీయులకు ఆగ్రహం తెప్పించింది. కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో అంతర్భాగంగా చూపుతూ పెట్టిన ఫొటోనే ఇందుకు కారణం.. ఈ నేపథ్యంలోనే భారత పౌరులకు ఐడీఎఫ్ క్షమాపణలు చెప్పింది. టెహ్రాన్‌పై వైమానిక దాడులకు దిగిన ఐడీఎఫ్.. 'ఇరాన్ ప్రపంచానికే ముప్పు. ఇజ్రాయెల్ మాత్రమే దాని అంతిమ లక్ష్యం కాదు. ఇది ప్రారంభం మాత్రమే. ఇప్పుడు మాకు మరో మార్గం లేదు' అంటూ 'ఎక్స్'లో పేర్కొంది. ప్రపంచ పటానికి సంబంధించిన ఓ ఫొటోను దానికి జత చేసింది. అయితే అందులో కశ్మీర్‌ను పాక్‌లో అంతర్భాగంగా చూపడం వివాదాస్పదమైంది. దీనిపై ఐడీఎఫ్ స్పందిస్తూ.. 'ఇరాన్ ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను ఉదహరించే ఉద్దేశంతోనే ఆ మ్యాప్ పోస్టు చేశాం. అయితే ఆ మ్యాప్ దేశాల సరిహద్దులను కచ్చితంగా చూపలేకపోయింది. తప్పిదానికి మేం క్షమాపణలు కోరుతున్నాం' అంటూ పేర్కొంది.

ప్రజా ప్రతిఘటన జోరు.. అమెరికాలో నిరసనల జోరు

» ట్రంప్ పుట్టిన రోజున నో కింగ్స్ డే పేరిట ప్రదర్శనలు

వాషింగ్టన్ డీసీ, జూన్ 14: అమెరికా లాస్ ఏంజెల్స్‌లో అక్రమ వలసదారులపై ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ అధికారుల దాడులు, అరెస్టులకు నిరసనగా చేపట్టిన ఆందోళనలు అగ్రరాజ్యాన్ని కుదిపేస్తున్నాయి. లాస్ ఏంజెల్స్‌తో మొదలైన నిరసనలు అమెరికా అంతటా విస్తరించాయి. అధ్యక్షుడు ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు శనివారం నో కింగ్స్ (రాజులు లేరు) డే పేరిట దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఫిలడెల్ఫియా, చికాగో, న్యూయార్క్, అట్లాంటా, అలాస్కా, ఫ్లోరిడా, టెక్సాస్‌తో పాటు రెండు వేల నగరాలు, పట్టణాల్లో శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. కాలిఫోర్నియా లాస్ ఏంజెల్స్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చారు. ట్రంప్‌నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజులు లేరు, సింహాసనాలు లేవు, కిరీటాల్లేవని రాసి ఉన్న ఫ్లెక్సీలు ప్రదర్శించారు. శనివారం ట్రంప్ 79వ పుట్టిన రోజుతో పాటు అమెరికా మిలిటరీ 250వ వార్షికోత్సవం సందర్భంగా పరేడ్ కూడా నిర్వహిస్తుండటంతో ఆందోళనకారులు వాషింగ్టన్ డీసీ మినహా అన్ని చోట్లా నిరసనలు చేపట్టారు. అక్రమ వలసదారుల నిరసనలు పతాక స్థాయికి చేరుకోవడంతో అధ్యక్షుడు ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినట్లు సమాచారం. లాస్ ఏంజెల్స్‌లో 4 వేల మంది నేషనల్ గార్డులను, 700 మంది మెరైన్‌లను మోహరించడం చెల్లదని, అధ్యక్షుడికి ఆ అధికారం లేదని ఫెడరల్ కోర్టు జడ్జి ఆదేశించడంతో ట్రంప్ దూకుడు తగ్గించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అక్రమ వలసదారులు పెద్ద సంఖ్యలో పనిచేసే పరిశ్రమలు, హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు, సోదాలు నిలిపివేయాలని ట్రంప్ ఆదేశించినట్లుగా అమెరికా మీడియా కథనాలు ప్రసారం చేస్తున్నాయి.



మిలిటరీ పరేడ్‌కు మునీర్‌ను పిలవలేదు

» ముఖ్య అతిథిగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను పిలిచారన్న వార్తలపై అమెరికా



వాషింగ్టన్, జూన్ 14 : అమెరికా మిలిటరీ పరేడ్‌కు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను ఆహ్వానించినట్టు వచ్చిన వార్తలను వైట్‌హౌస్ అధికార వర్గాలు ఖండించాయి. మునీర్ సహా ఏ విదేశీ నేతనూ పరేడ్ కోసం ఆహ్వానించలేదని వివరణ ఇచ్చాయి. అమెరికా మిలిటరీ పరేడ్ 250వ వార్షిక వేడుకను వాషింగ్టన్‌లో జూన్ 14న (అమెరికా కాలమానం ప్రకారం) నిర్వహించనున్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 79వ జన్మదిన సందర్భం కూడా దీనికి కలిసివచ్చింది. దీంతో ఈసారి పరేడ్‌ను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అమెరికా ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పరేడ్‌కు ముఖ్య అతిథిగా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను ఆహ్వానించినట్టు దక్షిణాసియాకు చెందిన మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ స్పందించింది. మునీర్‌కు ఆహ్వానంపై వచ్చిన వార్తలన్నీ ఊహాగానాలేనని తేల్చేసింది. భారత్‌కు తమ మద్దతు ఉంటుందని తెలిపింది.

విమాన ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ

కూలిపోవడానికి కారణాలపై పరిశీలన.. భవిష్యత్తులో భద్రతా చర్యలపై రోడ్‌మ్యాప్

- మూడు నెలల్లో కమిటీ నివేదిక వస్తుంది
- కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు
- 274కు చేరిన మృతుల సంఖ్య

న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎయిరిండియా విమానం కూలిపోవడానికి కారణాలను పరిశీలించేందుకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ కమిటీ సోమవారం సమావేశమై విమాన ప్రమాదంపై విచారణ చేపడుతుందని.. 3 నెలల్లో విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పిస్తుందన్నారు. విమాన ప్రమాదాలను నివారించడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న కార్యాచరణ ప్రణాళికను పరిశీలిస్తుందని, భవిష్యత్తులో భద్రతా చర్యల కోసం చేపట్టాల్సిన సమగ్ర, విధాన ఆధారిత రోడ్‌మ్యాప్‌ను కూడా రూపొందిస్తుందని చెప్పారు. అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం నేపథ్యంలో విమానయాన భద్రతపై శనివారం ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి సమీక్షించారు. అనంతరం ఉడాన్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. విమాన ప్రమాద ఘటన యావత్ దేశ ప్రజల మనసులను కలచివేసిందని రామ్మోహన్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. తన తండ్రి ఎర్రన్నాయుడు రోడ్డు ప్రమాదంలో మరణించారని, ప్రస్తుతం విమాన ప్రమాద బాధిత కుటుంబాలు అనుభవిస్తున్న బాధ, ఆవేదనను తాను అర్థం చేసుకోగలనని చెప్పారు. విమానయానానికి సంబంధించి కఠినమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని, అయినా ఈ దుర్ఘటన చోటుచేసుకుందన్నారు. దీనిపై వైమానిక ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఐఐబీ) వెంటనే అధికారిక దర్యాప్తు ప్రారంభించిదన్నారు. బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నామని, దాని డీకోడింగ్‌తో ప్రమాదానికి ముందు చివరి క్షణాల్లో ఏం జరిగిందో స్పష్టత వస్తుందని తెలిపారు.

అన్ని రకాల డేటాను పరిశీలించి..

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలోని ఉన్నత స్థాయి కమిటీలో.. పౌర విమానయాన శాఖ కార్యదర్శి, హోంశాఖ అదనపు కార్యదర్శితోపాటు గుజరాత్ హోంశాఖ, ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్, వైమానిక దళం భద్రత, తనిఖీల డైరెక్టర్ జనరల్, పౌర విమానయాన భద్రతా సంస్థ (బీసీఏఎస్) డైరెక్టర్ జనరల్‌లు, డీజీసీఏ ప్రతినిధులు, ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్, ఫోరెన్సిక్ సైన్స్ సర్వీసెస్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు వైమానిక రంగ నిపుణులు, ప్రమాద ఘటన దర్యాప్తు అధికారులు కూడా కమిటీలో ఉంటారు. విమాన ప్రమాదానికి సంబంధించి అన్ని రకాల వైమానిక రికార్డులు, సమాచారం, సాక్షుల వాంగ్మూలాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది.

పవర్ పోయింది.. కిందికి పడిపోతున్నాం..



లండన్‌కు వెళ్లేందుకు టేకాఫ్ అయిన తర్వాత 36 సెకన్లకు.. మధ్యాహ్నం 1.39 గంటల సమయంలో పైలట్ సుమిత్ సభర్వాల్ నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి అత్యవసర సందేశం వచ్చింది. 'మేడే.. మేడే.. మేడే.. పవర్ పోయింది.. థ్రస్ట్ రావడం లేదు.. కిందికి పడిపోతున్నాం" అని పైలట్ అన్నారు. ఆ తర్వాత విమానం నుంచి ఏ సిగ్నల్ రాలేదు. ఐదు సెకన్లున్న ఈ ఆడియో వైరల్‌గా మారింది.



విమాన ప్రమాదం జరిగిన ప్రాంతంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పర్యటన



గోవింద్ మోహన్

274కి చేరిన మృతుల సంఖ్య..

ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల సంఖ్య 274కి చేరింది. "ప్రమాద స్థలం నుంచి ఇప్పటివరకు 274 మృతదేహాలను వెలికితీసి సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన నేపథ్యంలో.. కుటుంబ సభ్యుల డీఎన్ఏతో సరిపోల్చి నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పూర్తవగానే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు" అని బీజే వైద్య కళాశాల జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు ధావల్ గమేటి తెలిపారు. ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు మరణించినట్టు ఎయిరిండియా ఇప్పటికే ప్రకటించింది. మిగతా 33 మందిలో వైద్య కళాశాల విద్యార్థులు, వైద్యులు, వారి కుటుంబ సభ్యులు, హాస్టల్ మెస్‌లో పనిచేస్తున్నవారు ఉన్నారు. కాగా ఇప్పటివరకు 19మంది డీఎన్ఏ నమూనాలను సరిపోల్చిన వైద్యులు మృతదేహాలను అప్పగించే ప్రక్రియ చేపట్టినట్టు సమాచారం. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రమాద స్థలాన్ని ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ బృందాలు కూడా క్షుణ్నంగా పరిశీలించినట్టు సమాచారం. కాగా, ఎయిరిండియా విమానం కూలిపోయి దెబ్బతిన్న బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనాలను ఖాళీ చేయిస్తున్నట్టు కాలేజీ డీన్ మీనాక్షి పారిఖ్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.25లక్షల తక్షణసాయం

అహ్మదాబాద్ ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు, ప్రాణాలతో బయటపడిన వ్యక్తికి తక్షణసాయంగా రూ.25లక్షల చొప్పున అందిస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది. టాటా గ్రూపు ఇప్పటికే రూ.కోటి చొప్పున ప్రకటించిన పరిహారానికి ఇది అదనం. అయితే, ప్రమాదంలో గాయపడిన బీజే వైద్య కళాశాల మెడికోలు, వైద్యులు, వారి కుటుంబాలకు కూడా రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని టాటా గ్రూపును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

ప్రమాదం వీడియో తీసిన బాలుడి సాక్ష్యం!

ఎయిరిండియా విమానం టేకాఫ్ అవుతూనే, మెల్లగా కిందికి జారిపోయిన వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఆర్యన్ అనే 17 ఏళ్ల బాలుడు రోజూ లాగానే తాము ఉంటున్న ఇంటిపై నిలబడి విమానం టేకాఫ్‌ను చిత్రీకరిస్తున్న సమయంలో ఆ ప్రమాదం రికార్డయింది. అహ్మదాబాద్ పోలీసులు ఆ బాలుడి నుంచి సాక్షిగా వాంగ్మూలం నమోదు చేశారు.

తొమ్మిది 787 విమానాల్లో భద్రతా తనిఖీలు పూర్తి

అహ్మదాబాద్ ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో భద్రతా తనిఖీలు సాగుతున్నాయని, ఇప్పటికే 9విమానాల తనిఖీ పూర్తయిందని ఎయిరిండియా పేర్కొంది. ఎయిరిండియా వద్ద 787-8 విమానాలు 26, 787-9 విమానాలు 7 కలిపి మొత్తం 33 డ్రీమ్‌లైనర్ విమానాలున్నాయని తెలిపింది. మిగతా 24 విమానాల్లో తనిఖీలు చేపట్టనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం ప్రమాదానికి గురైన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానానికి 2023 జూన్‌లో పూర్తిస్థాయి నిర్వహణ తనిఖీలు జరిగాయని, వచ్చే డిసెంబరులో మళ్లీ జరగాల్సి ఉందని విమానయానశాఖ వర్గాలు తెలిపాయి. కుడి ఇంజన్‌ను ఈ ఏడాది మార్చిలో పూర్తిస్థాయిలో పునరుద్ధరణ పనులు చేసి బిగించారని, ఎడమ ఇంజన్‌కు ఏప్రిల్‌లో తనిఖీలు నిర్వహించారన్నాయి. జీఈ ఏరోస్పేస్ తయారుచేసిన ఈ ఇంజన్లలో ఏ సమస్యల్లేవని పేర్కొన్నాయి.

కల్తీ ఇంధనమే కూల్చిందా?



తప్పు ఎక్కడ జరిగిందని వైమానిక నిపుణుల విశ్లేషణలు

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 14: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదానికి కల్తీ ఇంధనమే కారణమా? దీనివల్లే తగినంత ఎత్తు ఎగిరేందుకు అవసరమైన శక్తి విమానానికి లభించలేదా? అంటే కొందరు విమానయాన రంగ నిపుణులు అవుననే సమాధానం ఇస్తున్నారు. నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్(ఎన్ఏఎల్) మాజీ డిప్యూటీ డైరెక్టర్ సాలిగ్రామ్ జే మురళీధర్ తాజాగా ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. పక్షి ఢీకొంటే రెండు ఇంజన్లు ఒకేసారి విఫలంకావడానికి అవకాశం ఉందన్న వాదనను తోసిపుచ్చారు. 'పక్షి ఢీకొంటే విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలిగి నిప్పురవ్వలు, పొగ వస్తాయి. రెండు ఇంజన్లను పక్షులు ఒకేసారి ఢీకొనే అవకాశం ఉండదు. విమాన ప్రమాదానికి ఇంధన కల్తీనే ప్రధాన కారణంకావచ్చు. ఇంధనం కల్తీ అయితే రెండు ఇంజన్లపైనా ఒకే ప్రభావం పడుతుంది. దీనివల్ల వేగం తగ్గిపోయి విమానం ఎగరడానికి అవసరమైన శక్తి లభించదు. 35టన్నుల కంటే అధికంగా ఇంధనం ఉన్నందున విమానం కూలిపోయిన క్షణాల్లోనే భారీ విస్ఫోటనంతో అగ్నిగోళం ఏర్పడింది' అని మురళీధర్ వివరించారు. ఈ ఘోరానికి గల కారణాలపై నిపుణుల నుంచి సీనియర్ పైలట్ల వరకూ విభిన్న ఊహాగానాలు చేస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం విమాన ప్రమాదానికి కారణాలు ఇవీ..

ఒక ఇంజన్ వైఫల్యం, ల్యాండింగ్ గేర్ మూసుకోకపోవడం

విమానం టేకాఫ్ అయిన వెంటనే పక్షులు ఢీకొనడం లేదా అంతర్గత సమస్యలతో ఒక ఇంజన్ విఫలమై ఉంటుంది. బోయింగ్‌లోని అత్యాధునిక శ్రేణి విమానాల్లో రెండు శక్తిమంతమైన ఇంజన్లు ఉంటాయి. వీటిలో ఒకటి విఫలమైనా రెండోదాని సాయంతో విమానం పైకి ఎగురుతుంది. విమానం టేకాఫ్ అయ్యాక ల్యాండింగ్ గేర్ మూసుకుంటే విమానం పైకి ఎగరడానికి సాయపడే ఏరోడైనమిక్ ప్రవాహం ఏర్పడుతుంది. తీవ్ర ఒత్తిడితో కూడుకున్న సమయాల్లో పైలట్లు ల్యాండింగ్ గేర్‌ను పైకి ఎత్తడం మర్చిపోయే అవకాశమూ ఉంది. ఒక ఇంజన్ విఫలం కావడానికి తోడు గేర్‌ను కిందకు వదిలేయడం వల్ల విమానం ఎత్తుకు ఎగిరే సామర్థ్యం కోల్పోతుంది. భూమికి 300-400 అడుగుల ఎత్తున ఇలాంటి పరిస్థితి ఎదురైతే దాని నుంచి బయటపడటానికి పైలట్‌కు ఎక్కువ సమయం లభించదు.

రెండు ఇంజన్లు విఫలం కావడం

ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా సంభవిస్తాయి. పక్షులు ఢీకొనడం, ఇంధనం కల్తీతోపాటు సాధారణ తనిఖీల్లో గుర్తించని యాంత్రిక లోపాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తడాన్ని తోసిపుచ్చలేం. ఈ సమయంలో ల్యాండింగ్ గేర్‌ను ఎత్తడానికి, గాలి వేగాన్ని నియంత్రించడానికి అవసరమైన థ్రస్ట్ (ఎగరడానికి అవసరమైన వేగం) ఉండదు. ఈ కారణంగా విమానం క్షణాల్లోనే వేగాన్ని కోల్పోవడంతోపాటు అది ఎగురుతున్న ఎత్తు నుంచి శరవేగంగా కిందకు పడిపోవడం ప్రారంభమవుతుంది.

ఫ్లాప్ కాన్ఫిగరేషన్‌లో సమస్య

సురక్షితమైన ఎత్తుకు చేరే వరకూ రెండు ఫ్లాప్‌లు (రెక్కల వెనుక భాగం) విచ్చుకొని ఉంటేనే విమానం ఎగరడానికి అవసరమైన శక్తి లభిస్తుంది. ఒకవేళ వీటిని ముందుగానే మూసేస్తే ఆ శక్తి కూడా గణనీయంగా తగ్గిపోతుంది. ప్రమాదం జరిగిన సమయంలో అహ్మదాబాద్‌లో గాలి సాంద్రత తక్కువగా ఉంది. విమానం గేర్ తెరుచుకొని ఉండగానే ఫ్లాప్‌లు మూసుకుపోయాయి. దీంతో పైకెగరడానికి కావాల్సిన శక్తి సమకూరక విమానం అదుపు తప్పుతుంది.

సెన్సార్లలో లోపాలు

ఆధునిక విమానాలన్నీ ఆటోమేటెడ్ వ్యవస్థలపై ఆధారపడినవే. గాలి వేగాన్ని, యాంగిల్ ఆఫ్ అటాక్‌ను గుర్తించే సెన్సార్లు విమాన కంప్యూటర్‌కు తప్పుడు డేటాను ఇస్తే ఆటో-థ్రోటిల్ వ్యవస్థ ఇంజన్ శక్తిని ముందుగానే తగ్గించే ప్రమాదం ఉంది. ఇటువంటి తప్పుడు హెచ్చరికల కారణంగా విమానం ఎగిరే ఎత్తు తగ్గిపోతుంది. అలాగే గాలివేగాన్ని కొలిచే పిటాట్ ట్యూబ్ మూసుకోపోవడం, విమాన నియంత్రణ వ్యవస్థ విఫలంకావడం వల్ల విమానం వేగం, ఎగురుతున్న కోణం విషయంలో పైలట్లు పొరబడే అవకాశం ఉంటుంది. కాగా బ్లాక్‌బాక్స్ డేటాను విశ్లేషించాక పూర్తి స్పష్టత వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

'బోయింగ్' నివేదికను వెంటనే విడుదల చేయాలి

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ 787 విమానాలకు సంబంధించిన నిర్మాణ లోపాలపై నివేదికను వెంటనే విడుదల చేయాలని ప్రజావేగు సలేహ్‌పూర్ తరపు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ)కు లేఖ రాశారు. 'బోయింగ్ 787, 777 విమానాల్లో తీవ్రమైన నాణ్యతా లోపాలు ఉన్నాయని బోయింగ్ క్వాలిటీ ఇంజనీర్ అయిన సలేహ్‌పూర్ 2024 ప్రారంభంలో ఆరోపించారు. దీనిపై 2024 మార్చిలో దర్యాప్తు ప్రారంభించిన ఎఫ్ఏఏ ఉన్నతాధికారులు.. అదే ఏడాది డిసెంబరులో విచారణ పూర్తయిందని సమాచారం ఇచ్చారు. తమ దర్యాప్తునకు సంబంధించిన నివేదికను త్వరలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ నివేదిక వెలుగు చూడలేదు' అని ఆ లేఖలో పేర్కొన్నారు. తక్షణమే ఆ నివేదికను విడుదల చేయాలని కోరారు. దీనిపై ఎఫ్ఏఏ స్పందించాల్సి ఉంది.

గోదావరి-బనకచర్లను అడ్డుకోండి

ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను తిరస్కరించండి



- డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా అడ్డుకోండి
- నికర జలాల్లేని ప్రాజెక్టుకు డీపీఆర్ ఇవ్వాలని ఎలా కోరతారు
- ఏపీ విషయంలో కేంద్రం తీరుపై అభ్యంతరం
- కేంద్ర జలశక్తి మంత్రికి ఉత్తమ్ ఘాటు లేఖ
- హరీశ్ ఆరోపణలు నిరాధారమన్న మంత్రి


హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నికర జలాలు లేని ప్రాజెక్టుకు డీపీఆర్ దాఖలు చేయాలని ఎలా కోరతారని కేంద్ర జలశక్తి శాఖను తెలంగాణ ప్రభుత్వం నిలదీసింది. గోదావరి-బనకచర్ల అనుసంధానంపై కేంద్ర వైఖరిని తప్పుబడుతూ ఈనెల 13న జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ రాశారు. "గత నెల మే 28న నేను రాసిన లేఖకు మీరు స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014, బచావత్ ట్రైబ్యునల్ ప్రకారమే గోదావరి-బనకచర్ల అనుసంధానం విషయంలో వ్యవహరిస్తామని హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు. అయితే ఈ పథకానికి సంబంధించిన ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను ఇప్పటికే ఏపీ ప్రభుత్వం కేంద్ర జలవనరుల సంఘాని(సీడబ్ల్యూసీ)కి దాఖలు చేసింది, ఈ నెల 2న కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి సజ్జన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కేంద్ర జలశక్తి శాఖ సీనియర్ సంయుక్త కమిషనర్ అమిత్ కుమార్ ఝా కూడా హాజరయ్యారు. గోదావరి-బనకచర్ల పీఎఫ్ఆర్‌ను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఈ నెలాఖరు నాటికి డీపీఆర్‌ను సమర్పించాలని ఏపీని కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి కోరడం తీవ్ర అభ్యంతరకరం. ఒక పథకం డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో దాఖలు చేయాలంటే తొలుత ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)కు ఆ విభాగం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా గోదావరి-బనకచర్ల అనుసంధానం డీపీఆర్ దాఖలు చేయాలని ఏపీని ఏ విధంగా కోరతారు..? పీఎఫ్ఆర్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించిందా..? తెలంగాణ తరఫున గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఏ ప్రాజెక్టును చేపట్టాలన్నా డీపీఆర్‌కు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. పైగా, 1980 నాటి బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ప్రకారం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు ఎటువంటి నీటి కేటాయింపులు లేవు. నికర జలాల కేటాయింపుల్లేకుండా దాఖలు చేసే పీఎఫ్ఆర్‌ను సీడబ్ల్యూసీ తిరస్కరిస్తుంది తప్ప డీపీఆర్ దాఖలు చేయాలని ఎప్పుడూ కోరదు. కేంద్ర జలశక్తి శాఖ సీనియర్ సంయుక్త కమిషనర్ సమక్షంలో గోదావరి-బనకచర్ల డీపీఆర్‌ను దాఖలు చేయాలని ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి కోరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ చర్యలు సాంకేతికంగా పీఎఫ్ఆర్‌కు ఆమోదం తెలిపినట్లుగా భావించాల్సి ఉంటుంది. కృష్ణా, గోదావరిలో ఏ ప్రాజెక్టును చేపట్టాలన్నా తొలుత సీడబ్ల్యూసీలో డీపీఆర్ దాఖలు చేసి, దానికి సీడబ్ల్యూసీలోని అన్ని విభాగాలు క్లియరెన్స్ ఇచ్చాక.. కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డులు డీపీఆర్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి అనంతరం ప్రాజెక్టును చేపట్టాల్సి ఉంటుంది. ఏపీ ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధానం తెలంగాణ ప్రజల న్యాయమైన నీటి హక్కును ఉల్లంఘించడమే కాకుండా న్యాయమైన నీటి వాటాపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. తెలంగాణ హక్కులను హరించే ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు తెలపడం సహజ న్యాయసూత్రానికి విరుద్ధం. అంతర్రాష్ట్ర నదీ జలాల్లో సమాన వాటాకు విరుద్ధం. ఈ అంశాల దృష్ట్యా పీఎఫ్ఆర్‌ను తక్షణమే తిరస్కరించేలా సీడబ్ల్యూసీని ఆదేశించాలి. ఈ పథకం డీపీఆర్‌ను కూడా సీడబ్ల్యూసీలో దాఖలు చేయకుండా నిలువరించాలి. టెండర్లు పిలవకుండా అడ్డుకోవాలి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి విరుద్ధంగా వెళుతున్న ఏపీని కట్టడి చేయాలి" అని ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. కాగా, గోదావరి-బనకచర్ల అనుసంధానానికి వ్యతిరేకంగా ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి ఉత్తమ్ లేఖలు రాశారు.

హరీశ్‌రావు ఆరోపణలు నిరాధారం

తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించే ఏ ప్రాజెక్టును కూడా చేపట్టడానికి అంగీకరించబోమని ఉత్తమ్ తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణలు నిరాధారమని, నదీ జలాలపై తెలంగాణ హక్కుకు అన్యాయం చేసిందే బీఆర్ఎస్ అని మండిపడ్డారు. రాష్ట్ర అవతరణ అనంతరం ఉమ్మడి ఏపీకి కృష్ణాలో 811 టీఎంసీల నీటి కేటాయింపులు ఉండగా.. అందులో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు ఒప్పుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. ఆ ద్రోహమే నీటి సంక్షోభానికి పునాది వేసిందన్నారు. శ్రీశైలం నుంచి మల్యాల, ముచ్చుమర్రి వద్ద నుంచి నీటి తరలింపును బీఆర్ఎస్ అడ్డుకోలేదని తెలిపారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉండగా.. ఆ ప్రాజెక్టుకు ఏపీ టెండర్లు పిలిచిన తర్వాత అపెక్స్ కౌన్సిల్ నిర్వహించేలా జాగ్రత్త పడి ఏపీకి బీఆర్ఎస్ మేలు చేసిందన్నారు. కేసీఆర్, జగన్ మధ్య జరిగిన చీకటి ఒప్పందం వల్లే రాయలసీమ ఎత్తిపోతల ద్వారా శ్రీశైలం నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించే పనులు జరుగుతున్నాయని విమర్శించారు.

బనకచర్లపై సుప్రీంకు వెళతాం

ఏపీ జల దోపిడీపై సర్కారులో స్పందన లేదు.. ఇద్దరు కేంద్ర మంత్రులూ మౌనంగా ఉన్నారు: హరీశ్



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్ జల దోపిడీ చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. గోదావరి పరీవాహక ప్రజలతో కలిసి బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళతామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును హరీశ్‌రావు వివరించారు. కృష్ణా జలాల్లో దోపిడీ జరిగినప్పుడు కూడా ఈ ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పుడు గోదావరి జలాలపై ఏపీ అక్రమంగా టెండర్లు పిలుస్తుంటే మౌనంగా ఉందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు ప్రతిపక్షాల మీద ఇరిటేషన్ తప్ప, ఇరిగేషన్ మీద దృష్టి లేదని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. నాడు మహారాష్ట్రతో 2 టీఎంసీల నీటి కోసం బాబ్లీ ప్రాజెక్టుపై చంద్రబాబు పోరాటం చేశారని, నేడు 200 టీఎంసీల బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై తెలంగాణ అంతకు ఎన్ని రెట్లు పోరాటం చేయాలని ప్రశ్నించారు. ఇది 200 టీఎంసీలతో ఆగిపోదని, భవిష్యత్తులో 400 టీఎంసీలకు పెంచుకునేందుకు ఏపీ సర్కార్ కుట్ర పన్నుతోందని హరీశ్ పేర్కొన్నారు.

కేంద్రంపై నోరు మెదపరెందుకు..?

తెలంగాణకు 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి జలాల విషయంలో జరుగుతున్న అన్యాయంపై ఎవరూ మాట్లాడటం లేదని హరీశ్ ధ్వజమెత్తారు. ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా నోరు మెదపకపోవడం విడ్డూరమన్నారు. "మీ దోస్తానా కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడతారా..? కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆంధ్రాకు పది రెట్లు నిధులు ఇచ్చామని చెప్పినప్పుడు కూడా మీరు ఎందుకు స్పందించరు..?" అని రేవంత్‌ను ప్రశ్నించారు. గతంలో ఎఫ్ఆర్‌బీఎం పేరు చెప్పి కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు రాకుండా కేంద్రం అడ్డంకులు సృష్టించిందని తెలిపారు. నేడు చంద్రబాబుకు బనకచర్ల ప్రాజెక్టు కోసం 50 శాతం నిధులు కేటాయించి, మిగతా 50 శాతం నిధుల కోసం రాష్ట్ర ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మినహాయించి రుణాలు పొందేలా వెసులుబాటు కల్పించిందని ధ్వజమెత్తారు. నిధుల్లో, నీటి కేటాయింపుల్లో కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తుంటే, రేవంత్ సర్కారు మౌనంగా ఉంటోందని విమర్శించారు. ఏపీ జల దోపిడీకి వ్యతిరేకంగా అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ఈ ప్రాజెక్టులు నిర్మించడానికి వీల్లేదని ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. దోస్తానా కోసం రేవంత్ సర్కారు మౌనంగా ఉంటే ప్రజా పోరాటానికి, న్యాయ పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు.

ముందు రోజు తేదీ వేసి ఉత్తమ్ లేఖలు..

బనకచర్లపై తాను ప్రజెంటేషన్ ఇచ్చిన అరగంటలోపే మంత్రి ఉత్తమ్ జలశక్తి మంత్రికి నిన్ననే రాసినట్లు ఓ లేఖ విడుదల చేశారని హరీశ్ అన్నారు. గతంలో కూడా ఇదే తరహాలో తాను ప్రెస్ మీట్ పెట్టిన తర్వాతే.. ముందు రోజు తేదీ వేసి మీడియాకు లేఖ విడుదల చేశారని పేర్కొన్నారు. లేఖలు రాసి మీడియాకివ్వడం కాదని, చిత్తశుద్ధి ఉంటే జల దోపిడీ విషయంలో అపెక్స్ మీటింగ్‌కు డిమాండ్ చేయాలని రేవంత్‌కు సూచించారు. ప్రజెంటేషన్ తర్వాత హరీశ్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. త్వరలో కాళేశ్వరంలో ఉన్న అన్ని విభాగాల వద్దకు వెళ్లి, ప్రజలకు అన్ని విషయాలను వివరిస్తామని వెల్లడించారు. కాళేశ్వరానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు బయటపెడతానని సీఎం అంటున్నారని, అయితే అవి బయటికొచ్చిన నిమిషాల వ్యవధిలో తాను కూడా కొన్ని డాక్యుమెంట్లు బయటపెడతానని చెప్పారు. గురుదక్షిణగా చంద్రబాబుకు, బనకచర్లకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం చంద్రబాబుపై ఆధారపడటంతో బనకచర్లపై బీజేపీ మాట్లాడే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పులపై త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని హరీశ్ తెలిపారు.

విద్యుత్ సంస్థల్లో కొలువుల మేళా

- 4 సంస్థల్లో 5,368 పోస్టుల ఖాళీ
- డిస్కమ్‌ల్లో 4175, ట్రాన్స్‌కో 703, జెన్‌కోలో 490 ఖాళీలు
- బీటెక్/బీఈ, డిప్లొమా ఎలక్ట్రిక్, ఐటీఐ పూర్తి చేసిన వారికి చాన్స్



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో ఖాళీగా ఉన్న 5,368 ఉద్యోగాలను త్వరలో భర్తీ చేయనున్నారు. బీటెక్/బీఈ, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులతో ఈ ఉద్యోగాల నియామకాలు చేపడతారు. తెలంగాణ రాష్ట్ర ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్) పరిధిలో 2,170, దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్) పరిధిలో 2,005, తెలంగాణ ట్రాన్స్‌కోలో 703, తెలంగాణ జెన్‌కోలో 490 కొలువుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ వెలువడనున్నది. ఎన్పీడీసీఎల్‌లో 44 అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ), 30 సబ్ ఇంజనీర్, 2,090 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టులు.. ఎస్పీడీసీఎల్‌లో 45 అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ), 30 సబ్ ఇంజనీర్లు, 1650 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టులకు నియామకాలు చేపడతారు. ఇక తెలంగాణ ట్రాన్స్‌కోలో 437 అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ), 63 సబ్ ఇంజనీర్, 189 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం), 14 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్/జూనియర్ పర్సనల్ ఆఫీసర్ పోస్టులతో కలిపి 703 పోస్టులు రిక్రూట్ చేస్తారు. తెలంగాణ జెన్‌కోలో 175 ఏఈ, 150 సబ్ ఇంజనీర్, 165 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్/ జూనియర్ పర్సనల్ ఆఫీసర్/ కెమిస్ట్/ జూనియర్ పర్సనల్ అటెండెంట్ పోస్టులతో కలిపి 490 భర్తీ చేయనున్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో.. బీటెక్/బీఈ పూర్తి చేసిన అభ్యర్థులతో 701 ఏఈ, పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ డిప్లమా చేసిన అభ్యర్థులతో 509 సబ్ జూనియర్ ఇంజనీర్, ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులతో భర్తీ చేస్తారు.

రేవంత్‌కు మా గురించి మాట్లాడే అర్హత లేదు

- ఆయన ముందు తన ఉద్యోగాన్ని కాపాడుకోవాలి
- బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): "సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో ఒక ఉద్యోగి మాత్రమే. ఆయన ముందు తన ఉద్యోగాన్ని కాపాడుకోవాలి. ఆయనకు కాంగ్రెస్ అగ్రనేతల దర్శనం లభించడం లేదు. ఆయనకు మా గురించి మాట్లాడే అర్హత లేదు" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బీజేవైఎం నాయకుడు సాయినాథ్‌తో పాటు వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు, విద్యార్థులు శనివారం తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి ఎమ్మెల్సీ కవిత తన నివాసంలో కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో, ఆ తర్వాత చిట్‌చాట్‌గా మాట్లాడారు. రేవంత్ రెడ్డి లాంటి అసమర్థ సీఎంను తాను ఇంతవరకు చూడలేదని, ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సైతం ఇంత బలహీనంగా లేరని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచ సరికాదన్నారు. బీసీలకు 42%ం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని చెప్పారు. 17న మెదక్‌లో బీసీ రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆపదలో నేస్తం డయల్ 112

- ఒకే రోజు నాలుగు చోట్ల నేరాలను నియంత్రించాం
- అత్యవసర పరిస్థితుల్లో ఆఘమేఘాల మీద యాక్షన్
- టీజీఐసీసీసీ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా, అత్యవసర పరిస్థితి ఏర్పడినా డయల్ 112కు ఫోన్ చేస్తే భరోసా దొరకుతుందని నమ్మకం కలిగించే దిశగా పనిచేస్తున్నామని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) డైరక్టర్ కమలాసన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి శుక్రవారం డయల్ 112కు వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి నాలుగు సంఘటనల్లో నేరాలను నియంత్రించగలిగామని ఆయన వివరించారు. డయల్ 112కు ఫోన్‌కాల్ వచ్చిన వెంటనే సిబ్బంది వేగంగా స్పందించి ఆయా జిల్లాల పోలీసులను అప్రమత్తం చేసి నిమిషాల వ్యవధిలో నేరం జరిగిన ప్రాంతానికి చేరుకోవడం వల్ల నాలుగు సంఘటనల్లో ఫలితాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. కోకాపేట ప్రాంతంలో ఓ చిన్నారి అదృశ్యమైందని ఫోన్ రావడంతో సకాలంలో స్పందించి చిన్నారి ఆచూకీ కనుగొని తల్లికి అప్పగించామని ఆయన తెలిపారు. అంబర్‌పేటలో అనుమతి లేకుండా ఒక మహిళను వీడియో తీస్తున్న యువకుడిని మహిళ ఫిర్యాదు మేరకు పట్టుకున్నామని, తండ్రిని చంపడానికి ప్రయత్నిస్తోన్న కొడుకును కేతేపల్లి పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారని, సంగారెడ్డిలో అత్త మీద అత్యాచారయత్నం చేసిన ఓ వ్యక్తిని పట్టుకున్నామని కమలాసన్ రెడ్డి తెలిపారు.

నైపుణ్యాభివృద్ధికి న్యాక్‌కు ప్లాటినం అవార్డు

- ప్రభుత్వ సేవల్లో హరిచందనకు గోల్డ్ అవార్డు

నిర్మాణ రంగంలో ఉత్తమ నైపుణ్యాభివృద్ధికి గాను నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)కి ప్లాటినం అవార్డు లభించింది. న్యాక్ డైరెక్టర్ జనరల్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేసిన హరిచందన దాసరికి ప్రభుత్వ సేవల్లో గోల్డ్ అవార్డు దక్కింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ ఈ అవార్డులను ఢిల్లీలో శనివారం అందజేసింది. నిరుద్యోగ యువతకు, సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు వివిధ నిర్మాణ రంగ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడంలో న్యాక్ కీలక పాత్ర పోషించింది. అందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 24,346 మందికి ఉచిత శిక్షణ, ఉచిత భోజనం, వసతి వంటి సౌకర్యాలను కల్పించింది. పీఎంకేవీవై, ప్రధాన్ మంత్రి విశ్వకర్మ పథకం కింద నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఈ సేవలను గుర్తించి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ అవార్డులకు ఎంపిక చేసింది. పురస్కారాలు పొందిన హరిచందన, న్యాక్ డైరెక్టర్లు, సిబ్బందిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, న్యాక్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభినందించారు.

కాళేశ్వరం రీ డిజైన్ రాజకీయ నిర్ణయమే

- స్థానిక ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి: బీజేపీ

కాళేశ్వరం ప్రాజెక్టు తొలి దశను తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చడం రాజకీయ నిర్ణయమే అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. మేడిగడ్డ వద్ద పనులకు ఎందుకు టెండర్లు పిలవలేదని, తుమ్మిడిహట్టి గుత్తేదారుకే ఎందుకు కాంట్రాక్టు కట్టబెట్టారని కేసీఆర్‌ను నిలదీశారు. కాగ్, పీఏసీ వార్షిక నివేదికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు తప్పిదాలను ఏటా లేవనెత్తినా.. నాటి సీఎం కేసీఆర్ వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పీసీ ఘోష్ కమిషన్ ఎదుట బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెప్పారని అన్నారు. స్థానిక సంస్థలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ.2,314 కోట్లు నిలిచిపోయాయని తెలిపారు.

కఠినంగా కనిపించినా.. అభిమానమే!

(మొదటిపేజీ తరువాయి)

చేసినందుకు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, సినీ ప్రముఖులకు నా అభినందనలు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం సినీ పరిశ్రమను గౌరవించి, మీకు అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేయడమే కాకుండా, మిమ్మల్ని అభినందించాలన్న ఆలోచనతో ఈ అవార్డులను మళ్లీ పునఃప్రారంభించింది" అని రేవంత్ వివరించారు.

ఆ సంప్రదాయాన్ని కొనసాగించేందుకే..

తెలుగు సినీ పరిశ్రమను గుర్తించడానికి, డైరెక్టర్లను, నటులను, ఇతర కళాకారులను గుర్తించి అవార్డులు ఇవ్వాలని, ఆ అవార్డులకు నంది పేరు పెట్టాలని 60 ఏళ్ల క్రితం 1964లో ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఆ సంప్రదాయాన్ని 14 ఏళ్ల క్రితం వరకు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రులు కొనసాగిస్తూ వచ్చారని తెలిపారు. మొట్టమొదటి నంది ఉత్తమ నటుడి అవార్డును అక్కినేని నాగేశ్వరరావు తీసుకున్నారని, అలాంటి గొప్ప కళాకారుడికి ఆనాటి ప్రభుత్వం సముచిత గౌరవాన్ని ఇవ్వడాన్ని అందరం గుర్తు చేసుకోవాలని అన్నారు. వివిధ కారణాల వల్ల 14 ఏళ్ల క్రితం ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ కొనసాగించాలన్న ఆలోచనతో తమ ప్రభుత్వం నంది అవార్డులను 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు'గా ఇస్తోందని పేర్కొన్నారు.. ప్రముఖులంతా ఇక్కడ ఉండి, పరిశ్రమంతా ఒక్కటేనని, పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఆహ్వానిస్తున్నామంటూ సమయాన్ని కేటాయించడాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. గతంలో భారతీయ సినీ పరిశ్రమ అంటే బాలీవుడ్ అని చర్చించుకునేవారని, తెలుగు సినీ పరిశ్రమ అంటే చెన్నైలో ఉందని మాట్లాడుకునేవారని అన్నారు. కానీ, ఈనాడు భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమ అంటున్నారని తెలిపారు. "తెలుగు సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదిక అని మీరు నిరూపించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మిమ్మల్ని అభినందిస్తున్నా. సినీ పరిశ్రమకు సంబంధించి మొదటి తరమంటే అన్న నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు. రెండో తరమంటే కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు. మూడో తరమంటే చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున. ఈ రోజు నాలుగో తరం సినీ పరిశ్రమ ఇక్కడ ఉంది. నాలుగో తరంలో పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్.. ఇలా వీరి తరం ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహిస్తోంది. విద్యార్థి దశలో నాకు పరిచయం ఉన్నవారు సినీ పరిశ్రమలో రాణిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. బన్నీ, వెంకట్, అశ్వనీదత్ అమ్మాయిలు, అల్లుడు నాగ్ అశ్విన్.. వీళ్లందరూ కాలేజ్ డేస్‌లో నాకు తెలుసు. వారందరూ రాణిస్తుండడం పట్ల అభినందిస్తున్నాను" అని రేవంత్ అన్నారు.


హైటెక్స్‌లో జరిగిన 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల' ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి, దిల్ రాజు, విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్, బాలకృష్ణ తదితరులు

మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటాం..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంలో ఇతర రంగాల్లాగే సినీ ఇండస్ట్రీ కూడా గొప్ప పరిశ్రమగా రాణించాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అన్నారు. ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో.. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చెందేలా నడిపిస్తానని ప్రధానమంత్రి మోదీకి చెప్పానన్నారు. అది జరగాలంటే సినీ పరిశ్రమ కూడా గొప్పగా అభివృద్ధి చెందాలన్నారు. "హాలీవుడ్ అంటే అమెరికాకు, బాలీవుడ్ అంటే ముంబైకి వెళుతున్నాం. నేను దర్శకుడు రాజమౌళిని అడుగుతున్నా. ప్రపంచమే గుర్తించేలా అద్భుతమైన సినిమాలు తీయగలిగిన మీరు.. ఆ పరిశ్రమను ఈ గడ్డ మీదకు ఎందుకు తీసుకురావడం లేదు? హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ గడ్డ మీద ఉండాలి. మీకు ఏం కావాలో నాకు చెప్పండి. రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా నిలబడుతుంది. ఐటీ, ఫార్మా, డిఫెన్స్ పరిశ్రమలను ప్రోత్సహించినట్లే సినీ పరిశ్రమను కూడా ప్రోత్సహిస్తాం. ప్రణాళికను మీరు రచించండి. మా 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమకు ఒక చాప్టర్ ఇస్తాం. ఆ చాప్టర్‌ను రాయాల్సిన బాధ్యత ఇక్కడున్న సినీ పెద్దలందరిపై ఉంటుంది. మీకు ఏం కావాలో నాకు చెప్పండి. ఇక్కడి నుంచి 22 ఏళ్ల సమయం ఉంది. ఈ 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో నేనుంటా. ఏహోదాలో ఉన్నా.. మీకు అండగా నిలబడతా" అని సీఎం హామీ ఇచ్చారు.

తెలంగాణలో ఎవరైనా వ్యాపారం చేసుకోవచ్చు..

తెలంగాణకు ఎవరైనా రావొచ్చునని, వ్యాపారం చేసుకోవచ్చునని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 85 కంపెనీల ఫుట్‌ప్రింట్స్ తెలంగాణలో ఉన్నాయని చెప్పారు. దేశంలోని ఏ నగరంలోనూ ఈ స్థాయిలో లేవన్నారు." బెంగళూరు, అమరావతి, ముంబై, చెన్నై, ఢిల్లీ మెట్రోపాలిటన్ సిటీలంటూ మాట్లాడుతుంటారు. వీళ్లెవరూ మాకు పోటీ కాదు. వీళ్లంతా మాకు సోదరులు. న్యూయార్క్, టోక్యో, జపాన్, దక్షిణ కొరియా, చైనాతో మా పోటీ. పరిశ్రమల విషయంలో చైనాతో, అభివృద్ధిలో దక్షిణ కొరియాతో, టెక్నాలజీలో జపాన్‌తో పోటీ పడదలచుకున్నాం. ఇదీ మా విజన్, విజన్ డాక్యుమెంట్" అని రేవంత్ వివరించారు. 2047లో ఆగస్టు 15న మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీని చూసిన తర్వాత ఆ రోజు చాలా ఆనందంగా ఉంటానని తెలిపారు. అదే రోజు సినీ పరిశ్రమ కార్యక్రమానికి వేదికను ఏర్పాటు చేస్తానని చెప్పారు. "నేను చెప్పింది ఏదీ ఇంతవరకు మిస్ కాలేదు. నేను సాధించుకోవాలనుకున్న దానిలో ఎందులోనూ ఫెయిల్ కాలేదు. సక్సెస్ రేట్ హండ్రెడ్ పర్సంట్" అని వ్యాఖ్యానించారు.

గద్దర్ అన్న అంటేనే విప్లవం

"గద్దరన్న అంటే ఒక చైతన్యం. గద్దరన్న అంటే ఒక విప్లవం. గద్దరన్న ఒక వేగుచుక్క. గద్దరన్న స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. జయహే, జయహే గీతాన్ని అందించిన అందెశ్రీ, జై బోలో తెలంగాణ గీతాన్ని అందించిన గద్దరన్న అంటే మాకందరికీ స్ఫూర్తి. ఆ స్ఫూర్తితోనే మేము పోరాటం చేశాం. ఈ పోరాటం ప్రజల కోసమే. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించడానికి నిత్యం వారిని స్ఫూర్తిగా తీసుకుంటాం. తెలంగాణ గద్దర్ అవార్డులు తీసుకున్నవారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా" అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ నిర్మాణంలో, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, గతంలో ఏవైనా అంశాలున్నా వాటన్నింటినీ పక్కన పెట్టి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "నందమూరి బాలకృష్ణ నాకు ఒక మాట చెప్పారు. కళ్లతో చూసేది కళ. కళ్లతో అభినయించేది కళ. కళ్లు మూసుకుని కనేది కల. కళ్లు మూసుకున్న వారిని చైతన్యపరిచేది కళ అని చెప్పమన్నారు. బాలకృష్ణ తరఫున మీకందరికీ చెబుతున్నా. ఈ కళా చైతన్యమే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలి. విప్లవాల వైపు నడిపించిన గద్దరన్న స్ఫూర్తి అభివృద్ధి పథం వైపు నడిపించాలి. గద్దరన్న కుటుంబాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. గద్దరన్న కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతుంది" అని సీఎం ప్రకటించారు. గాయకుడు రాహుల్ సిప్లిగంజ్.. ఓల్డ్ సిటీ నుంచి ఆస్కార్ అవార్డు వరకు రాణించారని, ఆయనకు ఏదైనా ఇవ్వాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఏదైనా అవార్డు ఇవ్వడానికి ఏదైనా నిర్ణయం తీసుకోండని సూచించారు.

కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవస్థానం నూతన పాలక మండలి చైర్మన్, సభ్యులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్లు మంజూరు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన గద్దర్ ఫౌండేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసింది. గద్దర్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన గద్దర్ సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతోంది. ఇక ముందు గద్దర్ జయంతి వేడుకల నిర్వహణలోనూ గద్దర్ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది.

నాటి డీజీపీ, ఐజీ ఆదేశంతోనే ట్యాపింగ్!

మహేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ చెప్పినందుకే సిట్ విచారణలో ప్రభాకర్‌రావు వెల్లడి!

- మూడోరోజు ఎస్ఐబీ మాజీ చీఫ్ విచారణ
- మావోయిస్టుల పేరు చెప్పి.. నేతలు, పారిశ్రామికవేత్తల ఫోన్లట్యాపింగ్
- ఎవరి ఆదేశాలతో ప్రముఖుల నంబర్లిచ్చారు
- ప్రభాకర్‌రావును ప్రశ్నించిన సిట్
- ప్రణీత్ వాంగ్మూలం ఆధారంగా ప్రశ్నలు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో నాటి డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ అనిల్‌కుమార్‌ల ఆదేశాల మేరకే తాను ఫోన్ ట్యాపింగ్ చేయించానని సిట్ అధికారుల ఎదుట చెప్పినట్లు సమాచారం. శనివారం మూడో రోజు సిట్ విచారణకు ప్రభాకర్‌రావు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయానికి వచ్చిన ప్రభాకర్‌రావును డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి దాదాపు 9గంటలపాటు ప్రశ్నించారు. మావోయిస్టుల పేరు చెప్పి.. పలువురు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తల ఫోన్లను ట్యాపింగ్ చేయించినట్లు, ఇందుకు అనుమతి కోసం హోంశాఖకు తప్పుడు సమాచారం పంపించినట్లు గుర్తించిన సిట్ అధికారులు .. శనివారం ప్రభాకర్‌రావును ఇదే అంశంపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రభాకర్‌రావును ప్రశ్న అడిగిన తర్వాత.. ఆయనిచ్చిన సమాధానం తప్పయితే తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించి నిలదీస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావు ఉన్నతాధికారుల కళ్లు గప్పడానికి అనుసరించిన వ్యూహాన్ని బట్టబయలు చేస్తున్నారని సమాచారం. అయితే కొన్ని ప్రశ్నలకు ఉన్నతాధికారులను ఇందులోకి లాగే దిశగా ప్రభాకర్‌రావు సమాధానాలిచ్చినట్లు, మరికొన్నిసార్లు మౌనాన్ని ఆశ్రయించినట్లు తెలిసింది.

హోంశాఖకు తప్పుడు సమాచారం..

మావోయిస్టుల పేర్లు చెప్పి కొందరు ప్రముఖులకు సంబంధించిన కాల్ డిటైల్ రికార్డులు(సీడీఆర్), ఇంటర్నెట్ ప్రొటోకాల్ డిటైల్ రికార్డులు(ఐపీడీఆర్) సేకరించారని, వీటి ఆధారంగా పెద్ద ఎత్తున అనధికార ఫోన్ ట్యాపింగ్ నిర్వహించినట్లు సిట్ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ఆయా ఆధారాలతో ప్రభాకర్‌రావును ప్రశ్నించినట్లు సమాచారం. తప్పుడు సమాచారంతో హోంశాఖ నుంచి అనుమతి కోరినవి కొన్ని కాగా, అనధికారికంగా వందల్లో ప్రొఫైళ్ల తయారీ జరిగింది. ఈ నేపథ్యంలో, "ఎవరి అండదండలతో మీరు ఇవన్నీ చేశారు? మీకు ఆదేశాలిచ్చింది ఎవరు? ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి మోసపూరితంగా మీరు ఎందుకు వ్యవహరించారు?" అని అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో నాటి డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ అనిల్‌కుమార్‌ల ఆదేశాలనే తాను పాటించానని ప్రభాకర్‌రావు చెప్పినట్లు సమాచారం. కాగా, ప్రభాకర్‌రావు బృందం నుంచి హోంశాఖకు వెళ్లిన విజ్ఞప్తుల్లో 70 శాతం తప్పుడు సమాచారమని సిట్ అధికారులు విచారణలో నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. ఆయా విషయాల ఆధారంగా ప్రభాకర్‌రావుపై పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. తొలిరోజు విచారణలో తన పై అధికారులకు అన్నీ తెలుసునని, రాతపూర్వక అనుమతులన్నీ తీసుకున్న తర్వాతే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ప్రభాకర్‌రావు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే అనుమతుల కోసం తప్పుడు సమాచారం ఇచ్చిన విషయాన్ని సిట్ అధికారులు బయట పెట్టడంతో ఆయన ఇబ్బందికర పరిస్థితుల్లో మౌనాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది.



ఎన్నికల ఫలితాలు వచ్చిన గంటల్లోనే డేటా ధ్వంసం


2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారం చేపట్టనున్న క్రమంలో.. ఎన్నికల ఫలితాలు వెల్లడైన గంటల వ్యవధిలోనే ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు.. ఎస్ఐబీ కార్యాలయానికి వెళ్లి సీసీ కెమెరాలను ఆపి వేసి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేశారు. దాదాపు 1200 పేజీల ఫోన్ ట్యాపింగ్ ప్రొఫైళ్లను దహనం చేశారు. పలుహార్డ్ డిస్కులను కట్టర్లతో ధ్వంసం చేశారు. కొన్ని హార్డ్ డిస్కుల ముక్కలను మూసీలో పడవేశారు. దీంతో ఇదంతా ఎందుకు చేశారు? ఎవరు ఆదేశాలిచ్చారు? అని ప్రణీత్‌రావును సిట్ అధికారులు ప్రశ్నించినపుడు.. తన బాస్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే చేశానని అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ప్రభాకర్‌రావు నిరాకరించడంతో ప్రణీత్‌రావుతో డేటా ధ్వంసానికి ముందు ఏ సమయంలో ఫోన్‌లో మాట్లాడారు? ఎంత సేపు మాట్లాడుకున్నారు? అన్న వివరాలను ప్రభాకర్‌రావు ముందుంచి ప్రశ్నించినట్లు సమాచారం. రాజకీయ నేతల ఫోన్ల ట్యాపింగ్ చేయించినట్లు కొంతవరకు ప్రభాకర్‌రావు అంగీకరించినట్లు తెలుస్తోంది. డేటా ధ్వంసానికి సంబంధించి నిబంధనలను పాటించలేదన్న విషయాన్ని కూడా ఆయన అంగీకరించారని సమాచారం. ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నుంచి అందిన ముఖ్యమైన రిట్రీవ్ డేటా ఆధారంగా కూడా ప్రభాకర్‌రావును సిట్ అధికారులు ప్రశ్నించారని తెలిసింది. తదుపరి విచారణలో ప్రభాకర్‌రావుతో పాటు ప్రణీత్‌రావును కలిపి విచారించాలని సిట్ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

17న మళ్లీ ప్రభాకర్‌రావు విచారణ

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఆదివారం నుంచి బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసేందుకు సిట్ సిద్ధమైంది. ఈ కేసులో బాధితులుగా ఉన్న రాజకీయ నేతలు, వ్యాపారస్తులు, విలేకరులను పిలిచి వారి వాంగ్మూలాలను సిట్ నమోదు చేయనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 17న మరోసారి విచారణకు హాజరుకావాలని ప్రభాకర్‌రావుకు సిట్ అధికారులు నోటీసు పంపారు. ఆయన వినియోగించిన ఫోన్లను కూడా అధికారులు సీజ్ చేయనున్నట్లు తెలిసింది.

ఏపీ 718 టీఎంసీలు... తెలంగాణ 286 టీఎంసీలు!

- వాటర్ ఇయర్ ముగియడంతో తేలిన కృష్ణా జలాల లెక్కలు
- 11 ఏళ్లలో తొలిసారి పెరిగిన తెలంగాణ వినియోగం



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 2024-25 వాటర్ ఇయర్ (2024 జూన్ 1వ తేదీ నుంచి 2025 మే 31వ తేదీ దాకా) కృష్ణా బేసిన్‌లో ఎవరెంత మేర నీటిని వినియోగించారనే లెక్కలు తేలాయి. కృష్ణా బోర్డు పూర్తి లెక్కలను తీసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. తెలుగు రాష్ట్రాలు మొత్తం 1004 టీఎంసీల నీటిని వాడుకోగా... అందులో ఏపీ వినియోగం 718 టీఎంసీలు, తెలంగాణ వాడకం 286 టీఎంసీలుగా గుర్తించారు. 11 ఏళ్లలో తొలిసారిగా తెలంగాణ నీటి వినియోగం పెరిగింది. 2019-20లో గరిష్ఠ వినియోగం 278 టీఎంసీలు కాగా... 2022-23లో 273 టీఎంసీలే. ఇక శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా ఏపీ 207 టీఎంసీల నీటిని తరలించింది. హంద్రీనీవా సుజల స్రవంతి కోసం 30 టీఎంసీలు, ముచ్చుమర్రి ద్వారా 3 టీఎంసీలు, చెన్నై వాటర్ కోసం 3 టీఎంసీల నీటిని ఏపీ తరలించింది. తెలంగాణ మాత్రం కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 50 టీఎంసీల నీటిని తరలించిందని గుర్తించారు. నాగార్జునసాగర్ నుంచి సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి 192 టీఎంసీలు, ఎడమకాల్వ ద్వారా(పాలేరు దాటిన తర్వాత ఏపీ భూభాగం కోసం) 29 టీఎంసీల నీటిని ఏపీ తరలించింది. ఒక తెలంగాణ విషయానికి వస్తే..సాగర్ ఎడమ ప్రధాన కాలువ నుంచి 115 టీఎంసీలు, జంట నగరాల తాగునీటి అవసరాలకు 16 టీఎంసీలు, ఏఎమ్మార్పీ నుంచి 44 టీఎంసీలు కలిపి 175 టీఎంసీలు తరలించినట్లు తేల్చారు. ఇక ప్రకాశం బ్యారేజీ నుంచి ఏపీ 164 టీఎంసీలు, తుంగభద్ర నుంచి 80 టీఎంసీలు, గుంటూరు చానల్ నుంచి 2 టీఎంసీల నీటిని తరలించారని గుర్తించారు. మొత్తం కలిపి 718 టీఎంసీలు ఏపీ వాడుకోగా... తెలంగాణ 286 టీఎంసీలుగా లెక్కలు తీశారు. గత రెండేళ్లుగా కృష్ణాలో 50: 50 శాతం నిష్పత్తితో నీటిని పంచాలని తెలంగాణ పట్టుబడుతున్న విషయం విదితమే. దీనిపై తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి ఒప్పందాలు ఏమీ లేవు. కృష్ణా ట్రిబ్యునల్-2(జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్)లో నీటి కేటాయింపులపై విచారణ జరగనుంది. అయితే అప్పటిదాకా త్రిసభ్య కమిటీ(కృష్ణాబోర్డు మెంబర్ సెక్రటరీ కన్వీనర్‌గా, తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు)కే నీటి పంపిణీ అధికారాలు ఇచ్చారు.

కృష్ణాబోర్డు లెక్కల ప్రకారం 11 ఏళ్ల నీళ్ల గణాంకాలు

సంవత్సరం	ఏపీ వినియోగం (టీఎంసీల్లో)	తెలంగాణ వినియోగం (టీఎంసీల్లో)
2014-15	529.330	227.743
2015-16	124.960	69.688
2016-17	282.512	153.386
2017-18	359.897	183.298
2018-19	504.476	207.298
2019-20	653.064	278.234
2020-21	618.935	253.234
2021-22	621.841	265.051
2022-23	637.996	273.300
2023-24	210	120
2024-25	718	286

నా జీవితం ప్రజలకే అంకితం

- మంత్రిగా అవకాశమిచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్, పీసీసీ చీఫ్‌లకు రుణపడి ఉంటా: మంత్రి వాకిటి శ్రీహరి
- గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌తో మర్యాదపూర్వక భేటీ

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మంత్రిగా అవకాశమిచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌లకు జీవితాంతం రుణపడి ఉంటానని వ్యాఖ్యానించారు. అలాగే మక్తల్ నియోజకవర్గ ప్రజలకు.. మంత్రి కావడానికి సహకరించిన మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన.. శనివారం తొలిసారి గాంధీభవన్‌ను సందర్శించి మహేశ్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్‌కు సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాలకు చెందిన శ్రీహరి మంత్రి పదవికి అన్ని రకాలుగా అర్హుడన్నారు. ఆయనకు మంత్రి పదవి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీలోనూ.. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు సామాజిక న్యాయానికి ప్రాధాన్యత కల్పిస్తామని పునరుద్ఘాటించారు.


శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

సీఎం చిత్రపటానికి దివ్యాంగుల పాలాభిషేకం..

దివ్యాంగులు దివ్యాంగులనే పెళ్లి చేసుకున్నా రూ.లక్ష ప్రోత్సాహకం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం జరిపారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

రామ దర్బారులో భక్తులకు ప్రవేశం

- పాసులు ఉన్నవారికే పరిమితం

అయోధ్య, జూన్ 14: అయోధ్య శ్రీరామ మందిరం మొదటి అంతస్తులో నూతనంగా ప్రాణ ప్రతిష్ఠ చేసిన రామ దర్బారులో శనివారం నుంచి భక్తులకు ప్రవేశం కల్పించారు. పాసులు ఉన్నవారికి మాత్రమే ప్రవేశాలను పరిమితం చేశారు. భక్తులకు ప్రవేశం కల్పించాలని శుక్రవారం సాయంత్రమే నిర్ణయం తీసుకున్నారని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్ర చెప్పారు. అనంతరం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ స్థానిక అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేయించారని తెలిపారు. రామ దర్బారు దర్శనానికి రెండు గంటల వ్యవధి ఉండేలా టైం స్లాట్లు ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు మొదటి స్లాట్ కాగా, 9-11, 1-3, 3-5, 5-7 గంటల వరకు స్లాట్లు ఉంటాయి. 7 గంటల నుంచి రాత్రి 9 గంటలకు చివరి స్లాట్ ఉంటుంది. ఒక్కో స్లాట్‌కు 300 పాసులు జారీ చేస్తారు. ఇందులో 150 ఆలయ కమిటీ, మిగిలిన 150 జిల్లా యంత్రాంగం పరిధిలో ఉంటాయి. 100 పాసులు ప్రత్యేక దర్శనం, 50 పాసులు శీఘ్ర దర్శనం రూపంలో మంజూరు చేస్తారు. రామ దర్బారును దర్శించాలన్న ఆసక్తి ఉన్నవారికి ఈ పాసులు ఇస్తామని అనిల్ మిశ్ర తెలిపారు.



నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి. శరణి నారాయణ

నీట్-2025 ఫలితాల్లో నారాయణ విజయ పరంపర

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఆలిండియా క్యాటగిరీలలో నారాయణ విద్యార్థులు విజయం సాధించారని ఆ సంస్థ డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి. శరణి నారాయణ పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో మృణాల్ కిషోర్ ఝా 4వ ర్యాంకు, కేశవ్ మిట్టల్ 7వ ర్యాంకు , సౌమ్యశర్మ 14వ ర్యాంక్, కె.జీవన్ సాయికుమార్ 18వ ర్యాంకు, రూపయన్ పాల్ 20వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. వీటితో పాటు 100 లోపు 22 ర్యాంకులు, 1000 లోపు 85 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఆలిండియా అన్ని క్యాటగిరీల్లో 10 లోపు 8 ర్యాంకులు, 100 లోపు 65 ర్యాంకులు, 1000 లోపు 216 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా సింధూర నారాయణ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకు సాధించటం తెలుగు వారికి గర్వకారణమన్నారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలిపారు.



నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు సుష్మ, సీమ

శ్రీచైతన్య అగ్రస్థానం

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో పాటు టాప్ ర్యాంకులు సాధించడంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు అగ్రస్థానంలో నిలిచాయని ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. శనివారం ఆమె డైరెక్టర్ సీమతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆలిండియా మొదటి ర్యాంక్ కవిష్ సాధించగా.. దివ్య (5వ ర్యాంకు), మహ్మద్ సమీర్ (6వ, ఓబీసీ), ధీరజ్‌కుమార్ (8వ, ఎస్టీ), ఎం.వరుణ్ (10వ, ఓబీసీ) ర్యాంకులు సాధించింది శ్రీచైతన్య క్లాస్ రూమ్ ప్రోగ్రామ్ విద్యార్థులేనని ఆమె పేర్కొన్నారు. నాణ్యమైన శిక్షణ అందించడం వల్లనే మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఓపెన్ క్యాటగిరిలో 100లోపు అత్యధిక ర్యాంకులు సాధించింది కూడా తమ విద్యాసంస్థలకు చెందినవారేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులను ఆమె అభినందించారు. జేఈఈ ఫలితాల్లో సాధించిన విజయాలు నీట్‌లోనూ పునరావృతం అయ్యాయని ఆమె పేర్కొన్నారు.



కరీంనగర్‌లో నీట్ టాపర్లను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

సుభాష్‌నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లి అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్‌లో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటిష్టమైన ప్రణాళికతో చేస్తున్న విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అకుంఠిత దీక్ష, పట్టుదల, కృషితో ఇంతటి విజయాన్ని సాధించినట్లు చెప్పారు. తక్కువమంది విద్యార్థులతో అధిక సీట్లు సాధించడం అల్ఫోర్స్ విజయాలకు నిదర్శనమన్నారు. అల్ఫోర్స్‌ను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నీట్-2025 ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. నీట్‌లో జాతీయస్థాయిలో ఎస్ఆర్ విద్యార్థులు ర్యాంకులు సాధించి మరోసారి విజయపథాన్ని ఎగురవేసినట్లు ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. వివిధ క్యాటగిరిల్లో జాతీయ స్థాయిలో పి.సాయి దివ్యాన్ 14వ ర్యాంకు, బి.ప్రియాంక 100వ ర్యాంకు, ఎం.వినయ్ 226వ ర్యాంకు, బి.గణేష్ 671వ ర్యాంకు సాధించి విజయభేరి మోగించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన 210 మందికిపైగా విద్యార్థులు మెడిసిన్‌లో సీట్లు సాధించే ర్యాంకులు సంపాదించారన్నారు. నీట్‌లో అత్యధిక ర్యాంకులు సాధించి ఎస్ఆర్ కళాశాల పేరును నిలబెట్టిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

నీట్ ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విజయ భేరి

గుంటూరు(విద్య), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని సంస్థ మెయిన్ బ్రాంచిలో శనివారం ఆయన విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులు కె.విక్రాంత్ ఆలిండియా 9వ ర్యాంకు, ఎన్.మనస్విని ఆలిండియా 49వ ర్యాంకు, ఆర్.తరుణ్ కుమార్ నాయక్ ఆలిండియా 51వ ర్యాంకు, షేక్ వసీమా ఆలిండియా 80వ ర్యాంకు, సోలే ప్రేమ్ జడ్సన్ ప్రసన్న ఆలిండియా 108వ ర్యాంకు, పి.సంజన ఆలిండియా 182వ ర్యాంకులతో సత్తాచాటారని రామకృష్ణ తెలిపారు. ఆరుగురు విద్యార్థులు ఆలిండియా 200లోపు ర్యాంకులు సాధించారని వెల్లడించారు. కేవలం ఒక్క బ్రాంచి నుంచే 145 మంది విద్యార్థులు ఫ్రీ మెడికల్ సీట్లు సాధించగల ర్యాంకులు పొందడం తమ సంస్థకు గర్వకారణమని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను సంస్థ చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందించారు.

అత్యధిక మార్కులు 686

(మొదటిపేజీ తరువాయి)

చెందిన క్రిషాంగ్ జోషి మూడో ర్యాంకు (99.9998189 పర్సంటైల్), ఢిల్లీకి చెందిన మృణాల్ కిశోర్ ఝా 4వ (99.9998189 పర్సంటైల్), ఢిల్లీకే చెందిన అవికా అగర్వాల్ 5వ ర్యాంకు (99.9996832 పర్సంటైల్) సాధించారు. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ రంగంలో 56,000 ఎంబీబీఎస్ సీట్లు, ప్రైవేటు రంగంలో 52,000 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. డెంటల్, ఆయుర్వేదం, యునాని, సిద్ధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నీట్ ర్యాంకులనే పరిగణనలోకి తీసుకుంటారు. ఈసారి జనరల్ క్యాటగిరీలో 144, ఎస్సీ ఎస్టీ, ఓబీసీలకు 113, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 127 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించారు.

గురుకుల విద్యార్థుల సత్తా..

తెలంగాణ ఎస్టీ గిరిజన గురుకుల విద్యార్థులు 538 మంది నీట్‌కు హాజరుకాగా.. వారిలో 306 మంది అర్హత సాధించినట్లు ఆ సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 8 మంది విద్యార్థులు ఎస్టీ కేటగిరీలో 2వేలలోపు ర్యాంకులు సాధించారని, 62 మంది 7వేల లోపు ర్యాంకులు సాధించారని వివరించారు. ఇక ఎస్సీ గురుకుల విద్యార్థులు కూడా నీట్‌లో మంచి ఫలితాలు సాధించారని ఆ సంస్థ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు.

టాప్-100లో తెలుగు విద్యార్థులు 11 మంది..

నీట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన 11 మంది టాప్-100లో నిలిచారు. ఇందులో తెలంగాణ వారు ఐదుగురు, ఆంధ్రప్రదేశ్ వారు ఆరుగురు ఉన్నారు. హైదరాబాద్ విద్యార్థి కాకర్ల జీవన్ సాయికుమార్ 18వ ర్యాంకుతో దక్షిణాది రాష్ట్రాల్లోనే టాపర్‌గా నిలిచాడు. తెలంగాణకు చెందిన షణ్ముఖ నిశాంత్ అక్షింతల 37వ ర్యాంకు, మంగరి వరుణ్ 46, యంద్రపాటి షణ్ముఖ్ 48, బిదిషా మాజీ 95వ ర్యాంకు సాధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి.కార్తీక్‌రామ్ కిరీటి 19వ ర్యాంకు, కె.మోహిత్‌శ్రీరామ్ 56వ, డి.సూర్యచరణ్ 59వ, పి.అవినాష్ 64వ, వై.సమీర్‌కుమార్ 70వ, టి.శివమణిదీప్ 92వ ర్యాంకు సాధించారు.



కార్తీక్‌రామ్ 19వ ర్యాంకు



షణ్ముఖ్ 48వ ర్యాంకు



అశుతోష్ 32వ ర్యాంకు (ఎస్టీ కోటా)



వెన్నెల 307వ ర్యాంకు

ప్రతిభ చూపిన విద్యార్థులు..

హైదరాబాద్ వైద్యుడు వంశీకృష్ణ కుమారుడు మంగరి వరుణ్ నీట్‌లో జాతీయస్థాయిలో 46వ ర్యాంకు సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో మంచి స్థానంలో నిలిచానని, ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేస్తానని తెలిపారు. జాతీయస్థాయిలో 48వ ర్యాంకు (ఓబీసీ కేటగిరీలో 11) సాధించిన యంద్రపాటి షణ్ముఖ్ హనుమకొండకు చెందిన శ్యాంసుందర్-రజనీ దంపతుల కుమారుడు. మంచి ర్యాంకు సాధించడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం వైద్యుడు తూము రామకృష్ణ, నవ్య దంపతుల కుమార్తె వెన్నెల 307వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ర్యాంకు సాధించగలిగానని, ఎంబీబీఎస్ చేసి ప్రజలకు సేవ చేస్తానని ఆమె చెప్పారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంజపల్లి తండాకు చెందిన అజ్మీరా అశుతోష్ నీట్ ఎస్టీ కోటాలో 32వ ర్యాంకు (జనరల్ 5,422) సాధించారు. అశుతోష్ తల్లిదండ్రులు శాంత-లింగం ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వికారాబాద్ జిల్లా తాండూరు ఉపాధ్యాయుడు లక్ష్మీకాంతరావు-విద్యారాణి దంపతుల కుమారుడు హరీశ్ గౌతమ్ జాతీయ స్థాయిలో 660వ ర్యాంకు సాధించారు.

ర్యాంకుల్లో తక్కువ.. ఉత్తీర్ణతలో ఎక్కువ..

అమ్మాయిలు ఈసారి తక్కువ మందే టాప్ ర్యాంకులు సాధించారు. కానీ మొత్తంగా ఉతీర్ణుల సంఖ్యలో ఎక్కువగా నిలిచారు. టాప్-20లో ఇద్దరు, టాప్-50లో ఐదుగురు అమ్మాయిలే ర్యాంకులు సాధించారు. అదే ఉత్తీర్ణుల్లో అమ్మాయిలు 7,22,462 మందిఉండగా.. అబ్బాయిలు 5,14,063 మాత్రమే. మహిళా కేటగిరీలో హైదరాబాద్ అమ్మాయి బిదిషా మాజీ 13వ స్థానం (జనరల్ 95), బ్రాహ్మణి రెండ్ల 17వ స్థానం (జనరల్ 108) సాధించారు. ఢిల్లీకి చెందిన అవికా అగర్వాల్ జాతీయస్థాయిలో 5వ ర్యాంకుతో మహిళల్లో టాపర్‌గా నిలిచారు. ఢిల్లీకే చెందిన ఆషి సింగ్ 12వ ర్యాంకుతో రెండో స్థానంలో ఉన్నారు. మహిళల టాప్-20 ర్యాంకుల్లో ఢిల్లీ అమ్మాయిలు అత్యధికంగా 8 మంది, మహారాష్ట్ర నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ఇద్దరు ఉన్నారు.

ఎన్ని మార్కులకు ఏ ర్యాంకు..?

ఏ ర్యాంకు వరకు	సాధించిన మార్కులు
50,000	502
1,00,000	464
1.50,000	433
2,00,000	105
2,50,000	380
3,00.000	357
3,50,000	336
4,00,000	316
4,50,000	298
5,00,000	281

ఎందరు అభ్యర్థులకు ఎన్ని మార్కులు?

మార్కులు	అభ్యర్థుల సంఖ్య
144- 200	3,03,040
201- 250	1,98,346
251- 300	1,57,952
301- 350	1,26,935
351- 400	1,05,578
401- 450	88,239
451- 500	69,503
501- 550	39,521
551- 600	1,0658
601- 650	1,259
651- 686	73

కేటగిరీల వారీగా తెలుగు రాష్ట్రాల ర్యాంకులు..

- ఓబీసీ క్యాటగిరీలో జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు చెందిన మంగరి వరుణ్ 10వ స్థానంలో (జనరల్ 46) నిలిచారు.
- ఎస్సీ క్యాటగిరీలో తెలంగాణకు చెందిన రెడ్డిమల్ల శ్రీశాంత్ 3వ స్థానం (జనరల్ 147), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కరుమంచి విక్రాంత్ 9వ స్థానం(జనరల్ 262)లో నిలిచారు.
- ఎస్టీ విభాగంలో తెలంగాణకు చెందిన పూజారి హాసిని 3వ స్థానం (జనరల్-377), బానోత్ ధీరజ్ కుమార్ 8వ స్థానం (జనరల్-1178), అజ్మీరా అశుతోష్ 32వ స్థానంలో (జనరల్ 5,422) నిలిచారు.

అమ్మమ్మ కల.. నాన్న ప్రోత్సాహం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- రోజుకు 14 గంటల పాటు చదువు
- మాక్ టెస్టుల్లో దొర్లిన తప్పులు పునరావృతం కాకుండా సాధన
- దక్షిణాది టాపర్‌గా నిలవడం సంతోషం
- 'ఆంధ్రజ్యోతి'తో నీట్ ఆలిండియా 18వ ర్యాంకర్ కాకర్ల జీవన్ సాయికుమార్

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్-2025 యూజీ పరీక్షలో రాష్ట్రానికి చెందిన కాకర్ల జీవన్ సాయికుమార్ జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించాడు. తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాదిలోనే టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా జీవన్ సాయికుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి మాట్లాడగా.. తాను పరీక్షలకు ఎలా సిద్ధమయ్యాడు ? కుటుంబసభ్యుల నుంచి లభించిన ప్రోత్సాహం, భవిష్యత్తు ప్రణాళిక తదితర అంశాలను పంచుకున్నాడు.

వైద్య వృత్తిని ఎందుకు ఎంచుకున్నారు ?

నేను డాక్టర్ అవ్వాలన్నది మా అమ్మమ్మ కల. ఆమె నన్ను చాలా గారాబంగా పెంచారు. అప్పట్లో ఓసారి ఆమె అనారోగ్యానికి గురవ్వగా.. "నువ్వు డాక్టరయితే నాకు వైద్యం చేశేవాడివిరా" అనేది. నా మూడున్నరేళ్ల వయసులోనే ఆమె చనిపోయింది. కానీ, నాతో అన్న మాటలు నా మనసులో బలంగా నాటుకుపోయాయి. అలా చిన్నప్పటి నుంచే డాక్టర్ కావాలని అనుకుంటున్నా.

ఏ కాలేజీలో చేరతారు?

ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చదవాలనుకుంటున్నాను. నాకు వచ్చిన ర్యాంకుతో ఆ కాలేజీలో సీటు వస్తుందనే నమ్మకముంది.

మీ విజయం వెనుక ఎవరెవరి ప్రోత్సాహం ఉంది?

మా అమ్మా, నాన్న, నాకు పాఠాలు చెప్పిన అధ్యాపకులు అంతా నన్ను ప్రోత్సహించారు. 'నీ ప్రయత్నం బలంగా చెయ్ ఫలితం కోసం ఆలోచించకు. ఆందోళన పెట్టుకోకుండా చదువు' అని చెబుతూ నాన్న నిత్యం ప్రోత్సహించేవారు. అమ్మ నాకు కావలసినవన్నీ ఏర్పాటు చేసేది. అధ్యాపకులు మార్కులు ఎలా తెచ్చుకోవాలనే మెళకువలు చెప్పేవారు. మాక్ టెస్టుల్లో ఏమైనా తప్పులు దొర్లితే అవి పునరావృతం కాకుండా జాగ్రత్తపడేవాడిని.



కుటుంబసభ్యులతో కాకర్ల జీవన్ సాయికుమార్

రోజు ఎంత సమయం చదివేవాడివి?

కాలేజీ, నీట్ శిక్షణ కేంద్రంలో కలిపి రోజుకు 14 గంటలు చదివేవాడిని. అయితే ఎంతసేపు చదివామన్నది కాదు, ఎంత మనసుపెట్టి చదివామనేదే ముఖ్యం.

ఈ ఫలితం ఊహించారా ?

నేను ఒత్తిడికి గురైన సందర్భాలు కొన్ని ఉన్నాయి. అయితే కీ చూశాక నాకు మంచి ర్యాంకు వస్తుందని కచ్చితంగా అనుకున్నాను. అయితే దక్షిణాదిలోనే మొదటి ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది.

మాటలు రావడం లేదు..

మాది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా. నేను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ బోధిస్తున్నాను. నా భార్య గృహిణి. పరీక్ష ముందురోజు మా అబ్బాయి చాలా ఒత్తిడికి గురయ్యాడు. శక్తివంచన లేకుండా ప్రయత్నించావు. అనుకున్న ర్యాంకు వస్తే సంతోషం. ఒకవేళ ఇది మిస్ అయితే నీకోసం వేరే రంగం ఎదురు చూస్తుందని అనుకోవాలని చెప్పా.. ధైర్యంగా వెళ్లి పరీక్ష రాసి వచ్చాడు. కీ చూసుకున్నాక తప్పకుండా ర్యాంకు వస్తుందని చెప్పినపుడు మా కుటుంబం చాలా సంతోషించింది. ఈరోజు ఫలితాలు చూశాక ఇక చెప్పడానికి మాటలు రావడం లేదు.

- గంగాధర నాగ కుమార్ (సాయికుమార్ తండ్రి)

'ఏఐ-171' రద్దు!

దానిస్థానంలో ఏఐ-159

విమాన ప్రమాద మృతులకు నివాళిగా నెంబరుకు స్వస్తి

న్యూఢిల్లీ, జూన్ 14: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా... ఏఐ-171 విమాన ప్రమాదంలో 274 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా సంస్థ 'ఏఐ-171' నెంబరును రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. తమ ప్రయాణికుల మనోభావాలను, వారి సెంటిమెంటును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఇక నుంచి అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే విమానం ఏఐ-159 నెంబరుతో అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. దీనిపై ఎయిర్ ఇండియా వర్గాలు మీడియాతో మాట్లాడుతూ.. ఏదైనా దుర్ఘటన సంభవించినప్పుడు సాధారణంగా విమాన నెంబర్లను మారుస్తారని, ఇది అంతటా జరిగే ప్రక్రియేనని తెలిపాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళిగా ఏఐ-171ను ఏఐ-159గా మార్పు చేసినట్టు పేర్కొన్నాయి.

వైద్య విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

విమాన ప్రమాదంపై సుప్రీంకోర్టుకు ఇద్దరు డాక్టర్లు

న్యూఢిల్లీ, జూన్ 14: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన బి.జె.మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని కోరుతూ ఇద్దరు డాక్టర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కు లేఖ రాశారు. శిక్షణ పొందుతున్న ఆ వైద్యుల మృతి దేశానికి లోటని తెలిపారు. అందువల్ల తక్షణ పరిహారం కింద మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. దీర్ఘకాలిక పరిహారం కింద కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పరిహారం చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని కోరారు. తుదిపరిహారాన్ని నిర్ణయించేందుకు నిపుణుల కమిటీని నియమించాలని విన్నవించారు.

ప్రాణాలు కాపాడిన 11ఎ సీటు

- 2 విమాన ప్రమాదాల్లో మృత్యుంజయులిద్దరే

న్యూఢిల్లీ, జూన్ 14: అహ్మదాబాద్ ఎయిరిండియా (బోయింగ్ డ్రీమ్‌లైనర్) విమాన ప్రమాదంలో మాదిరే 27 ఏళ్ల క్రితం జరిగిన మరో విమాన ప్రమాదంలో థాయ్ గాయకుడు రువాంగ్సాక్ లోయ్‌చుషాక్ ఒక్కరే సురక్షితంగా బతికి బయట పడ్డారు. అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో మృత్యుంజయుడైన భారత సంతతి బ్రిటన్ పౌరుడు రమేశ్ బిశ్వాస్.. తాను కూర్చున్న '11ఎ' సీటు పక్కనే ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఉండటం వల్లే ప్రాణాలతో బయటపడ్డానని చెప్పారు. 1998 డిసెంబర్ 11న దక్షిణ థాయిలాండ్‌లో ల్యాండవుతూనే ప్రమాదానికి గురైన థాయి ఎయిర్‌వేస్ విమాన ప్రయాణికుల్లో రువాంగ్సాక్ కూడా '11ఏ' సీటులో కూర్చోవడం వల్లే ప్రాణాలతో బయటపడ్డారు. ఎయిరిండియా విషాదం తెలియగానే రువాంగ్సాక్.. తానూ గతంలో మృత్యుముఖం నుంచి బయటపడ్డ సంగతిని ఫేస్‌బుక్‌లో గుర్తు చేసుకున్నారు. థాయి విమాన ప్రమాదం తనకు పునర్జన్మనిచ్చిందని, దాని ప్రభావంతో దశాబ్దం పాటు విమాన ప్రయాణానికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు రువాంగ్సాక్ సంతాపం తెలిపారు. తాజాగా రమేశ్ బిశ్వాస్ ప్రాణాలతో బయటపడటంతో విమానాల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్ సీట్లపై ఆసక్తి పెరుగుతోంది.

కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదు..!

- ప్రజలపై భారం మోపే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలి
- ప్రాజెక్టుకు ఏటా వేల కోట్ల ఖర్చు వద్దు
- కాళేశ్వరానికి అన్నీ నేనేనన్న కేసీఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారు
- కగార్ పేరుతో కమ్యూనిస్టులను లేకుండా చేయాలని మోదీ కలలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



న్యూశాయంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు ఇకముందు ఎంతమాత్రమూ పనికిరాదని, ప్రజలపై భారం మోపే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలో శనివారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిష్ఫలంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ కోసం ఏటా రూ.వేల కోట్ల ప్రజల సొమ్మును ఖర్చు చేయొద్దన్నారు. 'కాళేశ్వరం అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే కాళ్వేరం..' అని అన్నోళ్లు ప్రస్తుతం నోరు మూసుకున్నారని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'నా మెదడును కరిగించి డిజైన్ చేశాను.. కాళేశ్వరానికి అన్నీ నేనే..' అన్న కేసీఆర్.. ఇప్పుడు తనకు సంబంధం లేదంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బాధ్యత ఇంజనీర్‌లదేనని ఇప్పుడు తప్పించుకోవడం అన్యాయమని కూనంనేని అన్నారు. ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సి ఉండగా, మహారాష్ట్ర అనుమతివ్వకపోవడంతో కాళేశ్వరానికి మార్చామని హరీశ్‌రావు అంటున్నారని, అలాగని జనాలను ముంచే ప్రాజెక్టు కడతారా? అని ప్రశ్నించారు. 140 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలని తాము డిమాండ్ చేశామని, అక్కడ నిర్మిస్తే అన్ని జిల్లాలకు సాగునీరు అందేదని తెలిపారు. కాళేశ్వరం నిర్మించాక ఒక్క చుక్క నీరు అదనంగా ఇవ్వలేదని, ఇప్పుడు పంటలకు వచ్చేది ఎల్లంపల్లి నీళ్లేనన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టులను లేకుండా చేయాలని మోదీ ప్రభుత్వం కలలు కంటోందని కూనంనేని అన్నారు. పోలీసుల కాల్పుల్లో చనిపోయిన నంబాల కేశవరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. 2026 మార్చినాటికి మావోయిస్టులను అంతం చేస్తామని చెప్పడం ఒక ఫ్యూడల్, గూండా, ఫాసిస్టు పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఒక్క నంబాల కేశవరావును చంపితే దేశంలో కోట్లాది మంది స్పందించారని, అదీ కమ్యూనిస్టులకు ఉన్న మానవతావాదానికి నిదర్శనమని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.